మహిళా గొంతుక

మాతృక

ప్రగతిశీల మహిళా సంఘం (పీవోడబ్ల్యూ) అధికార మాసపత్రిక

MAHILA GONTUKA MATRUKA

సంపుటి: 8 సంచిక: 10 మార్చి 2023 **94** పేజీలు: 48 వెల: రూ. 15/-



విజయవంతంగా జరిగిన ప్రగతిశీల మహిళా సంఘం (POW) తెలంగాణ మూడవ రాష్ట్ర మహాసభలు

మహాసభలో ప్రసంగిస్తున్న వక్తలు

C.I



కా. విష్ణు



కా. ఆశాలత



కా. సంధ్య



కా. సుభద్ర




కా. గౌని ఐలయ్య



కా. సాధినేని వెంకటేశ్వరరావు



కా. సరళ



కా. ఊకె పద్మ



కా. నర్సక్క



కా. నిర్మల



కా. అంబిక



కా. భండారు విజయ

మహిళా గొంతుక
మాతృక
MAHILA GONTUKA MATRUKA

సంపుటి : 8 | సంచిక : 10 | పేజీలు: 48 | మార్చి 2023

విషయసూచిక

వాళ్లను కూర్చోనివ్వండి, చివుళ్లు, కవితల బొమ్మలు
అక్కా చెల్లెళ్లు, దేవుని పెండ్లాలు కథల బొమ్మలు : కోసూరి శ్రీనివాస్

POW

మహిళా సంఘటిత శక్తి
ఉద్యమించే మహిళల ఊపిరి

ఎడిటర్
చొప్పర పద్మ

సంపాదకవర్గం
వి. సంధ్య
ఎన్. విష్ణు
బి. రమాసుందరి

రాజకీయ, ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక సమానత్వం కోసం పోరాడుదాం

కవర్ డిజైనింగ్
బ్రహ్మం భావన గ్రాఫిక్స్
హైదరాబాద్
98482 54745

డిజైనింగ్
అక్షర గ్రాఫిక్స్
నల్లకుంట, హైదరాబాద్
90104 44935

ముద్రణ
నవ్య ప్రింటర్స్,
హిమాయత్‌నగర్, హైదరాబాద్-29

రచనలు, చందాలు
పంపవలసిన చిరునామా
మహిళా గొంతుక
మాతృక
35-3-6931 (4),
కామ్రేడ్ మాదాల నారాయణస్వామి భవన్,
సంజయ్‌గాంధీ కాలనీ, శర్మ కాలేజీ దగ్గర,
ఒంగోలు - 523 001
సెల్: 9676206230,
ఫోన్: 08592-238350
E.mail : matruka2015@gmail.com

ఏ దేశమేగినా...!

"...నిలుపరా నీ జాతి నిండు గౌరవము" అన్న రాయప్రోలు సుబ్బారావు గారి సందేశాన్ని ఆర్ఎస్ఎస్-బీజేపీ నాయకుడు రాం మాధవ్ తమ హిందూత్వ పద్ధతిలోనే పాటించాలని డిమాండ్ చేస్తున్నాడు. అమెరికా నగరం సియాటెల్ నగర కౌన్సిల్, "ఉపాధి, రిటెయిల్, హౌసింగ్, ప్రజా రవాణా..." మొదలైన రంగాల్లో కుల వివక్ష పాటించిన వారిపై శిక్షలు విధిస్తూ కొద్ది రోజుల క్రితం ఒక ఆర్డినెన్స్ జారీ చేసింది. ఇలాంటి ఆర్డినెన్స్ జారీ చేయటం రాం మాధవ్ గారికి సుతరామూ నచ్చలేదు. ఆగ్రహం తెప్పించింది. 'భారత దేశంలో కుల వివక్షను పాటించడమే ఒక దరిద్రం అయితే ఆ దరిద్రాన్ని అమెరికాకు కూడా పట్టుకుపోతారా?' అని ఆయన ఆగ్రహించారని గబుక్కున అనిపిస్తే వారు నిరాశ చెందక తప్పదు. రాం మాధవ్ ఆగ్రహానికి కారణం దానికి పూర్తిగా విరుద్ధం. "ఇండియాలో దారుణమైన కుల వివక్ష పాటిస్తారని లిబరల్, కమ్యూనిస్టు మేధావుల గుంపు ఇప్పటికే ప్రపంచం అంతా దుష్ప్రచారం చేస్తున్నారు. ఇప్పుడు అమెరికాలో కూడా భారతీయులు కుల వివక్ష పాటిస్తున్నారని దుష్ప్రచారం చేస్తారా? ఈ విధంగా భరత జాతి నిండు గౌరవాన్ని మంట గలుపుతారా" అని రాం మాధవ్ ప్రశ్నిస్తున్నాడు.

రాం మాధవ్ లేదా ఆర్ఎస్ఎస్-బీజేపీ విధానం కుల వివక్షను రూపుమాపడం ద్వారా భారత జాతి గౌరవం నిలుపుకోవడం కాదు. వారికా ఆలోచన వీసమెత్తు కూడా లేదు. వారి దృష్టిలో నిచ్చెన మెట్ల కుల వ్యవస్థ కొనసాగాలి. తద్వారా అగ్ర కులాల ఆధిపత్యం, సేవక కులాల శ్రమ సేవలు కొనసాగాలి. కులాధిపత్యం ద్వారా అగ్ర కులాల్లోని మెజారిటీ ప్రజలు ఫైనాన్స్, సైన్స్, టెక్నాలజీ, పారిశ్రామిక, వ్యవసాయ, ఉపాధి రంగాల్లో అనుభవిస్తున్న ఆర్థిక సౌకర్యాలు కొనసాగుతూ మరింత పటిష్టం కావాలి. స్థూలంగా చూస్తే భారత సామాజిక వ్యవస్థ పునాదిలో ఫ్యూడల్ సంబంధాలు మరింత పటిష్టం కావాలి. ఉపరితలంలో మాత్రం పశ్చిమ దేశాల పరిపక్వ పెట్టుబడిదారీ వ్యవస్థలు సాధించిన ప్రగతి, ఆధునిక జీవనం తాలూకు సుఖాలు బీరు పోకుండా ఆధిపత్య వర్గ-కులాలకు అందాలి.

ఫిబ్రవరి 25 తేదీన ద ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌లో ఒక ఒపీనియన్ పీస్ రాస్తూ రాం మాధవ్ -19వ శతాబ్దం చివర, 20వ శతాబ్దం ఆరంభంలో వ్యవసాయ, రైల్ రోడ్ కార్మికులుగా అమెరికా వెళ్లిన భారతీయులను "అమెరికాలోకి అనుమతించిన వలస జాతుల్లో భారత జాతి (పనుల కోసం) కోరదగ్గ జాతుల్లో చిట్టచివరి జాతిగా యూనివర్సల్‌గా పరిగణిస్తున్నారు" అని అమెరికన్ కాంగ్రెస్ కమిటీ ప్రకటించే స్థాయిలో వివక్షకు గురయ్యారని వాపోయాడు. ఆ స్థితి నుండి అంచెలంచెలుగా ఎదిగి ఇప్పుడు రానున్న ఎన్నికల్లో ఇద్దరు ఇండియన్ అమెరికన్లు (నిక్కీ హేలీ, వివేక్ రామస్వామి) అమెరికా అధ్యక్ష పదవికి పోటీ పడే స్థితికి భారత జాతి ఎదిగిందని ఆయన గొప్పలు పోయాడు. అక్కడి నుండి వేదనలోకి దిగిపోతూ "..కనుక సియాటెల్ ఆర్డినెన్స్ గట్టి ప్రశ్నలు లేవనెత్తుతోంది. ఈ రోజు ఇండియన్-అమెరికన్‌లలో కుల వివక్ష నిజంగానే ఒక వాస్తవమా? లేక అమెరికాలో అత్యంత విజయవంతమైన వలస సమూహంగా ఎదిగిన ఇండియన్-అమెరికన్‌లను అపఖ్యాతి పాలు చేసేందుకు పన్నిన పాపిష్టి పథకమా?" అని ప్రశ్నించాడు. ఇందులో రెండవదే రాం మాధవ్ సమాధానం అని వేరుగా చెప్పనవసరం లేదు.

ఈక్వాలిటీ ల్యాబ్స్ అనే సంస్థ 'అమెరికాలో పని స్థలాల్లో ఇండియన్-అమెరికన్లలో అమలవుతున్న కుల వివక్ష' అనే అంశంపై 2018లో ఒక నివేదిక ప్రచురించింది. దాని ప్రకారం 67 శాతం మంది దళితులు పని ప్రదేశాల్లో తాము కుల వివక్ష ఎదుర్కొంటున్నామని చెప్పారు. కులం పేరుతో దాడులు, దూషణలు ఎదుర్కొన్నామని 25 శాతం మంది పేర్కొన్నారు. చదువుకునే దగ్గర వివక్ష ఎదుర్కొన్నామని ముగ్గురిలో ఒక దళిత విద్యార్థులు చెప్పారు. కుల-ఆధారిత అవమానకర జోక్‌లు ఎదుర్కొన్నామని 60 శాతం దళితులు పేర్కొన్నారు. 40% దళితులు, 14% శూద్రులు దేవాలయాల్లో వివక్ష ఎదుర్కొన్నామని చెప్పారు. వ్యాపారాల్లో వివక్ష ఉన్నదని 20శాతం దళితులు భావిస్తున్నారు. ప్రేమ సంబంధాల్లో కులం వల్ల తిరస్కరణ ఎదుర్కోవలసి వచ్చిందని 40 శాతం దళితులు చెప్పగా (ఆ మిగిలిన 60 మంది అమెరికాలో వున్నందుకు అదృష్టవంతులు అని భావించాలి మరి), ఇద్దరు దళితుల్లో ఒకరు, నలుగురు శూద్రుల్లో ఒకరు తమ కులం ఎక్కడ బయటపడుతుందో అన్న భయంతో బ్రతుకుతున్నట్లు చెప్పారు. ఇండియాలో బ్రాహ్మణులు ముక్త కంఠంతో చెప్పేమాట "సాఫ్ట్ వేర్ ఇండస్ట్రీ మాకు ఒక పెద్ద వరంలా వచ్చింది. లేకుంటే పౌరోహిత్యం ఉపాధి తగ్గిపోయిన పరిస్థితుల్లో బ్రాహ్మణ పేదల పరిస్థితి కనాకష్టంగా ఉండేది" అని. సాఫ్ట్‌వేర్ ఇండస్ట్రీలో ఈ ఇండస్ట్రీ ద్వారా వై2కే (ఇయర్ 2000) నుండి అమెరికా చేరిన వారిలో ఎవరు ముందు ఉన్నారో ఈ ఒక్క ఉపశమన నిట్టూర్పు పట్టిస్తుంది.

ఈక్వాలిటీ ల్యాబ్స్ నివేదికని ఒక కుట్రగా, ఒక పాపిష్టి పథకంగా రాం మాధవ్ కొట్టివేస్తున్నాడు. 2001లో దర్బన్ (దక్షిణాఫ్రికా)లో రేసిజం, రేసిజం వివక్ష, జాతి హననం (జినోఫోబియా), సంబంధిత అసహనాల నిర్మూలనపై వరల్డ్ రివ్యూ కాన్ఫరెన్స్ రూపొందించిన లక్ష్యాలను చేరుకున్నామా లేదా అన్న అంశంపై ఐరాస ఆధ్వర్యంలో ప్రపంచ సదస్సు జరిగింది. ఇదే సదస్సు 2009లో కూడా అదే చోట జరిగింది. 260 మిలియన్ల ప్రజలు ఎదుర్కొంటున్న భారత కుల) సమస్యపై కూడా ఈ సదస్సులో చర్చ జరగాలని అనేక మానవ హక్కుల సంస్థలు, అంబేద్కర్ సంఘాలు, హ్యూమన్ రైట్స్ వాచ్ లాంటి ప్రపంచ సంస్థలు డిమాండ్ చేశాయి. కాని రెండు సందర్భాల్లోనూ ఆర్ఎస్ఎస్-బీజేపీ అనుబంధ సంస్థలు పెద్ద ఎత్తున లాబీయింగ్ జరిపి, బ్లాక్ మెయిలింగ్‌కు దిగి దర్బన్ వేదిక పై కుల వివక్షపై చర్చ జరగకుండా అడ్డుకున్నారు. తద్వారా హిందూత్వ పద్ధతిలో 'భరత జాతి నిండు గౌరవం' పైన మచ్చ పడకుండా కాపాడుకున్నారు. ఇన్ని చేస్తున్నా ఈక్వాలిటీ లాబ్స్ లాంటి లిబరల్ పాపులు తమ పాపిష్టి పథకాలు మానుకోలేదని శాపనార్థాలు పెడుతూ ఇది అమెరికాలోనూ ఇతర చోట్లా విస్తరిస్తున్న 'హిందూ ఫోబియా'లో భాగమే అని నిర్ధారించాడు. ఇప్పటికే యాపిల్ లాంటి సంస్థలు కూడా కుల వివక్ష పై నిషేధం విధించాయని ఆందోళన ప్రకటించాడు. సిస్కో ఉద్యోగి ఒకరు కుల వివక్షపై వేసిన కేసులో కంక్లూజివ్ ఎవిడెన్స్ దొరకలేదని ఒకింత సంతోషం వ్యక్తం చేశాడు. హిందూ ఫోబియాపై ఇండియన్-అమెరికన్ కమ్యూనిటీ తిరస్కరించాలని పిలుపిచ్చాడు.

కుల వివక్ష ఏ రూపంలో ఉన్నా నిర్మూలించవలసిందే అంటూనే ఈ ఆర్ఎస్ఎస్ నేత సియాటెల్ నగర కౌన్సిల్ తెచ్చిన ఆర్డినెన్స్ దానికదే హిందువులపై వివక్ష అని ప్రకటించేశాడు. గోహత్య పేరుతొ హిందూత్వ మూకల చేతుల్లో హత్యకు గురయిన ముస్లిం బాధితులపైనే ఎదురు కేసులు పెట్టే హిందూత్వ న్యాయం వివక్షను 'వివక్ష'గా వేలెత్తి చూపడంకూడా వివక్షగా చెప్పేందుకు ఏ మాత్రం సిగ్గుపడదు. ఈ దురన్యాయాన్ని నిలదీసి నిగ్గుదేల్చాల్సింది శ్రామిక వర్గ ప్రజలే! ❖

నువ్వూ నేనూ ఒక్కటే

డాక్టర్ సుంకర గోపాల్, 9492638547

ఎండకు ఏ చెట్టుకిందకెళ్లినా
కులధృవీకరణ పత్రం అడగదు

దాహానికి ఏ కాలువ దగ్గర
నాలుక సాచినా
మను ముద్రలు వెతకదు
మతమో, వర్ణమో చూసి
భూమి గింజను పొదువుకోదు
గుడి, మసీదు, చర్చ్ చిరునామాలు వెతికి
మేఘాలు వర్షాన్ని పంపవు

అసమానతలు లేని ఆకాశం నుండి
చనుబాల్లాంటి ధారను పంపే నెలవంక
అమ్మ చేతుల్లాంటి కిరణాల్ని పంపి
అన్ని చెట్ల ఆకులను
వెచ్చగా తాకే
మొహమాటం లేని సూరీడు
ఏ జాతి వైరం లేకుండా

ఊరు వాడా వూరేగే గాలి
అంతరానితనం లేని ప్రకృతి

మనిషిని చూడగానే ముందుకు రావాల్సిన చేతుల్ని
ఏ బంధనాలో వెనక్కి కట్టడడం అసహ్యంగా ఉంది
చూడగానే పువ్వుల్లా విచ్చుకోవాల్సిన పెదవులు
గాలి తీసిన బెలూన్‌లా ముడుచుకోవడమే విషాదం

మాట మాట కలిపి వంతెనలు కట్టాల్సింది పోయి
కంచెల్ని, గోడల్ని కట్టే గుండెల్ను చూసి
జీవం లేని రాళ్లే నవ్వుతున్నాయ్

ఇరుకైపోయిన నీ డిఎన్ఏని
విశాలం చేసి చూడు
తొల్లిటి మానవుడి
రక్త మాంసాలే
నువ్వూ నేను. ❖



హిందుత్వ, బ్రాహ్మణీయ ఫాసిజానికి వ్యతిరేకంగా, పోడు భూముల పట్టాలకోసం పోరాడుతాం

విజయవంతంగా మహబూబాబాద్‌లో జరిగిన ప్రగతిశీల మహిళా సంఘం (POW) తెలంగాణ రాష్ట్ర 3వ మహాసభలు

ప్రగతిశీల మహిళాసంఘం (పీవోడబ్ల్యూ) తెలంగాణ 3వ రాష్ట్ర మహాసభలు విప్లవ మహిళాస్ఫూర్తిని ఎలుగెత్తి చాటుతూ మహబూబాబాద్ లో 7, 8 తేదీలలో విజయవంతంగా జరిగాయి. డిశంబర్ 17, 2022న ఆహ్వాన సంఘం ఏర్పాటు చేసిన నాటి నుండి అడుగడుగునా పోలీసుల ఆంక్షలు, అనేక ఆటంకాల మధ్య -కార్యకర్తల భాగస్వామ్యంతో అత్యంత స్ఫూర్తిదాయకంగా సభలు జరిగాయి. సభల సందర్భంగా 20 రోజులపాటు జరిగిన క్యాంపెయన్లో -రాష్ట్ర, జిల్లా కార్యకర్తలు పాల్గొన్నారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో, చుట్టు ప్రక్కల గ్రామాల్లో గ్రూపు మీటింగులు నిర్వహించి, కరపత్రాలు పంచి విస్తృతంగా ప్రచారం చేసారు. ప్రజాసంఘాల మద్దతుతో సాగిన ఈ ప్రచార కాంపైన్ ద్వారా నిధులు, మద్దతు సేకరించి ప్రజల ఆర్థిక, హార్థిక సహకారాన్ని పొందారు.

ఉత్తేజంగా సాగిన మహిళా ప్రదర్శన

మహాసభల సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలోని నలుమూలల నుండి శ్రామిక మహిళలు కదలి తరంగమై కదం తొక్కుతూ మహబూబాబాద్‌కి తరలివచ్చారు. ఎర్ర జెండాల రెపరెపలతో పట్టణం ఎర్ర సముద్రమయ్యింది. అరుణోదయ, పీవోడబ్ల్యూ కళాకారుల డప్పుల, కోలాటాలతో మహిళా ప్రదర్శన, ఫిబ్రవరి 7వ తేదీన మధ్యాహ్నం 1 గంటకు, మహబూబాబాద్ బస్టాండ్ సెంటర్ నుండి కోర్టు దగ్గరి అంబేద్కర్ సెంటర్ వరకు జరిగింది. ప్రదర్శన ఆద్యంతం మహిళల నినాదాలతో మారుమ్రోగిపోయింది. 'స్త్రీ పురుష సమానత్వం కోసం పోరాడుదాం!' 'పోడు భూములకు పట్టాలివ్వాలి.' 'బిల్కిస్ బానో హంతకులను శిక్షించాలి.' 'హరితహారం పేరుతో జరుపుతున్న దాడులను నిలిపివేయాలి.' 'అటవీ హక్కుల చట్టాన్ని, ఆదివాసీల హక్కులను పరిరక్షించాలి.' 'రాజ్యహింసకు, ఫాసిస్టు పాలనకు వ్యతిరేకంగా పోరాడుదాం.' 'స్త్రీలపై హింసలకు వ్యతిరేకంగా పోరాడుదాం.' 'అభివృద్ధి పేరుతో. సాగుతున్న విధ్వంసాన్ని నిలిపివేయాలి.' 'అడవిపై ఆదివాసీలకు హక్కు కల్పించాలి.' 'దళితులపై, మైనారిటీలపై దాడులు నిలిపివేయాలి.' 'హిందూ మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాడుదాం' -అంటూ దిక్కులు పిక్కటిల్లేలా మహిళలు నినదిస్తూ ర్యాలీలో సాగిపోయారు. రాష్ట్ర అధ్యక్షులు వి.సంధ్య, ప్రధాన కార్యదర్శి బి.సుభద్ర, ఆంధ్రప్రదేశ్ పీవోడబ్ల్యూ అధ్యక్షుల ఎన్. విష్ణు, పీవోడబ్ల్యూ రాష్ట్ర నాయకత్వం ఊకే పద్మ, ఆగబోయిన నర్సక్క, ఎం. సరళ, ఏ. నిర్మల, జడ ఐలమ్మ, తుడుం అనురాధ, రాములమ్మ, సుగుణ, గుజ్జు కృష్ణవేణి, చిన్నం లక్ష్మి తదితరులు నాయకత్వం వహించారు. ఆర్టీసీ బస్టాండ్ సెంటర్ నుంచి పట్టణ పురవీధుల గుండా ఓసీ క్లబ్ వరకు నిర్వహించిన మహిళా ప్రదర్శన ప్రజలను ఆకట్టుకున్నది. కొత్తగూడ, ముసిమి, కంబాలపల్లి, హైద్రాబాద్, భద్రాచలం కళాకారుల కోలాటం, డప్పుల కోలాహలం పట్టణంలో గొప్ప ప్రభావాన్ని చూపింది.

అత్యంత ఉత్తేజకరంగా జరిగిన బహిరంగసభ

మధ్యాహ్నం 3 గంటలకు, ఓ.సీ. క్లబ్ గ్రౌండ్ (సుజాతక్క వెంకట నర్సక్క ప్రాంగణంలో) అత్యంత స్ఫూర్తిదాయకంగా జరిగిన బహిరంగసభలో మహిళా రైతు హక్కుల వేదిక (మకాం) జాతీయ నాయకులు ఎస్. ఆశాలత, పీవోడబ్ల్యూ జాతీయ కన్వీనర్ వి. సంధ్య, సిపిఐ (ఎమ్-ఎల్) న్యూడెమోక్రసీ కేంద్ర కమిటీ సభ్యులు సాధినేని వెంకటేశ్వరరావు, పీవోడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుభద్ర, పీవోడబ్ల్యూ జాతీయ నాయకులు ఎన్. విష్ణు, సిపిఐ (ఎమ్-ఎల్) న్యూడెమోక్రసీ మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి గౌని ఐలయ్య తదితరులు ప్రసంగించారు. పోడుభూములపై హక్కుల కోసం, ఉపాధి అవకాశాల కోసం, నివాస హక్కుల కోసం మరిన్ని ఉద్యమాలు నిర్మించే కృషిలో భాగంగా రాష్ట్ర స్థాయి నిర్మాణ మహాసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన బహిరంగ సభకి కామ్రేడ్. వి సంధ్య అధ్యక్షత వహించారు. సభలో అరుణోదయ కళాకారులు. కామ్రేడ్స్ డప్పుల దరువులతో నృత్యాలు చేస్తూ, స్ఫూర్తినిచ్చే పాటలతో, అరుణోదయ నేతలు వేణు, నిర్మల బృందాల నృత్యాలతో ప్రేక్షకులను అలరించారు.

సభలో అరుణోదయ కళాకారులు ఆలపించిన గీతాలు పలువురిని ఆలోచింపచేశాయి.

మహిళా అమరవీరుల స్ఫూర్తితో ఉద్యమిద్దాం -వి. సంధ్య

బహిరంగ సభకు కామ్రేడ్ వి. సంధ్య అధ్యక్షత వహించి మాట్లాడుతూ 'నాలుగు దశాబ్దాలుగా మహిళల హక్కుల కోసం, మహిళలపై జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా, మహిళలకు అన్ని రకాల హక్కులు, సమానత్వం కావాలని పోరాడుతూ గుర్తింపును పొందిన సంఘం, అనేక పోరాటాల్లో ప్రధాన పాత్రను పోషించిన సంఘం మన ప్రగతిశీల మహిళాసంఘం' అని

అన్నారు. పోడు హక్కుల కోసం తెగించి పోరాడుతున్న అడవి బిడ్డలకే అడవిపై హక్కు ఉందని, వారి పోరాటాలకు మద్దతు తెలపడంలో భాగంగానే పోరాటాలగడ్డ మానుకోటని మహాసభలకు వేదికగా చేసుకున్నామని అన్నారు. 2006లో అటవీ హక్కుల చట్టంను తీసుకువచ్చిన ప్రభుత్వాలు దానిని విస్మరిస్తున్నాయని, అటవీ హక్కుల చట్టం ప్రకారం 2005 కంటే ముందు సాగు చేసుకున్న ప్రతి పోడు రైతుకు హక్కు పత్రాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 12 లక్షల మంది రైతులు దరఖాస్తులు చేసుకుంటే 9 లక్షల మందిని మాత్రమే అర్హులుగా గుర్తించారు. నేటి వరకు ఒక్క రైతుకు కూడా పట్టాలివ్వలేదని మండిపడుతూ పడుతూ పోడు రైతులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తి వేయాలని డిమాండ్ చేశారు.

అడవులను కబ్జా చేసి కార్పొరేట్ సంస్థలకు అప్పగించేందుకు అటవీ హక్కుల చట్టాన్ని మోదీ ప్రభుత్వం మార్చి వేస్తున్నదని, కుర్చీ వేసుకుని మరీ పట్టాలిస్తామని ప్రకటించిన కేసీఆర్ ప్రభుత్వం పోడు భూములను బలవంతంగా గుంజుకుంటున్నదని, బడా పారిశ్రామిక వేత్తల కోసం మహిళలు, ఆదివాసీలపై అత్యంత పాశవికంగా దాడి చేస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వం వెటనే ఆదివాసీలకు జాయింట్ పట్టాలివ్వాలని అందుకోసం సంఘటితంగా పోరాడాలని పిలుపునిచ్చారు. విప్లవోద్యమ పోరాటాలలో చింతా లక్ష్మి, సుశేన, రంగవల్లి, లలితక్క, శాంతక్క, సుజాతక్క తదితరులు అమరత్వం పొందారని అమరులు చూపిన బాటలో ఆదివాసీల హక్కులకోసం పోరాడాలని, ఈ మహాసభలలో అందుకు తగిన నిర్ణయాలు చేసుకుందామని ఆమె చెప్పారు. ఆదివాసీలు తరతరాలుగా దోపిడీ పాలకులకు వ్యతిరేకంగా పోరాటాలు చేశారని, ఈనాడు తెలంగాణలో వాళ్లు చేస్తున్న పోరాటాలు మొత్తం సమాజానికి మార్గం చూపుతాయని సంధ్య అన్నారు.

అడవుల నుండి ఆదివాసీలను వెళ్లగొట్టే కుట్రలను అడ్డుకోవాలి – ఎస్. ఆశాలత

మహిళా రైతు హక్కుల వేదిక (మకాం) జాతీయ నాయకులు ఎస్. ఆశాలత ప్రధానవక్తగా పాల్గొని మాట్లాడుతూ 2015లో పోడు భూములకు పట్టాలు ఇస్తామని చెప్పిన ప్రభుత్వం ఇప్పటివరకు ఒక్క ఎకరానికి కూడా పట్టా అందించ లేదన్నారు. రాష్ట్రంలో 12 లక్షల మంది పోడు సాగుదారులు దరఖాస్తు చేసుకున్నారని, అర్హులైన ప్రతి ఒక్కరికీ హక్కు పత్రాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. హరిత హారం పేరుతో ఆదివాసీలను అడవి నుంచి వెళ్ల గొట్టడం దుర్మార్గమని మండిపడ్డారు. అటవీ హక్కుల చట్టాన్ని అమలు చేయాలని, అడవిపై అటవీ సంపదపై ఆదివాసీలకే హక్కులు కల్పించాలన్నారు. పోడు భూముల్లో ట్రెంచ్లు కొడుతూ పోడు రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని, ఫారెస్టు అధికారుల దౌర్జన్యాలను ప్రతిఘటించే ప్రతి ఉద్యమంలో మహిళల భాగస్వామ్యం ఉందన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత హరితహారం పేరుతో రూ.4వేల కోట్ల పై చిలుకు ఖర్చు చేశారని, కానీ కేవలం ఒక్కశాతం అడవుల విస్తీర్ణం పెరిగిందని చెప్పారు. హరితహారం పథకం ద్వారా నిధులు దుర్వినియోగం చేస్తారు కానీ, ఆదివాసీల అభివృద్ధి మాత్రం పాలకులు పట్టించుకోరని అన్నారు. కార్పొరేట్, ప్రైవేటు కంపెనీలకు గుట్టుచప్పుడు కాకుండా 12 లక్షల హెక్టార్లకు పైగా అటవీ భూములను ధారాదత్తం చేసేందుకు ప్రభుత్వాలు కుట్రలు చేస్తున్నాయని, ఆదివాసీ పరిరక్షణను, హక్కుల చట్టాలను తుంగలో తొక్కి వుల్లంఘనలకు పాల్పడుతున్నారని ఆమె అన్నారు. అందుకే మహిళలందరూ కలిసి ఐకమత్యంతో పోరాటానికి సన్నద్ధం కావాలని, పోడుభూములకు పట్టాలిచ్చేంత వరకు హరిత హారం పేరుతో ఒక్క మొక్క కూడా నాటనివ్వవద్దని, అడవుల నుండి ఆదివాసీలను వెళ్లగొట్టే కుట్రలను అడ్డుకోవాలని పిలుపునిచ్చారు.

పోరాటంతోనే మహిళా హక్కులు సాధిద్దాం –కా. సాధినేని వెంకటేశ్వరరావు

సిపిఐ (ఎమ్-ఎల్) న్యూడెమోక్రసీ కేంద్ర కమిటీ సభ్యులు కామ్రేడ్ సాధినేని వెంకటేశ్వరరావు మాట్లాడుతూ... దేశంలో, రాష్ట్రంలో 75 సంవత్సరాల స్వాతంత్ర్యంలో ఎటువంటి హక్కులు లేవు. ఎటువంటి స్వేచ్ఛ లేదు. మనదేశంలో హక్కులు అడిగితే అనేక నిర్బంధాలు, రాజ్యహింస ఎదుర్కోవాల్సి వస్తున్నది అన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో మానుకోట రాళ్లు మలిదశ ఉద్యమానికి ఊపిరి పోశాయని చెబుతూ, మానుకోట గడ్డను ఉద్యమాల గడ్డగా అభివర్ణించారు. పదో తరగతి కూడా చదవని ఆదానీ, అంబానీలు దేశంలోనే సంపన్నులుగా సంపదలో నెంబర్-1 స్థానంలో ఎలా నిలిచారని ప్రశ్నించారు. సింగరేణి బొగ్గును విక్రయించగా వచ్చిన ఆదాయంలో ఈ ప్రాంతానికి 10శాతం నిధులు ఖర్చు చేయాల్సి ఉండగా హైదరాబాద్లో సిసి కెమెరాలకు ఖర్చు చేస్తున్నారని మండిపడ్డారు. దున్నేవాడిదే భూమి అంటూ 101 ప్రతిపాదనలు చేసారు కానీ ఎవ్వరూ వాటిని లెక్కచేయరన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన బడ్జెట్తో పేద ప్రజలకు ఒరిగేది ఏమీ లేదని, కేవలం అంకెల గారడీతోనే మభ్య పెడుతున్నారని చెప్పారు. ప్రజల సొమ్ముని కోట్లకు ముంచి మోసాలు చేస్తున్నవారిని, దోపిడీ చేస్తున్న వారిని ప్రశ్నించరు. కానీ తమ హక్కుల కోసం పోరాడుతున్న వారిని మాత్రం నిర్బంధిస్తారని అన్నారు. ఎన్డీపార్టీ ఆధ్వర్యంలో 5 లక్షల ఎకరాలకు పైగా భూములను పంపిణీ చేసామని, అట్టడుగు వర్గాలకు భూములు పంచిన ఘనత తమకే దక్కిందని చెప్పారు. ఏజెన్సీ ప్రాంతాలైన ఆదిలాబాద్, ములుగు, మహబూబాబాద్, ఖమ్మం జిల్లాల్లో 42 రకాల ఖనిజ సంపద ఉందని, దానిని కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టేందుకే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుట్రలు చేస్తున్నాయని ఆయన ఆరోపించారు. అందుకే మన హక్కులు మనమే కాపాడుకోవాలి. పోరాడి సాధించుకోవాలి. అవైపుగా మీరు చేస్తున్న పోరాటాలలో సిపిఐ (ఎమ్-ఎల్) న్యూడెమోక్రసీ మీతో ఉంటుందని, ఉత్పత్తి పునరుత్పత్తి చేసే

అక్కచెల్లెళ్ల కోసం మద్దతు ప్రకటిస్తుందని అన్నారు. మీ హక్కులను అందరి హక్కులను హరిస్తున్న ప్రభుత్వాలను వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు.

పాలకులెక్కడైనా ఒకే తీరులోనే పాలిస్తున్నారు - ఎన్. విష్ణు

పీవోడబ్ల్యూ జాతీయ నాయకులు కామ్రేడ్ ఎన్. విష్ణు మాట్లాడుతూ... ముందుగా ఆంధ్రప్రదేశ్ పీవోడబ్ల్యూ రాష్ట్ర కార్యవర్గం తరుపున అభినందనలు తెలిపారు. రాష్ట్రాలలోనూ, కేంద్రంలోనూ పాలకులు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పీవోడబ్ల్యూ గొంతు విప్పుతున్నది, పోరాడుతున్నదని అన్నారు. ప్రజలకు కలిగే బాధలు, కష్టాలు, నష్టాలు, సమసి పోవాలని, అటువైపు పోరాటాలను నిర్వహిస్తున్నదన్నారు. ప్రభుత్వాలు ఊదర గొడుతున్నది, అభివృద్ధిని కాదు మన భూములను, ఇళ్లను, పంటలను, లాక్కోవటం. జీవన విధ్వంసం చేయడం అభివృద్ధి ఎలా అవుతుందని ప్రశ్నించారు. రెండు రాష్ట్రాల్లోనూ ప్రభుత్వాలు భూములు ఆక్రమించి పేదలను అక్కడ నుండి ఖాళీ చేయించి మాయమాటలు చెప్పి ఆ భూములను తీసుకున్నారు. సారవంతమైన భూములను, వచ్చని పోడు భూములను లాక్కొని ఉద్యమాలను చేస్తున్న వారిపై, ప్రశ్నించే వారిపై నిర్బంధాలు పెట్టి వేధిస్తున్నారని విమర్శించారు. ప్రతిరోజూ ఎన్నో అత్యాచారాలు, ఎన్నో దాడులు స్త్రీలపై జరుగుతున్నాయి అవేమీ పట్టించుకొని ప్రభుత్వాలు మద్యాన్ని మాత్రం ప్రజలపై రుద్దుతూ కుటుంబాలను విచ్చిన్నం చేస్తున్నారని దుయ్యబట్టారు. ఈ స్థితిలో తెలంగాణా రాష్ట్రంలో ఉద్యమాలను ముందుకు తీసుకొని పోవాల్సిన అవసరం మరింత పెరిగిందని అందులో భాగంగా మీరు చేసే పోరాటాలకు మద్దతుగా నిలబడతామని తెలియచేశారు.

హక్కుల సాధన కోసం ఐక్యంగా పోరాడుదాం - ఐలయ్య

సిపిఐ (ఎమ్-ఎల్) న్యూడెమోక్రసీ మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి కామ్రేడ్ గౌని ఐలయ్య మాట్లాడుతూ... కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలు ప్రజల హక్కుల్ని హరిస్తున్నాయి. ముఖ్యంగా పోడు భూముల కోసం పోరాడుతున్న ఆదివాసీలను పరాయివాళ్లను చేసి, ఆక్రమణ దారులను చేసి. నేరస్థులుగా చేసి వారిపై అన్యాయంగా దౌర్జన్యాలు చేస్తున్నారని దుయ్యబట్టారు. కేసీఆర్ తెలంగాణా పోరాటంలో మనల్ని ప్రగతిశీల శక్తులు అన్నాడు. కానీ నిరంతరం నిర్బంధాలతో, అణచివేతలతో పాలన చేస్తున్నారని, ఈ రోజున ఈ సభలకు కూడా అక్రమ అరెస్టులతో అనేక విధాలుగా ఆటంకం కల్గించారని అన్నారు. అయినా, దృఢ సంకల్పంతో, వివిధ వర్గాల సహకారంతో సభలను విజయవంతం చేసుకున్నామని అన్నారు. జిల్లాలో అధికారంలో అన్ని పదవుల్లో బంజారాలు ఉన్నప్పటికీ ఆ వర్గాలకు ఒరిగేదేమీ లేదని, వారు ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నా, ఆకలి చావులకు గురవుతున్నా పట్టించుకునే నేతలు మాత్రం లేరన్నారు. అందుకోసమే, మనమంతా ఒక శక్తిగా ఎదగాలి, మన హక్కులను సాధించుకొనే దిశగా, సమస్యల పరిష్కారానికి ఐకమత్యంతో ముందుకు నడవాలని పిలుపునిచ్చారు.

పీవోడబ్ల్యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి. సుభద్ర మాట్లాడుతూ తమ ఆహ్వానాన్ని మన్నించి వచ్చిన వక్తలకు , నేతలకు, అశేషంగా మహాసభలకు తరలి వచ్చిన మహిళలకు, ప్రజలకు సహకరించిన వారందరికీ సంస్థ తరపున కృతజ్ఞతలు తెలియ చేశారు. సభలో వేదికపై ఉన్న రాష్ట్ర నాయకులు ఊకే పద్మ, నర్సక్క, నిర్మల అభివాదం తెలియజేశారు.

స్ఫూర్తిదాయకంగా జరిగిన ప్రతినిధుల సభ

ఫిబ్రవరి, 8వ తేదీ ఉదయం గంగపుత్ర భవనం (రాయల జ్యోతి నగర్) హనుమంతుని గడ్డలో పీవోడబ్ల్యూ జెండా ఆవిష్కరణతో ప్రతినిధుల సభ ప్రారంభమైనది. హిందూ మతోన్మాదం, ఫాసిజం, రాజ్యహింసలకు వ్యతిరేకంగా, మహిళల సమస్యలపై మహిళా పోరాటాలపై నినాదాలతో, బొమ్మలతో బ్యానర్లను హాలు లోపల, బయట అలంకరించారు. అమరవీరులకు నివాళి అర్పిస్తూ బ్యానర్లు, కటౌట్లు కట్టారు. అమరవీరుల ఫొటోలతో స్ఫూర్తినిచ్చే నినాదాలతో అమరవీరుల స్థూపాన్ని ఏర్పాటు చేసి నివాళులర్పించారు. వీరవనితల స్థూపాన్ని అలంకరించిన ప్రాంతంలో ఉద్వేగభరితమైన వాతావరణంలో ప్రతినిధుల నినాదాలు, అరుణోదయ కళాకారుల విప్లవగేయాల మధ్య పీవోడబ్ల్యూ జెండాను రాష్ట్ర అధ్యక్షులు వి. సంధ్య ఎగురవేశారు. 'మా జయకేతనమా' అనే జెండాపాటను కా. సరళ పాడగా, సభ్యులందరూ కోరస్ అందించారు. ఉత్తేజకరంగా ప్రారంభమైన ఈ కార్యక్రమంలో పీవోడబ్ల్యూ జాతీయ, రాష్ట్ర నాయకత్వంతో పాటు అతిధులు జాతీయ హక్కుల కార్యకర్త, స్వతంత్ర జర్నలిస్టు భాషాసింగ్, టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి, ఆహ్వానసంఘం అధ్యక్షులు కవిత, మహిళా ఉద్యమకారులు కె. పద్మ (మహిళా చేతన, వైజాగ్) అంబిక, అనురాధ, సజయ తదితరులు పాల్గొన్నారు.

ప్రతినిధులు వరుసలో నిలబడగా, చుట్టూరా కార్యకర్తలు, కళాకారులూ నిలబడి అమరవీరులకు జోహార్లర్పించారు. అనంతరం అమరులకు పేరు పేరునా లాల్ సలాములు చెప్పుకొని, అమరుల ఆశయాలు కొనసాగిద్దాం అంటూ నినదిస్తూ హాలు లోపలికి సాగిపోయారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.సుభద్ర వక్తలను, అతిధులను వేదికపైకి ఆహ్వానించి, మహాసభల షెడ్యూలును ప్రకటించారు. రాష్ట్ర అధ్యక్షులు వి. సంధ్య సభను అధ్యక్షతన ఆహ్వానసంఘం అధ్యక్షులు కవిత స్వాగతోపన్యాసం ఇచ్చారు.

సామాజిక అంతరాలను, పాలకుల మహిళా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలి - కామ్రేడ్ కవిత

నేటి పితృస్వామిక సమాజంలో ఇంటా, బయటా మహిళలు ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నారని, పోరాడితే తప్ప మనుగడ

సాగించే పరిస్థితి లేదని అన్నారు. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో టీఆర్ఎస్‌లాంటి ప్రాంతీయ పార్టీలు అనుసరించే ప్రజా, మహిళా వ్యతిరేక విధానాలకు నిరసనగా సమీకరణలు చేయాల్సిన అవసరం పెరిగిందన్నారు.

సమానత్వం కోసం, మహిళా విముక్తి కోసం శక్తివంతమైన పోరాటాలు సాగించాలన్నారు. మహిళల ఆర్థిక, సామాజిక, రాజకీయ, సాంస్కృతిక అభివృద్ధి కోసం పోరాడాతే తప్ప సమస్యలు పరిష్కారం కావని, హక్కులు సాధించుకోలేమని అన్నారు. అందుకోసం చైతన్యవంతమైన మహిళా ఉద్యమాలు కావాలని, అటువంటి ఉద్యమాలకు అందరూ మద్దతునివ్వాలని అన్నారు. అందులో భాగంగానే జరుగుతున్న మూడవ రాష్ట్ర మహా సభలకు మహబూబాబాద్ వేదికవ్వడం, ఈ కృషికి అందరూ తోడ్పాటు నివ్వడం చాలా సంతోషకరమని చెబుతూ సభలు విజయవంతంగా నిర్వహించుకోవాలని తన శుభాకాంక్షలు తెలియజేశారు.

పునాది వర్గాలను నిర్మాణయుతం చేయకుండా నిజమైన మహిళా విముక్తి జరగదు - సంధ్య

ఆహ్వాన సంఘం అధ్యక్షులి తొలి పలుకుల అనంతరం సభకు కామ్రేడ్ సంధ్య అధ్యక్షత వహిస్తూ... ప్రగతిశీల మహిళాసంఘం గత నాలుగు దశాబ్దాలకు పైగా స్త్రీ, పురుష సమానత్వాన్ని, అన్ని రంగాలలో సమ భాగస్వామ్యాన్ని కోరుతూ పోరాడుతున్నదన్నారు. స్త్రీలపై సాగుతున్న పితృస్వామిక అణచివేతను, శ్రమ దోపిడీని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ, స్త్రీల హక్కుల పరిరక్షణ కోసం, సమస్యల పరిష్కారం కోసం, కుల, వర్గ, మత, జాతి, లింగ వివక్షలకు వ్యతిరేకంగా నిరంతరం పోరాడుతున్నదని అన్నారు. ఆనాటి ఎమెర్జెన్సీ చీకటి కాలంలో నిర్బంధాన్ని ఎదుర్కొన్నది. ఈ గడ్డమీద పుట్టి, మన పక్కనే జరిగిన విప్లవోద్యమంలో శాంతక్క సుజాతక్క చేసిన అపురూప త్యాగం, లలితక్క, చింతా లక్ష్మక్క, సుశేన, రంగవల్లక్క పోరాట పటిమ, వారి అమరత్వం ఉద్యమానికి స్ఫూర్తిగా నిలిచిందన్నారు. పునాది వర్గాలను నిర్మాణయుతం చేయకుండా నిజమైన మహిళా విముక్తి జరగదని అర్థం చేసుకున్నాం కనుకనే ప్రజల్లో భాగస్వామ్యమై శ్రామిక మహిళా వుద్యమాన్ని నిర్మిస్తున్నామని చెప్పారు. ఏ ఉద్యమాలకైనా త్యాగం కొలమానమంటారు. అటువంటి త్యాగానికి కొదవలేని మహిళా ఉద్యమాల్లో ఎందరో మహిళలు అమరులయ్యారు. ఆ అమరుల బాటలో నడుస్తూ గత ఉద్యమాలను సమీక్షించుకుని, భవిష్యత్తులో మరిన్ని పోరాటాలను నిర్మించే కర్తవ్యాన్ని ఎంచుకుని ఈ మహాసభలు నిర్వహించుకుంటున్నామన్నారు. భూమికోసం, బువ్వకోసం, నివాస హక్కుల కోసం, ఆత్మగౌరవం కోసం సాగే పోరాటాలలో మహిళలే ముందుంటున్నారనీ, వారందరినీ సంఘటిత పరచి పితృస్వామ్యానికి, సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా సమరశీల పోరాటాలను ఎక్కుపెట్టాలని కా సంధ్య అన్నారు.

భారత రాజ్యాంగం ప్రకారం అందరికీ సమానత్వం, స్వేచ్ఛా, స్వాతంత్ర్యం కలిగి ఉన్న, వివక్ష లేని వాతావరణాన్ని మనం పొందాలి. కానీ, సామాజిక సమానత్వం, ప్రాథమిక హక్కుల కోసం జరుగుతున్న ఉద్యమాలలో ఎప్పుడూ పాలక వర్గాలూ, పోలీసు వ్యవస్థ భూస్వాములకు, దొరలకు, పెట్టుబడిదారులకు అండగా నిలిచాయి. మన పోరాటాలు అసమానతను, అణచివేతను తగ్గించటం కోసమే. కానీ, ఫాసిస్టు పాలకులు సాంప్రదాయబద్ధంగా జీవించాలని చెబుతూ -అసమానత్వం, వివక్ష వైపు నెట్టే ప్రయత్నాలు చేస్తున్నారని సంధ్య అన్నారు. ప్రపంచీకరణ విధానాల వలన జరుగుతున్న అభివృద్ధి పథకాలు, కొత్త ప్రాజెక్టులు, ప్లాంటులు ప్రజలకోసం కాదు. ఆదివాసులను, ఇతర పేద సామాజిక వర్గాలను నిర్వాసితులుగా చేయటం కోసమేనని ఆమె అన్నారు. ఆదివాసీ, గిరిజన, దళిత, మైనారిటీ, బహుజనుల హక్కులను గౌరవించాలి. ప్రజల ఆత్మగౌరవానికి భంగం వాటిల్ల కూడదు. అంచుకు నెట్టబడిన ప్రజల సమస్యలను పరిష్కరించాలి. వీరందరికీ నిజమైన విముక్తి కావాలి, దానితో పాటు మన రాజ్యాంగం అమలుకు, మన హక్కుల సాధనకు కూడా పోరాటం సాగించాలి. మనం ఈ ప్రజాస్వామిక దేశంలో పౌరులం, న్యాయం, ధర్మం, సత్యం కోసం పోరాడుదాం. ప్రభుత్వాలు మన హక్కులను గుర్తించే వరకు సమానత్వం, స్వేచ్ఛా, శాంతి, న్యాయం, హక్కుల కోసం మహిళలు పోరాడాలని సంధ్య పిలుపునిచ్చారు.

వీరవనితలకు సంతాప తీర్మానం

ప్రగతిశీల మహిళా సంఘం (పీవోడబ్ల్యు) తెలంగాణ సాయుధ పోరాటం నక్సల్బరీ, శ్రీకాకుళం, గోదావరిలోయ, దండకారణ్యం, ప్రజా పోరాటాల్లో అమరులైన వీరవనితలకు నివాళులర్పిస్తూ సంతాప తీర్మానం ప్రవేశపెట్టారు. సభలో వున్న ప్రతినిధులందరూ లేచి నిలబడి రెండు నిమిషాలు మౌనం పాటించి జోహార్లు తెలిపారు. అమరుల ఆశయ సాధనకై కట్టుబడి వుంటాం అంటూ మార్మోగిన నినాదాల తర్వాత అమరుల పాటతో, అరుణోదయ నిర్మల నేతృత్వంలో కళాకారుల డాన్సులతో గొప్ప ఉత్తేజాన్నిస్తూ సభ ప్రారంభమయింది.

మనుస్మృతిని ముందుకు తెచ్చి మహిళలను తిరోగమనం వైపుగా నెట్టివేస్తున్నారు - భాషాసింగ్

మహాసభల్లో ప్రారంభోపన్యాసం ఇవ్వడానికి వచ్చిన హక్కుల కార్యకర్త , స్వతంత్ర జర్నలిస్టు భాషాసింగ్ మాట్లాడుతూ పోరాటాల గడ్డపై విప్లవ మహిళలతో ఈ మహాసభలో పాల్గొనటం గౌరవంగా భావిస్తున్నానన్నారు. ఢిల్లీ నుంచి వచ్చిన భాషాసింగ్, స్వతంత్ర జర్నలిస్ట్. ఆమె భారతదేశం అంతా పర్యటించి ఆంగ్లంల "Unseen India" (కనిపించని భారతం, అశుద్ధ భారతం) అనే పుస్తకం రాసిన రచయిత. మహాసభలో ప్రారంభోపన్యాసం చేస్తూ 'ఈ సభలో ఉన్న మహిళలందరూ పోరాట పటిమను కలిగివున్నారని చెప్పడానికి మీలో ఒక్కరిగా నిలిచి మహిళాపోరాటాలు చేసిన అనేకమంది అమరవీరులను స్మరించుకోవడమే అని నేను భావిస్తున్నాననీ, వారందరికీ నా విప్లవ జోహార్లు' అని చెప్పారు.

మనమందరం ఇప్పుడు సామ్రాజ్యవాద ఫాసిజం, మనువాద పాలకుల నీడలో అనేక క్లిష్ట పరిస్థితుల్లో జీవిస్తున్నాం. మనమందరం కూడా ఇప్పుడు భూమి, భుక్తి, విముక్తి కోసం పోరాటాలు చేస్తున్నాం. పెట్టుబడిదారులైన అంబానీ,అదాని భారతదేశం నుండి ప్రపంచ దేశాల వరకు తమ వ్యాపారాలను విస్తృతంగా వ్యాప్తి చేస్తూ అడవులను, అడవి వనరులను, భూ ఖనిజాలను దోచుకుంటూ అక్కడి గిరిజన ఆదివాసులను బలవంతంగా, దౌర్జన్యంగా ఖాళీ చేయించే ప్రయత్నంలో దాడులు చేస్తున్నారు. వీరికి అండగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు (మోడీ, అమిత్ షా, తెలంగాణ కేసిర్) సహకరిస్తూ వారికి కొమ్ముకాస్తున్నాయి. కేవలం 21మంది పెట్టుబాడీదారుల చేతుల్లో మన దేశ సంపదను పెట్టి అమృతోత్సవ్, మోడీ వికాస్, దేశ వికాస్, అమిత్ వికాస్ అంటూ ప్రజల్ని మభ్యపెడుతున్నారని అన్నారు. కుల, మతాలను రెచ్చగొట్టి ప్రజల్లో అనేక చీలికలు తెచ్చి దాడులు చేస్తున్నారు. పితృస్వామిక భావజాలాన్ని, హిందుత్వ బ్రాహ్మణీయ భావజాలాన్ని రెచ్చగొట్టి మహిళలను అనేక రకాలుగా వివక్ష, అణచివేతలకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాజ్యాంగం మహిళలకు ప్రత్యేకంగా కల్పించిన ఎన్నో హక్కులను, మరెన్నో పోరాటాలు చేసి మనం సాధించుకున్న అనేక చట్టాలను కూడా కాలరాస్తూ హింసలకు, దాడులకు తెగబడుతున్నారు. దేశంలో హిందుత్వ ఫాసిజాన్ని బలవంతంగా ప్రజలపై రుద్ది అనేక సమస్యలను సృష్టిస్తూ దేశాన్ని విభజిస్తున్నారు. మహిళల్ని అవమానించేలా అనుక్షణం పాలకులు వ్యవహరిస్తున్నారు. మతతత్వ దేశంగా మార్చే ప్రయత్నం చేస్తున్నారు. బాబాసాహెబ్ అంబేద్కర్ రాసిన భారత రాజ్యాంగాన్ని విస్మరిస్తూ మనుస్మృతిని ముందుకు తెచ్చి మహిళలను తిరోగమనం వైపుగా నెట్టివేస్తున్నారు. మాట్లాడితే నోరు మూసే ప్రయత్నం చేస్తున్నారు. ప్రశ్నిస్తే జైళ్లలో పెట్టే కుట్రలు పన్నుతున్నారని ఆమె అన్నారు. ఇప్పుడు మనం మన హక్కుల కోసం, ఆత్మగౌరవం కోసం, స్త్రీపురుష సమానత్వం కోసమే కాదు, భూమి, భుక్తి, విముక్తి కోసమే కాదూ దేశ, వనరుల రక్షణ కోసం, హిందుత్వ ఫాసిజానికి వ్యతిరేకంగా పెద్ద పోరాటమే చేయాల్సి ఉంది. పోరాటాలు చేయడం మహిళలకు కొత్త కాదు. అనేక పోరాటాలు చేస్తున్న మనమందరం కలిసి ఐకమత్యంగా ఇప్పుడు హిందుత్వ ఫాసిజానికి వ్యతిరేకంగా పోరాడాలని, ఆ పోరాటానికి మనం ఇప్పుడు సమాయత్తం కావాలని, అందులో భాగంగానే మహిళా విముక్తి పోరాటాలు నిర్మించాలని పిలుపునిచ్చారు. (అత్యంత స్ఫూర్తినందించిన భాషాసింగ్ ఉపన్యాసాన్ని అమన్ వేదిక అనురాధ తెలుగులో సంక్షిప్తంగా చెప్పారు)

సంఘీభావాన్ని తెలియజేసిన ఇతర రాష్ట్రాల సౌహార్ధ ప్రతినిధుల సందేశాలు

తెలంగాణ రాష్ట్ర మహాసభలు విజయవంతం కావాలని మహిళా మున్నాడే (కర్నాటక), శ్రమజీవి నారీమంచ్ (వెస్ట్ బెంగాల్), ఫోరం ఫర్ ఐ టి ఎంప్లాయీస్ (తమిళనాడు) సంస్థలు తమ సౌహార్ద సందేశాలను రాతపూర్వకంగా పంపించగా సభలో ప్రతినిధులకు విన్పించడం జరిగింది.

మహిళలపై అణచివేతను పెంచి పోషిస్తున్న హిందూత్వ ఫాసిజం – కత్తి పద్మ (మహిళా చేతన)

మహాసభలో పాల్గొన్న ప్రతినిధులకి హిందూత్వ ఫాసిజం -మహిళలపై అణచివేత అనే అంశాన్ని బోధించడానికి వచ్చిన కత్తి పద్మ(మహిళా చేతన) పద్మ మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్లకు లొంగిపోయి చేస్తున్న ప్రజా వ్యతిరేక చర్యలను ప్రజలు గమనించకుండా ఉండేందుకు మతోన్మాదాన్ని రెచ్చగొడుతూ ప్రజల మధ్య మతాలు, కులాలు, జాతులు, జెండర్ పేర్లతో వైషమ్యాలను సృష్టిస్తూ భౌతికంగా దాడులు చేసుకునే వాతావరణాన్ని కల్పిస్తున్నారని అన్నారు. రాజ్యాధికారాన్ని ఉపయోగించుకుని ఆర్.ఎస్.ఎస్ ఎజెండాను అమలు జరిపే ఈ కార్యక్రమాన్ని మోడీ సర్కార్ వేగవంతం చేస్తోంది. బిజెపి సర్కారు అనుసరిస్తున్న మహిళా వ్యతిరేక విధానాలు, మనువాద తిరోగమన సిద్ధాంతాల వలన ఎన్నో వుద్యమాల ద్వారా సాధించుకున్న 498(ఎ), ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్టు, డీవి యాక్టు, లైంగిక వేధింపుల, అత్యాచార నిరోధక చట్టం, నిర్భయ తదితర చట్టాల్ని సక్రమంగా అమలు చేయకుండా నీరుగార్చి వేయడమే కాక, శిక్షలు అనుభవిస్తున్న నేరస్తులను సైతం జైలునుండి విడుదల చేయడంతో ముద్దాయిలు బాహాటంగా తిరుగుతున్నారు. పైగా వారికి దేశభక్తులు అన్నట్లుగా సన్మానాలు చేస్తున్నారు. ప్రత్యక్షంగా కేంద్ర ప్రభుత్వం హిందూత్వాన్ని నిస్సిగ్గుగా అమలు జరుపుతుంది. ఫాసిస్టు రాజకీయాలు స్త్రీల జీవితాల్లోకి చొచ్చుకుని వస్తున్నాయి. స్త్రీలపై వ్యక్తిగత దాడుల నుంచి మూకుమ్మడిగా చంపి మానవహననం దిశగా అదే లౌకికవాదంగా మధ్య తరగతి యువతను, స్త్రీలను సైద్ధాంతికంగా సమీకరిస్తున్నది. స్త్రీలను స్త్రీలకే శత్రువులుగా మార్చడానికి ఫాసిస్టు రాజ్యం మను ధర్మ భావజాలాన్ని ఎంచుకుని ప్రణాళికాబద్ధంగా అడుగులు వేస్తున్నదని చెప్పారు. ఈ దుర్మార్గాలపై ఎదురుతిరిగి పోరాడితే రాజ్యం, న్యాయ వ్యవస్థ సైతం స్త్రీల హక్కులకు మద్దతు లేదని ప్రకటిస్తున్నాయి. ఎందరో ఉద్యమకారులను, మహిళా సంఘాల నేతలను, మహిళా మేధావులను నిర్బంధించి జైళ్లపాలు చేస్తున్నది. ఎంత హక్కుల హననం జరిగినా, హింస జరిగినా స్త్రీలు పురుషునికి, కుటుంబానికి, రాజ్యానికి బానిసలా పడి వుండాలని పరోక్షంగా స్పష్టం చేస్తున్నది. అప్రజాస్వామిక, మనువాద సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకొస్తున్నది. అయితే శారీరక, మానసిక, లైంగిక సామాజిక అణచివేత లేని సమాజాన్ని, స్వేచ్ఛని కోరుకున్నారే తప్ప తమకు కావలా కాసే వ్యవస్థను స్త్రీలు కోరడం లేదని పాలకులు మహిళపై రుద్దుతున్న బూజు పట్టిన భావజాలాన్ని, తిరోగమన చర్యలను తిప్పికొట్టాలని పద్మ అన్నారు.

నూతన కార్యవర్గం

25 మంది సంఖ్యతో కూడిన కార్యవర్గాన్ని మహాసభ ఏకగ్రీవంగా ఎన్నిక చేయటం జరిగింది.

అధ్యక్షులు : వి. సంధ్య

ఉపాధ్యక్షులు : ఎం. సరళ (హైదరాబాద్)

ఉపాధ్యక్షులు: ఆగబోయిన నర్సక్క (మహబూబాబాద్)

ప్రధాన కార్యదర్శి: బి. సుభద్ర (నిజామాబాద్)

సహాయ కార్యదర్శి: ఊకే పద్మ (మహబూబాబాద్)

సహాయ కార్యదర్శి: ఎ. నిర్మల

కోశాధికారి : సుగుణ (యాదాద్రి కొత్తగూడెం)

కార్యవర్గ సభ్యులు : చిన్నం లక్ష్మి, తుడుం అనురాధ, గుజ్జు కృష్ణవేణి, (మహబూబాబాద్), కల్తి రాములమ్మ, బయ్య శారద, ఇంటిక లక్ష్మి (భద్రాద్రి కొత్తగూడెం), ఎ.విమల, సి.హెచ్.పూలక్క (వరంగల్), జి. అనురాధ, భారతి (హైదరాబాద్), మనీషా (మంచిర్యాల), వాణి (యాదాద్రి) సవిత, లక్ష్మి, (నిజామాబాద్) తదితరులు ఎన్నికవ్వగా మరో నలుగురిని కో-ఆప్షన్ గా తీసుకోవడానికి మహాసభ ఆమోదించింది.

మహాసభల పిలుపు

మహిళల అభివృద్ధిని దెబ్బతీసే హిందుత్వ ఫాసిస్టు పాలనకు వ్యతిరేకంగా పోరాడాలని మహాసభ పిలుపునిచ్చింది. బిల్కిస్ బానో కుటుంబ హంతకుల విడుదలను ఖండిస్తూ, నేరస్తులను తిరిగి అరెస్టు చేసి శిక్షించేతవరకు పోరాడాలని పిలువునిచ్చింది.

పలు అంశాలపై తీర్మానాలు

1. పురుషాధిపత్యం, అసమానతలు, వివక్షలకు వ్యతిరేకంగా, స్త్రీ-పురుష సమానత్వంకై పోరాడాలని మహాసభ తీర్మానించింది.

2. పోడు భూములు సాగుచేస్తున్న ఆదివాసీలపై, మహిళలపై ఫారెస్టు సిబ్బంది, పోలీసులు సాగిస్తున్న దాడులు, అమానవీయ చర్యలను ఆపివేయాలని, ఏజెన్సీలో జరుగుతున్న ఘర్షణలకు కేసీఆర్ ప్రభుత్వం బాధ్యత వహించాలనీ, ఆదివాసీ మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్న ఫారెస్టు సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని, మహిళలపై పెట్టిన కేసులు ఎత్తివేయాలని, హరితహారం పేరిట జరుగుతున్న దాడులను, మొక్కలు నాటడాన్ని నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ పోడు భూములకు అటవీ హక్కుల చట్టం -2006 ప్రకారం పట్టాలివ్వాలని మహాసభ డిమాండ్ చేసింది.

3. దేశంలో అధికారంలో ఉన్న బీజేపీ ఆర్ఎస్ఎస్ హిందూ మతోన్మాదులు స్త్రీల హక్కుల పైన దాడులు చేస్తున్నారు. బిల్కిస్ భానో పై సామూహిక అత్యాచారానికి పాల్పడి ఆమె కుటుంబ సభ్యులను ఏడుగురిని హత్య చేసిన వారికి క్షమాభిక్షపెట్టి, విడుదల చేసి ప్రభుత్వాలు స్త్రీలపైన లైంగిక అత్యాచారాలకు వత్తాసు పలుకుతున్నారు. సామూహిక అత్యాచారాలు చేసిన వాళ్లకి సన్మానాలు చేస్తున్నారు. స్త్రీలు ఇప్పటివరకు పోరాడి సాధించుకున్న హక్కులను సైతం కోల్పోయే పెను ప్రమాదం పెరుగుతున్న స్థితిని వ్యతిరేకిస్తూ బిల్కిస్ హంతకులకు పెట్టిన క్షమాభిక్షను రద్దు చేయాలని, తిరిగి వారిని అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ తీర్మానించింది.

4. గోదావరి ముంపు బాధితులుగా ఉన్న పెద ఆదివాసీ, గిరిజనులకు రక్షిత ప్రాంతాలలో ఇండ్లిచ్చి వారి నివాస హక్కులని పరిరక్షించాలని తీర్మానం జరిగింది.

5. శతాబ్దాల చరిత్ర కలిగిన మహబూబాబాద్ జిల్లా దొరవారి తిమ్మాపురం ఆదివాసీ గ్రామాన్ని తరలించటానికి ప్రభుత్వాధికారులు చేస్తున్న ప్రయత్నాలను మహాసభ తీవ్రంగా ఖండిస్తూ తరలింపు ప్రయత్నాలను విరమించుకొని ఆ గ్రామానికి అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పించాలని డిమాండ్ చేనస్తూ మహానభ తీర్మానించింది.

6. సమాజంలో స్త్రీల పట్ల వివక్ష కొన సాగుతున్నది. ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలలో, వివిధ పనుల్లో వున్న స్త్రీ-పురుషుల మధ్య వేతనాలలో తేడాలున్నాయి. రాజ్యాంగం కల్పించిన హక్కులను పరిరక్షిస్తూ సమాన పనికి సమాన వేతనాలు, కనీస వేతనాలు అమలుచేయాలని డిమాండ్ చేస్తూ తీర్మానించింది.

7. బీజేపీ, ఆరెసెస్ శక్తులు హిందుత్వ బ్రాహ్మణీయ ఆధిపత్యాన్ని, ఫాసిజాన్ని అమలు చేసేందుకు దేశంలో, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో చేస్తున్నదాడులను, బుల్డోజర్ రాజకీయాలను, హింసను ముక్త కంఠంతో ఖండిస్తూ తీర్మానం జరిగింది.

8. పాలకులు హిందుత్వ ఫాసిస్టు పాలనతో మహిళలపై తిరోగమన భావజాలాన్ని రుద్దుతున్నారని, పోరాడి సాధించుకున్న చట్టాల అమలుకి పూనుకోడం లేదని, ఫలితంగా స్త్రీలపై దాడులు, అత్యాచారాలు, వేధింపులు, హత్యలు జరుగుతున్నాయి. కుల దురహంకార హత్యలు, లవ్ జీహాదీ పేరుతో దాడులు, ఘర్ వాపసీ పేరున సాగుతున్న దాడుల పై పోరాడాలని సభ తీర్మానించింది.

9. కేసీఆర్ ప్రజా వ్యతిరేక విధానాలను ఖండిస్తూ నగదు బదిలీ పథకాన్ని ఉపసంహరించుకోవాలనీ, ప్రజా పంపిణీ వ్యవస్థను పటిష్ట పరిచి నిత్యావసర వస్తువుల సరఫరా చేయాలని, డ్వాక్రా గ్రూపులకు వడ్డీలేని రుణాలు మంజూరు చేయాలని మహాసభ డిమాండ్ చేసింది. పేదల ఆకలి, దరిద్రం పెంపొందించే విధానాలు విడనాడాలని, ఉపాధి భద్రత కల్పించాలని డిమాండ్ చేసింది.

10. ప్రజాస్వామికవాదులపై, బుద్ధిజీవులపై దాడులను ఖండిస్తూ, జైళ్లలో మగ్గుతున్న, అక్రమంగా అరెస్టు చేసిన వారందరినీ విడుదల చేయాలని మహాసభ డిమాండ్ చేసింది.

11. చట్ట సభల్లో 50శాతం రిజర్వేషన్లను కల్పిస్తూ ఓబీసీ, మైనారిటీ సవరణతో మహిళా హక్కుల బిల్లుని ఆమోదించాలని కోరుతూ తీర్మానించింది.

12. తెలంగాణ ప్రభుత్వం ప్రజల బలహీనతలను సొమ్ము చేసుకోవడానికి తీసుకు వచ్చిన మద్యం విధానం వలన రాష్ట్రమంతా మద్యం ఏరులై ప్రవహిస్తోంది. కుటుంబ విధ్వంసం, మహిళలపై హింస పెరుగుతోంది. పని సంస్కృతి దెబ్బతినడంతో కుటుంబ ఆదాయాలు పడిపోయి నేర ప్రవృత్తి పెరిగిపోతున్నది. ఈ స్థితిలో మద్యం అమ్మకాలు పెంచుకొనే ఆబ్కారీ విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని, మద్యాన్ని నియంత్రించాలని డిమాండ్ చేస్తూ తీర్మానించింది.


13. నిరసన వ్యక్తం చేసే హక్కుని పరిరక్షించాలి. ధర్నా చౌక్, ఇతర కేంద్రాలలో నిరసనలు, సమస్యలపై పోరాటాలు, ప్రదర్శనలు నిర్వహించడానికి అవకాశం కల్పించాలని కోరుతూ మహాసభ తీర్మానించింది.

14. మహిళలపై పెరుగుతున్న దాడులు, అత్యాచారాలు నిరోధించడానికి తగిన చర్యలు తీసుకోవాలి. సమీక్షలు జరిపి నిర్దిష్ట కార్యాచరణ రూపొందించాలి. 108 తరహా మహిళా హెల్ప్ లైన్ ఏర్పాటు చేసి మహిళలకు భద్రత కల్పించాలి. రక్షణ చర్యలు, నివారణా చర్యలపై ప్రజలకు అవగాహన, చైతన్యం కల్పిస్తూ క్యాంపెయిన్ చేయాలని డిమాండ్ చేస్తూ మహాసభ తీర్మానించింది.

15. సమాన పనికి సమాన వేతనం, కనీస వేతనాలు చట్టం అమలు చేయాలి. మహిళా రైతుల సమస్యలు పరిష్కరించాలి. సామాజిక భద్రతను కల్పించాలి. నిరుద్యోగ సమస్యను పరిష్కరించాలి. మహిళా ఉపాధి అవకాశాలు, ఉపాధి భద్రత కల్పించాలని కోరుతూ తీర్మానించింది.

16. యువతను పెడదోవ పట్టిస్తున్న, మహిళలపై హింసను పెంచి పోషిస్తున్న సామ్రాజ్యవాద విషసంస్కృతిని నియంత్రించాలని, మహిళలపై సోషల్ మీడియాలో విచ్చలవిడిగా జరుగుతున్న ట్రోలింగ్, బ్లాక్ మెయిలింగ్ లాంటి క్రూర చర్యలను నిషేధించాలని మహాసభ డిమాండ్ చేసింది. ❖

వాళ్లను కూర్చోనివ్వండి



- బంగార్రాజు కంఠ 8500350464

తెరిచింది మొదలు
షాపు మూసేంత వరకూ
నాలుగు జీతం రాళ్లు
మనిషిని మంత్రించి అక్కడ నిలబెడతాయి
కాళ్లు గుంజినా నడుం లాగినా
తలపేలినా ఒళ్లు తూలినా
కూర్చోడానికి మాత్రం వీల్లేదని
సంతకాలు చెయ్యని
అగ్రిమెంటొకటి అంతర్లీనంగా
హాలు మొత్తం కలదిరుగుతుంటుంది


విప్పబడే ఐటెమ్ విప్పబడుతూనే వుంటుంది
మడతపెట్టే ఐటెమ్ మడత పడుతూనే వుంటుంది
విప్పడానికీ మడతపెట్టడానికీ మధ్యన
చాకిరీ ఒకటి పెనుగులాడుతూ వుంటుంది

అక్కడ!!
కస్టమర్ అనేవాడు
యజమానికి ఎప్పుడూ దేవుడే కావొచ్చు
సేల్స్ పర్సన్‌కి మాత్రం ఒక్కొక్కప్పుడు
దెయ్యంలా తోస్తాడు

కడుపు కదిలినా కళ్లు మండినా
కనీసం రెస్ట్ రూమైనా పూర్తిగా
అక్కున చేర్చుకున్నదిలేదెప్పుడు
కట్టుకెళ్లిన లంచ్ బాక్సును
పూర్తిగా ఖాళీ చెయ్యనందున
సగం మోత తప్పనందుకు
హేండ్ బ్యాగూ ఎప్పుడూ విసుక్కుంటుంది

బతుకు పెనుగులాట నుండి
తప్పించుకుపోదామని
ఒక నిద్రలో నిర్ణయించుకున్న మరుక్షణం
పసివాళ్ల నవ్వులూ
ముసలివాళ్ల మందులూ
కళ్ళముందు గిర్రున
తిరుగుతుంటాయా..,
చాలీచాలని ఇంటాయన జీతం
గడ్డం పట్టుకుని బతిమాలుతుంటుంది

అవసరానికీ ఆనందానికీ మధ్య
వేలాడుతూ
అక్షరాలా...!,
జీవితం!
అక్కడ నిలువుకాళ్ల మీద
నిలబడేవుంటుంది
దయచేసి
వాళ్లను కూర్చోనివ్వండి!! ❖



ఉపన్యాసం

హక్కుల కోసం తెగించి పోరాడుతున్న ఆదివాసీ మహిళలు

ఆశాలత, మహిళా రైతు వేదిక నాయకులు



ప్రగతిశీల మహిళా సంఘం 3వ రాష్ట్ర మహాసభల సందర్భంగా ఫిబ్రవరి 7వ తేదీన మహబూబాబాద్ పట్టణంలో నిర్వహించిన ప్రదర్శన, ర్యాలీలో మహిళలు 'పోడు భూములను సాధించేంత వరకు పోరాడుతాం' అని దిక్కులు పిక్కటిల్లేలాగా నినదించారు. తమ సమస్యలపై, హక్కులకోసం నినదించిన మహిళలు పోరాట స్ఫూర్తిని అందించారు అంటూ ఆశాలత తన ఉపన్యాసాన్ని ప్రారంభించారు.

తెలంగాణాలో అటవీ భూముల కోసం జరుగుతున్న పోరాటాలలో మహిళలే ఎందుకు ముందు పీఠాన నిలుస్తున్నారో అందరూ లోతుగా ఆలోచించాల్సిన అవసరం వుంది. గ్రామీణ మహిళలకు, ఆదివాసీ మహిళలకు ఇప్పటికే వ్యవసాయము, అటవీ ఫలసాయ సేకరణ వంటివే ప్రధాన బ్రతుకు తెరువు మార్గాలుగా వున్నాయి. అందుకే ప్రాజెక్టుల కోసం భూములు లాక్కుంటున్నా, మొక్కలు నాటటానికి పోడు భూములనుండి ఆదివాసులను వెళ్లగొడుతున్న ప్రతిసారీ మహిళలే ఎదురు నిలుస్తున్నారు. ఆ భూమే లేకపోతే తమకు మనుగడే లేదని వారు అర్థం చేసుకున్నారు. ఒక్క తెలంగాణలో మాత్రమే కాదు దేశంలోని అన్ని ప్రాంతాలలో, అటు ఒరిస్సాలో వేదాంతా కంపెనీకికు వ్యతిరేకంగా నియాంగిరిలోనూ, చాథీస్గఢ్‌లోని హస్దేవ్ అభయారణ్యంలో బొగ్గు తవ్వకానికి అటవీ భూములను లీజుకివ్వటానికి వ్యతిరేకంగా కానీ ఆదివాసీ మహిళలే పెద్ద ఎత్తున పోరాటాలు చేశారు, చేస్తున్నారన్నారు.

ప్రాణాలను సైతం లెక్కపెట్టకుండా ఎన్నో త్యాగాల కోర్చి చేసిన పోరాటాల ఫలితంగా ఆదివాసులకు అటవీ భూములపై అధికారాలను కల్పించే చట్టాలు వచ్చాయి. అవి గుడ్డిలో మెల్లగానే అయినా ఆదివాసులకు తాము సాగు చేసుకునే భూములపైనా, తమ అడవి పైనా, తమ గ్రామ పరిపాలలోనూ, వనరులపైనా కొన్ని హక్కులు కల్పించాయి. 1996లో వచ్చిన పంచాయతీ రాజ్ ఎక్సటెన్షన్ చట్టం (పీసా) ఆదివాసులకు స్వయంపాలన అధికారాన్ని కల్పించింది. 2006లో వచ్చిన అటవీ హక్కుల గుర్తింపు చట్టం ఆదివాసులకు వారు 2005 కంటే ముందు నుండి సాగు చేసుకుంటున్న భూములపై వ్యక్తిగత హక్కు పట్టాలు, అడవిపై సాముదాయక హక్కులు కల్పించింది. ముఖ్యంగా ఆదివాసీ మహిళలకు భూమిపై హక్కులను భార్యా, భర్తలకు ఇద్దరికీ జాయింట్ పట్టాల రూపంలో కల్పించింది. అటవీ హక్కుల కమిటీలలోనూ, గ్రామ సభలలోనూ మహిళలకు సమాన భాగస్వామ్యం కల్పించాయి ఈ చట్టాలు. అయితే అటు కేంద్ర ప్రభుత్వం, ఇటు కొత్తగా ఏర్పడిన రాష్ట్రంలో టఆర్ ఎస్ ప్రభుత్వం రెండూ ఈ చట్టాలను చిత్తశుద్ధితో అమలు చేయటం లేదన్నారు.

అటవీ హక్కుల చట్టం రూపొందించి పద్నాలుగు సంవత్సరాలు, అమలులోకి వచ్చి పన్నెండు సంవత్సరాలయిన తరువాత కూడా తెలంగాణాలో చట్టం అమలు పరిస్థితి తీసికట్టుగా ఉంది. 2008 నుండి 2020 ఆగస్టు వరకు తెలంగాణలో 2,03,976 వ్యక్తిగత అటవీ హక్కుల కోసం దరఖాస్తులు రాగా అందులో 94,774 దరఖాస్తులను మాత్రమే ఆమోదించడం జరిగింది. తెలంగాణా ప్రభుత్వం కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖకి సమర్పించిన నివేదిక ప్రకారం 31/03/2019 నాటికి తెలంగాణాలో తిరస్కరించబడిన దరఖాస్తుల సంఖ్య 83,757. అంటే దీనర్థం దరఖాస్తు చేసుకున్న వాటిల్లో నలభై ఆరు శాతం వాటిని మాత్రమే ఆమోదించి యాభై నాలుగు శాతం దరఖాస్తులను తిరస్కరించారు. దరఖాస్తులని ఎందుకు తిరస్కరించారో

కారణాలు ఏవీ అందులో ఇవ్వలేదు. అలాగే లింగ ఆధారిత సమాచారం కూడా లేదు. అంటే దరఖాస్తు చేసుకున్నవారిలో మహిళలు ఎంతమంది, వారివి ఎన్ని దరఖాస్తులు ఆమోదించారు, ఎంత విస్తీర్ణం మేరకు అటవీ భూమి వారికి లభించింది అనే సమాచారమే లేదు. అటవీ భూముల కోసం పెట్టుకున్న దరఖాస్తులను 'తిరస్కరించే' వీలు అసలు చట్టంలోనే లేదు, కానీ తెలంగాణ ప్రభుత్వం అనేక సాకులు చెప్పి వేలాది దరఖాస్తులను అన్యాయంగా తిరస్కరిస్తున్నది. పోయిన సంవత్సరం మళ్లీ పోడు భూములకు దరఖాస్తులను పెట్టుకోమని ప్రకటించగా 4లక్షల మంది 12 లక్షల ఎకరాలకు పైగా దరఖాస్తులు పెట్టుకున్నట్లు అంచనా. వారికి ఇప్పటివరకు ఒక్క ఎకరాకు కూడా పట్టాలు ఇవ్వలేదు. అటవీ హక్కుల చట్టంలో అటవీ భూములకు పట్టాలు మాత్రమే కాక అడవిలో చేపలు పట్టుకోవటానికి కుంటలు, మేత భూములు, స్మశానాలు, పవిత్ర దేవతలుండే స్థలాలు ఇట్లా అనేక రకాల వనరులపై కూడా హక్కులు కల్పించింది. కానీ ప్రభుత్వం ఒక వేపు ఆదివాసులు పెట్టుకున్న దరఖాస్తులను సెటిల్ చేయకుండా మరొక వైపు వారికి పట్టాలు లేవనే సాకుతో వారిని అటవీ భూములనుండి వెళ్లగొడుతున్నది.

తెలంగాణకు హరితహారం అనే అటవీ పెంపక కార్యక్రమాన్ని తెలంగాణ ముఖ్యమంత్రి 2015 జులై 3వ తేదీన ప్రతిష్టాత్మకంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా 230 కోట్ల మొక్కలను 6 దశలలో నాటి (2021 చివరినాటికి), రాష్ట్రంలో 24%గా వున్న ప్రస్తుత అడవి ప్రాంతాన్ని 33% శాతానికి పెంచాలనే ఉద్దేశంతో ప్రారంభించారు. ఈ కార్యక్రమం కోసం 2014-19 మధ్య కేంద్ర ప్రభుత్వం నుండి కాంపా (కమ్యూనిటీ ఎఫారెస్టేషన్ ఫండ్ మేనేజ్మెంట్ అండ్ ప్లానింగ్ అథారిటీ) నిధుల క్రింద తెలంగాణకు 592.38 కోట్ల రూపాయలను విడుదల చేసింది. ఇప్పటివరకు రాష్ట్ర ప్రభుత్వం 4,027 కోట్ల రూపాయల వరకు పెద్ద మొత్తంలో పెట్టుబడులు పెట్టినప్పటికీ 230 కోట్ల మొక్కల లక్ష్యంలో 177 కోట్ల మొక్కలు మాత్రమే నాటారు. వాటిలో ఎన్ని బతికాయి అనేది కూడా స్పష్టంగా తెలియలేదు. హరితహారం కార్యక్రమం క్రింద రాష్ట్రంలో పెద్ద ఎత్తున మొక్కలు నాటినప్పటికీ అడవి పెరగటానికి దారితీయలేదని అనేక రుజువులు సూచిస్తున్నాయని అన్నారు.

2019లో వెలువడిన రాష్ట్ర అటవీ నివేదిక ప్రకారం తెలంగాణలో అడవి 1% కంటే తక్కువ మాత్రమే పెరిగింది. రాష్ట్రంలో నామమాత్రంగా 0. 8% మాత్రమే అడవి పెరగగా, చెట్ల విస్తీర్ణం 2017తో పోల్చినప్పుడు 2019 నాటికీ 155 కిలోమీటర్లు తగ్గింది. ఒక్క మెదక్ జిల్లాలోనే ఈ రెండేళ్లలో 7 కిలోమీటర్ల అడవి నశించింది. నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ సహాయంతో అటవీశాఖ అడవి విస్తీర్ణంలో మార్పుల గురించి రూపొందించిన నివేదిక ప్రకారం 2018 సంవత్సరంలో 1,682 హెక్టార్ల అడవి నశించింది. రాష్ట్రంలో 410 అటవీ కంపార్టుమెంట్లలో అటవీ విస్తీర్ణం తగ్గిపోయిన ఫలితమే ఇది. రాష్ట్రంలో 2015-2019 మధ్య ఇర్రిగేషన్, త్రాగునీరు, మైనింగ్, క్వారీలు, పామ్ ఆయిల్, యూకలిప్టస్ తోటల సాగుకు, అటవేతర అవసరాలకు 12963.4468 హెక్టార్ల అటవీ భూమిని గుట్టుచప్పుడు కాకుండా మళ్లించారని ఆమె అన్నారు.

ఈ మొక్కలు నాటే కార్యక్రమంలో ప్రతి సంవత్సరం అటు ఆదిలాబాద్ నుండి, ఖమ్మం, వరంగల్, మహబూబ్‌నగర్ జిల్లాలలో ఆదివాసులను వారు సాగు చేసుకుంటున్న భూములనుండి వెళ్లగొట్టి, వాళ్లు నాటిన పంటలను దున్నేసి నాశనం చేసి, అడవి చుట్టూ కందకాలు తవ్వి, అడ్డు వచ్చిన మహిళలను కొట్టి, అవమానించి, అరెస్టులు చేశారు. గర్భిణీ స్త్రీలు, పాలిచ్చే తల్లులు అని కూడా చూడకుండా ఎత్తి ట్రాక్టర్లలో పడేసి జైళ్లకు తరలించి కేసులు పెట్టి వేధించారు. వారి చీరలు లాగేసి అవమానించారు. పోడుభూములను కాపాడుకోవడంలో అన్ని చోట్లా మహిళలే ముందు నిల్చి పోలీసులను, అటవీ సిబ్బందిని ఎదిరించారు, తీవ్ర నిర్బంధాన్ని ఎదుర్కొన్నారు. 'మా ప్రాణాలైనా ఇస్తాం కానీ అటవీ భూములను వదులుకోము' అని నినదిస్తున్నారు. ఆదివాసీ మహిళలు గుర్తుపెట్టుకోవాల్సింది పోడు భూములకు పట్టాలకోసం డిమాండ్ చేయటం మాత్రమే కాదు, ఆ భూములకు జాయింట్ పట్టాలు ఇవ్వాలని కూడా స్పష్టంగా అడగాలి. ఒంటరి స్త్రీలైతే పట్టాలు మహిళల పేరుమీదే ఇవ్వాలని కోరాలన్నారు. అదే విధంగా వంట చెరకు, దుంపలు, పళ్లు, చీపురు గడ్డి, చింతపండు వంటి తమ రోజువారీ అవసరాల కోసం అడవి మీద ఆధారపడిన మహిళలు సాముదాయక అటవీ హక్కులు కూడా డిమాండ్ చెయ్యాలన్నారు. అదే విధంగా గ్రామ సభలలో పాల్గొని తమకు కల్పించిన సమాన భాగస్వామ్య అధికారాలను వినియోగించుకుని అటవీ భూములను కంపెనీల కోసం, ఇతర అవసరాల కోసం ప్రభుత్వం మళ్లించకుండా నివారించడంలో కీలకమైన పాత్ర పోషించాలని కోరారు. అటువంటి ప్రతిపాదనలను తిరస్కరిస్తూ గ్రామసభలు తీర్మానాలు చేయాలని గట్టిగా సూచించారు.

అటవీ హక్కుల గుర్తింపు చట్టం కింద దరఖాస్తు చేసుకున్న వారందరికీ వ్యక్తిగత హక్కు పత్రాలు, సాముదాయక హక్కు పత్రాలు సెటిల్మెంట్ చేసేవరకు హరిత హారం వంటి మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఆపివేయాలని మహిళలు గట్టిగా డిమాండ్ చేయాలని పిలుపునిచ్చారు. అటవీ ఉత్పత్తుల మీద యాజమాన్యం హక్కులు, పివిటిజిలకి ఆవాస హక్కులు, చట్టంలో క్రోడీకరించిన మహిళల హక్కులు అమలయ్యేలా నిజాయితీగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చెయ్యాలని ఆమె అన్నారు. అటవీ సంరక్షణ చట్టానికి 2022 జూన్ నెలలో కేంద్ర ప్రభుత్వం తెచ్చిన కొత్త నియమాలు ఆదివాసుల హక్కులకు తీవ్ర భంగం కలిగించే విధంగా ఉన్నందున వాటిని వెంటనే ఉపసంహరించాలని అందరం కలిసి ముక్త కంఠంతో డిమాండ్ చేద్దామని ఆశాలత పిలుపునిచ్చారు. ❖

డాగ్స్ అండ్ బైట్స్!

బమ్మిడి జగదీశ్వరరావు

"నాలుగేళ్ల పసిపిల్లాడి చావుకు కారణం మీరేనని అంగీకరిస్తున్నారా?"

జడ్జిగారి మాటకు బోనులోని కుక్కలు జవాబివ్వలేదు. జడ్జిగారి వంక తలతిప్పి కూడా చూడలేదు. కుక్కల నాలుకలు వేళ్లాడుతుండగా 'హ... హ... హ...' వగరుస్తుండగా వాటి తలలు చిన్నగా కదులుతున్నాయి. డొక్కలు పెద్దగా వూగుతున్నాయి. తప్పితే అడిగిన మాటను ఆ కుక్కలు చెవిన వేసుకున్నట్టు లేవు.

"మిలార్డ్... నిందిత కుక్కల సమాధానం లేని తనాన్ని అంగీకారంగా భావించి, ఇండియన్ పీనల్ కోడ్ త్రీనాట్టూ ప్రకారం-యీ కుక్కలకు వురిశిక్షలు వేయవలసిందిగా కోరుతున్నాను" నల్లకోటు వంగి వినయంగా విన్నవించుకుంది.

నిశ్శబ్దం ఆవరించగా తలూపుతూ పేజీలను తిప్పుతూ జడ్జిగారు కేసు పూర్వాపరాలను చూస్తున్నారు. ఎండ ప్రభావం చేతనేమో బెంచి గుమస్తాలు వుక్కపోతకు చంకలు గోక్కుంటూ అసహనంగా కదులుతూనే వినయంగా బుద్ధిగా కూర్చున్నారు.

జడ్జిగారు తిరిగి బోనులోకి చూస్తూ "పసిపిల్లాడిది మరణం కాదని, హత్యని కోర్టు గుర్తిస్తున్నది. కుక్కలను హంతకులుగా గుర్తిస్తున్నది..." చెపుతుండగా కుక్కలు భౌభౌమని అరిచాయి.

"సైలెన్స్... సైలెన్స్..." అరిచాడు బిళ్ల బంట్రోతు.

"కుక్కలుగా మీరు చేసిన పనికి పశ్చాత్తాప పడుతున్నారా లేదా?" జడ్జిగారు అడిగారు.

"భౌభౌ... భౌభౌ..." అరిచాయి కుక్కలు.

"ఔనూ- కాదూ- యేదోవొకటి మాత్రమే చెప్పాలి తప్పితే అరవకూడదు" తలడ్డంగా వూపారు జడ్జిగారు.

"బాలుడి హత్యలో గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పోరేషన్ వారికి భాగం లేదా?"

మాట వినిపించి జడ్జిగారు చిరాకుగా ముఖం పెట్టారు. సుమోటోగా కేసుని స్వీకరించడంలోనే కోర్టు వుద్దేశం బహిర్గతం అవుతోందని పబ్లిక్ ప్రాసిక్యూటర్ గుర్తు చేశారు.

"ఏదైనా చెప్పాలనుకుంటే అనుమతి తీసుకొని బోనులోకి వచ్చి చెప్పాలి" జడ్జిగారు గుర్తు చేశారు. ఆ మాటతో వో వృద్ధుడు కుక్కల బోనులోకి వచ్చి నిలబడ్డాడు. అంతా తలలు తిప్పి చూశారు.

"నోరు లేని మూగ జీవాలు..." వృద్ధుడు చెప్పబోయాడు.

"ఏంటి నోరు లేదా? నోరు లేకుండానే కరుస్తున్నాయా?" పబ్లిక్ కూర్చున్న చోటు నుండే యెవరో పెద్దగా అరిచారు.



"ప్లీజ్... కీప్ క్వయిట్..." అని పబ్లిక్‌ని పొలయిట్‌గా హెచ్చరించిన లాయరు "మిలార్డ్... కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖవారి రిపోర్ట్ ప్రకారం మన మహానగరంలోనే వొక నెలకు రెండువేల నుండి రెండున్నర వేలమంది కుక్క కాటుకు గురవుతున్నారు. సంవత్సరానికి యాభైరెండువేల దాక. రాష్ట్రవ్యాప్తంగా చూసినట్లయితే- రెండువేల పంతొమ్మిదిలో వొక లక్షా అరవైయ్యేడు వేలమంది, రెండువేల యిరవైలో అరవైయ్యారువేల యేడువందల యెనభైరెండు మంది, రెండువేల యిరవైయ్యొకట్లో యిరవైనాలుగువేల నూటాయిరవైనాలుగు మంది, గత యేడాది నవంబరు నాటికే యెనభైవేల రెండువందల యెనభైవొక్క మంది కుక్క కాటుకు గురయ్యారు..."

"కుక్క కరవనివాళ్లని లెక్క పెట్టడం యీజీనేమో..." గుసగుసగా అన్నమాటే నిశ్శబ్దంలో అందరికీ వినిపించింది.

"సైలెన్స్... సైలెన్స్..." బిళ్ల బంట్రోతు తన డ్యూటీ తానూ చేశాడు.

"కుక్క కాటుల్లో మన తెలంగాణ రాష్ట్రం యెనిమిదవ స్థానంలో వుంది..." నల్లకోటు జడ్జిగారికి పరిస్థితిని వివరించేదుకు ప్రయత్నిస్తుండగా "త్వరలోనే మొదటి స్థానంలోకి వస్తామని తీసుకువస్తామని హామీ యిస్తున్నాను..." మళ్లీ గుసగుసల గొంతు.

జడ్జిగారు సుత్తితో బల్లమీద కొట్టారు.

న్యాయస్థానం నిశ్శబ్దంగా మారింది.

"కుక్క జీవిత కాలం తొమ్మిది నుండి పదమూడు యేళ్లు..." నల్లకోటు చెప్పబోతే, "నేచురల్‌గా అంతే కాని యిప్పుడున్న కండిషన్లో అయిదేళ్లు మాత్రమే బతుకుతున్నాయి... వాటి జీవన ప్రమాణం సగానికి తగ్గిపోయింది..." అన్నాడు మధ్యలో వృద్ధుడు. జడ్జిగారు వృద్ధుని వంక చూడడంతో అతను తలదించుకున్నాడు.

"కుక్కలు యెనిమిది నెలల వయసుకే సంతాన సామర్థ్యం కలిగి వుంటాయి..." చెపుతున్న లాయరు ఆగాడు. అతని ఆలోచనల్లో 'కుక్కల లైఫే బాగుంది. ఇప్పుడు మన మనుషులకెవరికీ యెంత వయసు వచ్చినా సంతాన సామర్థ్యం లేదు' అనుకున్నాడు. రాను రానూ తగ్గిపోతోంది అని కూడా అనుకున్నాడు. అతని సంతానమో వారసత్వమో అనుభవమేదో గుర్తొచ్చి ఆగిపోయాడు. 'మన ఐవిఎఫ్ సెంటర్లు యెలా బతకాలి?' భార్య అన్నమాట కూడా ఆ సమయంలో గుర్తుకు రాకుండా వుండలేదు.

"వాట్ హేపెండ్?" సున్నితమైన గొంతుతో పలికి "ఊ" చెప్పమన్నట్టు చూశారు జడ్జిగారు.

లాయరు రాని దగ్గు దగ్గాడు. వస్తున్న దగ్గుని ఆపుకోవడానికి ఆగినట్టు సర్దుకున్నట్టు నటించి "యేడాదిలో వొక కుక్క రెండు పర్యాయాలు సంతానోత్పత్తి జరుపుతుంది. సంతానోత్పత్తి కాలం అరవై నుండి అరవైరెండు రోజులు. ఏడాదిలో వొక కుక్క దాని పిల్లలతో కలిసి దాదాపు నలభైరెండు పిల్లలు పెడుతుంది. ఏడేళ్ల కాలంలో వొక కుక్క నాలుగువేల కుక్కలవుతుంది..."

వింటూ రాసుకుంటున్న జడ్జిగారు రాయడం ఆపి దిగ్గున తలెత్తి చూశారు, నమ్మలేనట్టు. జీర్ణం కానట్టు.

"ప్రివెన్షన్ ఆఫ్ క్రూయల్టీ టు యానిమల్స్ యాక్టు నైన్‌టీన్ సిక్టీ యింకా డాగ్ రూల్స్ టూతౌసండ్ వన్ బర్త్ కంట్రోలు ఆపరేషన్లు చేసి కుక్కల్ని తగ్గించుకోవాలని చెపుతోంది సార్..." లాయర్ మాటలు వింటూ "మరి ప్రభుత్వం తీసుకున్న చర్యలేమిటి?" జడ్జిగారు అడిగారు.

"స్టెరిలైజేషన్ అండ్ వేక్సినేషన్ మీద ప్రభుత్వం దృష్టి పెట్టింది. ఒక స్టెరిలైజేషన్‌కు ప్రభుత్వం యేడువందల యాభైరూపాయలు చెల్లిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా యిరవైతొమ్మిదివేల యేడువందల యెనభైతొమ్మిది కుటుంబనియంత్రణ శస్త్ర చికిత్సలు చేశారు... ప్రభుత్వం పదిహేను కోట్లు కేటాయించింది..." రిపోర్టును బెంచి గుమస్తా ద్వారా జడ్జిగారికి అందించాడు ప్రతి లాయరు.

"అదేదో మా తిండికి కేటాయిస్తే బాగుణ్ణు" అంది మాటలు నేర్చిన కుక్క. ఎవరో మనుషులే అన్నారని పరాకున సరిపెట్టుకున్నారు జడ్జిగారు.

"కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు మా ఆడకుక్కలకే చేస్తున్నారు. లింగ వివక్ష యెన్నాళ్లు భరించాలి?" వో ఆడకుక్క వున్నమాటే అంది.

జడ్జిగారికి మాట్లాడేది మనుషులో కుక్కలో యెవరు మాట్లాడుతున్నారో అర్థం కాలేదు.

"మా వోవరీలు తీసేస్తున్నారు..."

"మా వృషణాలు కోసేస్తున్నారు..."

"మాకు తిండి దొరక్కుండా మాడ్చేస్తున్నారు..."

"మాకు సెల్టర్ కూడా లేదు..."

"మామీద నిరంతర హింస జరుగుతోంది. కుక్కని కొట్టినట్టు కొడుతున్నారు- అనే సామెత వచ్చిందంటే అర్థం చేసుకోండి..."

"కర్రా రాయి యేది దొరికితే దానితోనే యెంత దెబ్బయితే అంత దెబ్బ కొడుతున్నారు. కాళ్లు విరిచేస్తున్నారు. వేడినీళ్లు పోస్తున్నారు. కాలిన బొగ్గులు వేస్తున్నారు. కుంటికుక్కల్ని చేస్తున్నారు..."

"మా చర్మం వొలిచేస్తున్నారు..."

"మమ్మల్ని వాహనాలతో గుద్ది యెక్కడికక్కడ చంపేస్తున్నారు..."

"మా కుక్కలకు ప్రమాద భీమా యివ్వాలి. ప్రమాదాలకు కారణం అయినవాళ్ల నుండే ఆ భీమా వసూలు చెయ్యాలి. అప్పుడే రోడ్లమీద డ్రైవింగ్ సరిగ్గా చేస్తారు..."

"ఇవాళ మేం. రేపు మీరు. తస్మాత్ జాగ్రత్త..."

ఉలిక్కిపడ్డారు జడ్జిగారు. తను వింటున్నది నిజమో కాదో భ్రమో యేమో యేమీ అర్థం కాలేదు. లేకపోతే ఆ వృద్ధుడు వాటి తరుపున మాట్లాడుతున్నాడో... ఊహూ...

జడ్జిగారు వృద్ధుని వంక చూశారు.

"దయచేసి మూగ జీవాల్ని శిక్షించకండి..." వృద్ధుడి ముఖం అచ్చం కుక్క ముఖంలాగానే వుంది. 'మనిషా? కుక్కా?' జడ్జిగారి అనుమానం వీడలేదు.

ఇంతలో కిటకిటలాడిన కోర్టుహాలు అలజడితో ఆందోళనతో నిండిపోతూ గోలలాంటి కదలిక?!

"మిమ్మల్ని కరిస్తే తెలిసేది, మీ యింట్లోవాళ్లని కరిస్తే తెలిసేది, మీ కుటుంబంలో పసివాడు చనిపోతే తెలిసేది... మనుషుల తరుపున మాట్లాడకుండా కుక్కల తరుపున మాట్లాడుతున్నారంటే మీరు మనిషో కుక్కో తెలుస్తోంది..."

తెల్లని దుస్తుల యువకుని ఆవేశం కోర్టు హాలుని అదుపు తప్పించింది. నిశ్శబ్దానికి భంగం కలిగించింది. అందరూ ఘొల్లున నవ్వారు.

నవ్వాకనే "సైలెన్స్... సైలెన్స్..." అరిచాడు బిళ్ల బంట్రోతు.

వృద్ధుడు జడ్జిగారి వైపు తిరిగి రెండు చేతులూ జోడిస్తూ "అయ్యా... కుక్కకీ మనిషికీ తేడా యేమిటి?" అని అడిగాడు.

జడ్జిగారికి యేమి చెప్పాలో బోధ పడలేదు. 'మీరే చెప్పండి' అన్నట్టు వృద్ధుడుని చూస్తూ తలని వూపారు.

"విశ్వాసం"

వృద్ధుడు బోను దిగిపోతుంటే 'మా మనోభావాలు దెబ్బతిన్నాయి, తక్షణమే క్షమాపణ చెప్పాలి' అంటూ వొకరి వెంట వొకరు నినాదాలు అందుకున్నారు. బిళ్ల బంట్రోతు "సైలెన్స్... సైలెన్స్..." అని అరుస్తూ వున్నా పెద్దగా వుపయోగం కాలేదు. పది నిముషాలు కోర్టుని వాయిదా వేస్తూ జడ్జిగారు తన గదిలోకి వెళ్లిపోయారు.

...

తన ప్రత్యేక గదిలో జడ్జిగారు అలసటగా సోఫాలో వెనక్కి వాలి కళ్లు మూసుకు కూర్చున్నారు. కాని అలా యెంతోసేపు వుండలేకపోయారు. కళ్లు తెరచి పైకి చూస్తూ కణతలు నొక్కుకుంటూ "టీ" అన్నారు.

సహాయక సిబ్బంది హడావిడి తప్ప టీ రాలేదు.

"ఫ్లాస్కులో టీ తీసుకొచ్చి పెట్టలేదా?"

"తీసుకొస్తున్నాడు సార్"

"ఎప్పుడు?"

"రోజూ చెప్పాలా? ఒకసారి చెప్తే తలకెక్కదా ఆ...?"

".."

"బతికున్నావా ? చచ్చావా? మాట రాదేం?"

"సారీ సర్..."

"ఇంకోసారి రిపీట్ అయ్యిందనుకో... జాబ్ తీసి పారదొబ్బుతాను... రాస్కెల్"

టీ యింకా బిస్కెట్లు తెచ్చి పెట్టారు.

"షుగర్ వెయ్యలేదు కదా?" అలవాటుగా అడిగారు జడ్జిగారు. "లేద్సార్" అలవాటుగానే బంట్రోతు సమాధానం చెప్పాడు.

జడ్జిగారు టీతాగుతూ టీలో బిస్కెట్లు ముంచుకుంటూ తిన్నాక తేన్చారు. తేరుకున్నారు. ఊపిరి ఆడింది. ఇందాక సహాయక సిబ్బంది మీద అనవసరంగా అరిచానని తనకు తానే అనుకున్నారు. కాస్త కడుపులో పడ్డాక చిరాకు తగ్గింది. కోపం తగ్గింది. ఇందాకా నేనే. ఇప్పుడూ నేనే. కుక్కనూ నేనే. మనిషినీ నేనే. కుక్కా మనిషీ వొకటే అని కూడా అనుకున్నారు జడ్జిగారు.

ఆకలి తీరాకే ఆకలి గురించి ఆలోచించడం మొదలు పెట్టారు.

బిళ్ల బంట్రోతు సమయం గుర్తు చేయడంతో జడ్జిగారు కూర్చున్న చోటు నుండి లేచారు.

...

జడ్జిగారు సీట్లో కూర్చుని కుక్కల వంక చూశారు.

కుక్కలు న్యాయం చెప్పమని చూస్తున్నాయో ఆకలి తీర్చమని చూస్తున్నాయో జడ్జిగారు అంత అనుభవం వుండీ తేల్చుకోలేక పోయారు.



కుక్క కరిచి నాలుగేళ్ల బాలుడు చనిపోయాడని జీహెచ్ఎంసీ కారణమని అన్నప్పుడు మేయరు నవ్విన నవ్వు వీడియో ఆ సమయంలో యెందుకో గుర్తుకువచ్చింది జడ్జిగారికి. ఆ వెంటనే మంత్రి మాటలూ గుర్తుకువచ్చాయి. బాలుడి మరణంతో ప్రభుత్వం చర్యలు చేపట్టలే, ముందునుంచీ చర్యలు తీసుకుంటున్నాము- న్యూస్లో చూసిందే. డిబేట్లో ఎంపీ కూడా కుక్క కరిచినట్టు కాదు కదా, చీమ కుట్టినట్టు కూడా ఫీల్ కాకపోవడమూ గుర్తుకువచ్చింది. చనిపోయిన బాలుడూ వాడి అక్కా అమ్మా నాన్నా వారి ముఖాలూ అన్నీ వరుసగా కళ్ల ముందు కదిలాయి.

"మిలార్డ్..."

చెప్పక ముందే "అంబర్ పేట యిన్సిడెంటులో యేమి చర్యలు తీసుకున్నారు?" జడ్జిగారు స్ట్రెయిట్‌గా విషయానికి వచ్చారు.

"మిలార్డ్... యీ కుక్కలకి యెప్పుడూ మాంసం వేసేవాళ్లు వేయకపోవడం వల్లే కుక్కలు బాలుడిపై దాడికి పాల్పడ్డాయి. అంచేత వాళ్లని త్వరలోనే కనిపెట్టి అరెస్ట్ చేస్తాం..." ప్రభుత్వం తరపు లాయరు చెపుతున్నాడు.

'తాము తినడం మానేసి కుక్కలకు మాంసం వేసే మహానుభావులెవరో?' అని జడ్జిగారు అనలేదు.

"మిలార్డ్... యీ యిన్సిడెంటు కార్ల సర్వీస్ సెంటర్లో జరిగింది. కుక్కలు సర్వీసు సెంటర్లోపలికి రాకుండా చూసుకొనే బాధ్యత వాచ్‌మెన్‌గా పనిచేసే మృతుడి తండ్రిదేనని, అయినా సరే ఆయనపై కేసు నమోదు చేయలేదని ఆ యేరియా డిఐ రిపోర్టు యిచ్చారు సార్..." ప్రభుత్వ లాయరు చెపుతూవున్నాడు.

'అంటే కొడుకు చనిపోయాడని కన్సిడరేషన్ యిచ్చారా?' జడ్జిగారి లోపలి ప్రశ్న పెదవిదాటి బయటకు రాలేదు. 'లోపల తోసేయాల్సింది గొడవ లేకుండా' అని కూడా అనుకోలేదు.

"అలాగే మిలార్డ్... సీసీ టీవీ ఫుటేజ్ బయటకు వచ్చిన వ్యవహారంలో మేనేజరుని విధులనుండి తొలగించడం జరిగింది..." ప్రభుత్వ లాయరు చెప్పుకుపోతున్నాడు.

'ఈ పెంటంతా ఆ సీసీ టీవీ ఫుటేజ్ బయటకు రావడం వల్లేకదా... గుడ్ డెసిసన్' అని జడ్జిగారు అనలేదు.

"స్టెరిలైజేషన్ అండ్ వేక్సినేషన్ మీద ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోంది..." ప్రభుత్వ లాయరు చెప్పుకుపోతూనే వున్నాడు.

'ఇప్పుడు స్టెరిలైజేషన్ చేస్తే యెప్పుడో దానికి పిల్లలు పుట్టరు సరే, అప్పటిదాక వున్నవి కరవడం మానేస్తాయా?' అని జడ్జిగారు అనలేదు.

"మిలార్డ్... మానవాళి మనుగడకు ప్రాణాంతకంగా మారిన కుక్కలకు తక్షణమే వురిశిక్ష విధించాల్సిందిగా కోరుకుంటున్నాను..."

జడ్జిగారు పెద్దగా నిట్టూరుస్తూ కుక్కలవంక చూశారు.

కుక్కలన్నీ వొకేసారి తోకలాడించాయి.

"మీరు చెప్పుకొనేది యేమైనా వుందా?" జడ్జిగారు కుక్కల్ని చూస్తూ అడిగారు.

"భౌభౌ... భౌభౌ..." అరిచాయి కుక్కలు.

"ఉంది- లేదు- యేదోవొకటి మాత్రమే చెప్పాలి తప్పితే అరవకూడదు" తలడ్డంగా వూపారు జడ్జిగారు.

"ఈ భూమి అందరిదీ. ఈ భూమిపై జీవించే హక్కు ప్రతి ప్రాణికీ వుంది..."

"మమ్మల్ని శిక్షించండి. కాని మా జాతిని రక్షించండి..."

"నేరం మాది కాదు. ఆకలిది. మేం ఆకలికి తాళలేక పెంట తిన్నాం. పియ్య తిన్నాం. పచ్చగరిక దొరికినా తిన్నాం. కాలువలో మురుగు నీళ్లతో నాలుక తడుపుకున్నాం..."

"ఒక మనిషి తప్పు చేస్తే, మనుషులందరూ తప్పు చేసినట్టా? జాతి మొత్తాన్ని వురి తీస్తారా?"

"అమెరికాలో సీజర్ అనే మా జాతి కుక్క పదిలక్షల ల్యాండ్ మైన్‌లు కనిపెట్టింది. బ్లాస్టింగ్‌లో ముందరి కాళ్లు పోయాక రోబో కాళ్లని అమర్చితే భయపడకుండా మళ్లీ అదే వుద్యోగం చేసి పదకుండేళ్లకు రిటైర్మెంట్ తీసుకుంది. మీకు తెలియనిదా?"

"పిల్లలతో ఆడిన మేమే... సర్వైవల్ కావడానికి..."

బోనులోని వొక్కో కుక్కా వొక్కో మాట అన్నాయో- అన్నట్టు అనిపించిందో జడ్జిగారికి అర్థం కాలేదు.

"వీటిని వురితియ్యకపోతే మనుషులకి లేని విలువ కుక్కలకు యిచ్చినట్టు అవుతుంది" అని, ఆగి "ఈ కుక్కల్ని వురి తియ్యకపోతే కనీసం అడవిలో వదిలి పెట్టమని ఆర్డర్ యియ్యండి సార్" నల్లకోటు వేడుకుంది.

వృద్ధుడు మళ్లీ కుక్కల బోనులోకి వచ్చి రెండు చేతులూ జోడిస్తూ "అయ్యా... కుక్కకీ మనిషికీ తేడా యేమిటి?" అని అడిగిందే అడిగాడు.

వార్తా పత్రికల రిజిస్ట్రేషన్ వివరాలు

రూలు VI, ఫారం IV ప్రకారం

మహిళా గొంతుక మాతృక ప్రచురణ వివరాలు

1) ప్రచురణ స్థలం : హైదరాబాద్

2) ప్రచురణ కాలం : మాస పత్రిక

3) ముద్రాపకుని పేరు : చొప్పర పద్మ
జాతీయత: భారతీయురాలు
చిరునామా : చొప్పర పద్మ
ఇం.నెం. 1-9-295/19/ఎ-1,
శ్రీలక్ష్మి నిలయం, విద్యానగర్,
హైదరాబాద్ జిల్లా -44
తెలంగాణ రాష్ట్రం

4) ప్రచురణకర్త పేరు : చొప్పర పద్మ
జాతీయత : భారతీయురాలు
చిరునామా : పైన పేర్కొన్న ప్రకారం

5) సంపాదకుని పేరు : చొప్పర పద్మ
జాతీయత : భారతీయురాలు
చిరునామా : పైన పేర్కొన్న ప్రకారం

6) యజమాని పేరు: చొప్పర పద్మ
జాతీయత : భారతీయురాలు
చిరునామా : పైన పేర్కొన్న ప్రకారం
పైన పేర్కొన్నవన్నీ యథార్థములు

01.03.2023 (సం)

చొప్పర పద్మ

జడ్జిగారికి యేమి చెప్పాలో బోధ పడలేదు. 'మీరే చెప్పండి' అన్నట్టు వృద్ధుడుని చూస్తూ తలని వూపారు.

"విశ్వాసం"

మనోభావాలు భళ్లున బద్దలవుతుండగా వృద్ధుడు కుక్కగా మారిపోయాడు.

"ఏడువేల యేళ్లుగా మా జాతిని మచ్చిక చేసుకొని మీ మానవజాతి లక్షణాలన్నీ మాకు అంటించి యిప్పుడు అడవిలోకి పంపుతారా? మమ్మల్ని బతకమనా? చావమనా?"

ఏమీ తేల్చుకోలేని జడ్జిగారు నిట్టూర్చి యెప్పటిలాగానే కేసును వచ్చే నెలకు వాయిదా వేశారు. ❖

మార్చి 8 అంతర్జాతీయ శ్రామిక మహిళా పోరాట దినం వర్ధిల్లాలి!

కరపత్రం

మహిళాభివృద్ధిని దెబ్బతీస్తూ, స్త్రీ-పురుష అసమానత్వాన్ని పెంచి పోషించే బీజేపీ బ్రాహ్మణీయ, పితృస్వామిక పాలనకు వ్యతిరేకంగా పోరాడుదాం!!

[illegible]

అంతర్జాతీయ మహిళా దినం మార్చ్ 8 ప్రకటించి 113 సంవత్సరాలు అయింది. ఆనాటి పెట్టుబడిదారీ వ్యవస్థలో కార్మికులు రోజుకు 14 నుండి 18 గంటల వెట్టిచాకిరితో మగ్గిపోయేవారు. కార్మికుల శ్రమదోపిడీతోనే లాభాలు గడించే ఫ్యాక్టరీలలో అమానవీయమైన అణచివేతను, వివక్షను ఎదుర్కొన్న మహిళా కార్మికులు నెత్తురు ధారబోసి వారి హక్కుల కోసం తెగించి పోరాడారు. తమపై సాగుతున్న శ్రమ దోపిడీకి వ్యతిరేకంగా –వేతన పెంపుకోసం, మెరుగైన పరిస్థితుల కోసం, కనీస సౌకర్యాల కోసం, మీటింగ్ పెట్టుకునే హక్కు కోసం, యూనియన్‌లో తమకి కూడా భాగస్వామ్యం కల్పించాలని నినదిస్తూ సంఘటితమయ్యారు. మొదటగా 1908లో తక్కువ పనిగంటలు, మెరుగైన జీతం, ఓటు వేసే హక్కు కోసం న్యూయార్క్ సిటీలో వేలాదిమంది మహిళలు ప్రదర్శన చేశారు. సమ్మెకు సైరనూది, యజమాన్యంపై పోరాడారు. తుపాకిగుళ్లకు ఎదురొడ్డి ప్రాణాలు కోల్పోయారు. అసమాన త్యాగాలు చేసి ఎనిమిది గంటల పని దినాన్ని, వేతన పెంపుదలను, మరికొన్ని హక్కులను సాధించుకున్నారు. అనంతరం వీరి స్ఫూర్తితో పలు ఫ్యాక్టరీలలో మహిళా కార్మికులు మహత్తర పోరాటాలెన్నో చేశారు. ఈ మహిళల డిమాండ్లను దృష్టిలో పెట్టుకుని అమెరికాలోని సోషలిస్టు పార్టీ 1909వ సంవత్సరంలో జాతీయ మహిళా దినోత్సవాన్ని ప్రకటించింది. అమెరికాలో, యూరపులో మహిళా కార్మికులు చేసిన అసాధారణ పోరాటాలకు, త్యాగాలకు సంకేతంగానే మార్చి 8 ని అంతర్జాతీయంగా, ప్రతి ఏటా పోరాట స్ఫూర్తితో జరపాలని మహిళా ఉద్యమనేతలు భావించారు. అందులో భాగగాంనే, 1910లో డెన్మార్క్ రాజధాని కోపెన్‌హెగెన్ లో జరిగిన రెండవ అంతర్జాతీయ సోషలిస్టు సదస్సులో జర్మన్ కార్మికోద్యమ నేత లూయిస్ జీట్జ్ ఆ ప్రతిపాదన చేయగా, కమ్యూనిస్ట్ నాయకురాలు క్లారా జెట్కిన్ సమర్థించారు. ఆ మేరకు ఏకగ్రీవంగా జరిగిన నిర్ణయాన్ని మార్చ్ 8ని అంతర్జాతీయ శ్రామిక మహిళా పోరాట దినంగా ప్రకటించారు. అప్పటినుండి హక్కుల సాధన కోసం, సమానాత్వాన్ని డిమాండ్ చేస్తూ అనేక దేశాల్లో పాటించడం మొదలెట్టారు.

అంతర్జాతీయ శ్రామిక మహిళా దినాన్ని తొలిసారిగా 1911లో ఆస్ట్రియా, రష్యా, డెన్మార్క్, జర్మనీ, స్విట్జర్లాండ్ తదితర దేశాల్లో నిర్వహించారు. అధికారికంగా రష్యా 1917లో, స్పెయిన్ 1936లో, చైనా 1949లో ప్రకటించాయి. 1975లో ఐక్యరాజ్య సమితి మార్చి 8ని మహిళా దినోత్సవంగా ప్రకటించడంతో పశ్చిమ దేశాలన్నిటితో పాటు భారత్ కూడా అధికారికంగా పాటించడం మొదలుపెట్టింది. ఈ దేశంలో మొదటి నుండీ మార్చి 8ని కమ్యూనిస్టు, విప్లవ మహిళా సంఘాలు మాత్రం పోరాట స్ఫూర్తితో నిర్వహిస్తున్నాయి. ఈ క్రమంలో హక్కుల సాధన కోసం ఎన్నో మహిళా ఉద్యమాలు నడిచాయి, విజయాలు సాధించాయి. క్రమక్రమంగా 'శ్రామిక' అనే పదాన్ని, ఉద్యమ దృక్పథాన్ని మాయం చేసి ఒక వేడుక, సంబరం, ఉత్సవంలా జరుపుతూ దాని ప్రాధాన్యతను, స్ఫూర్తిని దెబ్బతీస్తూ వచ్చారు. ఇప్పుడు మార్చ్ '8' స్ఫూర్తిదాయకమైన చరిత్ర భారతదేశంలోని మహిళలకు చాలా సందర్భోచితమైనది. దేశంలో తీవ్ర ఆర్థిక సంక్షోభం ఏర్పడే పరిస్థితి, మనువాద పాలన కొనసాగే స్థితి కనిపిస్తున్నది. ఈ నేపథ్యంలో, పోరాడి సాధించుకున్న విజయాలకు సంకేతంగా, భవిష్యత్తులో చేపట్టవలసిన పోరాటాలకు, కర్తవ్యాలకు, కార్యచరణకు ఒక దీక్షా దినంగా మార్చి 8ని జరపాలని ప్రగతిశీల మహిళాసంఘం (పీవోడబ్ల్యూ) జాతీయ కార్యవర్గం పిలుపునిస్తోంది. అందులో భాగంగానే 2023లో 'మహిళాభివృద్ధిని దెబ్బతీస్తూ, స్త్రీ-పురుష అసమానత్వాన్ని పెంచిపోషించే బీజేపీ బ్రాహ్మణీయ. పితృస్వామిక పాలనకు వ్యతిరేకంగా పోరాడుదాం' అంటూ మహిళలకు పిలుపునిస్తోంది. దశాబ్దాలుగా పోరాడి సాధించుకున్న హక్కులను కాపాడుకోవడానికి మార్చి 8ని పోరాట స్ఫూర్తితో జరపాలని కోరుతోంది.

కేంద్రంలోని బీజేపీ, ఆర్ఎస్ఎస్ ప్రభుత్వం మతోన్మాదాన్ని రెచ్చగొడుతూ, ప్రజల మధ్య వైషమ్యాలను సృష్టిస్తూ, భౌతికంగా దాడులు చేసుకునే వాతావరణాన్ని కల్పిస్తున్న కారణంగా స్త్రీల హక్కులు మరింతగా దిగజారే పరిస్థితి ఏర్పడింది. రాజ్యాధికారాన్ని ఉపయోగించుకుని ఆర్.ఎస్.ఎస్ ఎజెండాను అమలు జరిపే ఈ కార్యక్రమాన్ని మోడీ సర్కార్ వేగవంతం చేస్తోంది. సర్కారు అనుసరిస్తున్న మహిళా వ్యతిరేక విధానాలు, మనువాద తిరోగమన సిద్ధాంతాల వలన ఎన్నో ఉద్యమాల ద్వారా సాధించుకున్న 498(ఎ), 304 (బి) ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్టు, డీవి యాక్టు, లైంగిక వేధింపులు, అత్యాచార నిరోధక చట్టాలు, నిర్భయ తదితర మహిళా చట్టాలు సక్రమంగా అమలు కాకుండా నీరుగారి పోతున్నాయి. ప్రత్యక్షంగా కేంద్ర ప్రభుత్వం హిందూత్వ ఫాసిజాన్ని నిస్సిగ్గుగా అమలు చేయడంతో ఫాసిస్టు రాజకీయాలు స్త్రీల జీవితాల్లోకి చొచ్చుకుని వస్తున్నాయి. స్త్రీలపై వ్యక్తిగత దాడుల నుంచి మూకుమ్మడి దాడులు చేస్తూ అదే లౌకికవాదంగా మధ్య తరగతి యువతను, స్త్రీలను సైద్ధాంతికంగా రాజ్యం సమీకరిస్తున్నది. స్త్రీలను స్త్రీలకే శత్రువులుగా మార్చడానికి ఫాసిస్టు రాజ్యం తెగ ప్రయాస పడుతున్నది. రాజ్యానికి అనుబంధ అంగం అయిన న్యాయవ్యవస్థ కూడా దానికి వత్తాసు పలుకుతోంది. అందుకే,

గుజరాత్‌లో గర్భిణి స్త్రీ బిల్కిస్ బానో సామూహిక అత్యాచారంతో పాటు ఆమె కుటుంబంలో 14 మందిని హత్యచేసిన కేసులో 11మంది దోషులను క్షమాభిక్షపై విడుదల చేసి, ముద్దాయిలు బాహాటంగా తిరిగేలా పాలకులు చేశారు. అందుకోసం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం కూడా కృషిచేసినట్లు కోర్టులో సమర్పించిన ఒక పత్రం చెబుతోంది. ఇక్కడ గ్యాంగ్ రేపిస్టులు, మత హింసలో హంతకులు బెయిల్ పొందడం ఒక హక్కుగా ఉంటుంది. మెజారిటీ మతంలోని ఆధిపత్య కులాల మహిళల 'రక్షణ' పేరుతో తీసుకుంటున్న అనేక చర్యలు, బహు, బేటీ 'ఇజ్జత్' ప్రచారాలు, బీజేపీ పాలిత 11 రాష్ట్రాల్లో లవ్ జిహాద్ పేరిట మతాంతర వివాహ వ్యతిరేక చట్టాలు, మత మార్పిడి వ్యతిరేక చట్టాలు రాజ్యాంగ హక్కులను హరించి వేస్తున్నాయి. మతం మార్చుకొని మైనారిటీ మతస్థుల్ని వివాహం చేసుకుంటే అది చెల్లదని కేరళ హైకోర్టు ఆదేశాన్నిస్తుంది. లవ్ జీహదీ పేరుతో మైనారిటీ యువతపై విరుచుకుపడి దాడులు చేస్తారు. చట్టబద్ధంగా జరిగే పెళ్లిళ్ల ఆపేస్తున్నారు, వివాహ స్వేచ్ఛను తుంగలో తొక్కుతున్నారు. స్త్రీల ఎంపిక స్వేచ్ఛ, ఇతర కులాల, మతాల, వర్గాలతో స్వేచ్ఛగా సంభాషించే హక్కుపై తీవ్రమైన దాడి జరుగుతోంది. రాజ్యాంగం ఇచ్చిన వ్యక్తిగత స్వేచ్ఛ మతఛాందస వాదుల చేతుల్లో విలవిలలాడుతోంది. ఆధిపత్య కుల, వర్గ, పితృస్వామ్య భావజాలం రోజురోజుకీ పెరుగుతున్న సందర్భంలో కులాంతర, వర్ణాంతర వివాహాల్లో దురహంకార హత్యలు ఎక్కువయ్యాయి. దళిత, ఆదివాసీ, బహుజన వర్గాల స్త్రీలపై అత్యాచారాలు, హింసలు దారుణంగా పెరిగాయి. అత్యాచారం జరిగిన వారికి న్యాయం చేయడంలో కూడా కుల, మత వివక్ష కనిపిస్తుంది.

భారతదేశంలో, ప్రభుత్వ ఆర్థిక విధానాల ద్వారా మహిళా సంక్షేమాన్ని మెరుగు పరచడంపై దృష్టి కేంద్రీకరించేవే జెండర్ బడ్జెట్. కానీ మొత్తం డేటాను పరిశీలిస్తే, లింగ బడ్జెట్‌లు ఇప్పటికీ ఈ లక్ష్యాన్ని సాధించడానికి దూరంగా వున్నాయని వెల్లడవుతుంది. 2024 ఎన్నికలకు ముందు తన చివరి బడ్జెట్‌లో, ముఖ్యంగా యువత, మహిళలు, రైతులు, ఓబీసీలు, షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు, వికలాంగులు, ఆర్థికంగా బలహీన వర్గాలు, ఇంకా ఇతర వెనుకబడిన వర్గాలను లక్ష్యంగా చేసుకున్న బడ్జెట్ అని దంకా బజాయించుకున్నారు. సమ్మిళిత వృద్ధి మంత్రం అని గొప్పగా చెప్పుకోవడమే తప్ప ఆ వర్గాలకు ఎటువంటి ముఖ్యమైన ప్రకటన లేదు, కేటాయింపులు లేవంటే పాలకులకు ఎంత చిత్తశుద్ధి ఉన్నదో, ఎవరి ప్రయోజనాలు నెరవేరతాయో అర్థం అవుతుంది.

నిర్మలా సీతారామన్ తన బడ్జెట్ ప్రసంగంలో అనేకసార్లు మహిళా సాధికారత గురించి "మా ఉజ్వల భవిష్యత్తుకు అమృత్‌కాల్ సమయంలో మహిళల నేతృత్వంలోని అభివృద్ధికి నారీ శక్తి యొక్క ప్రాముఖ్యతను ప్రభుత్వం గుర్తిస్తోందని" అని చెప్పుకున్నప్పటికీ సంక్షేమానికి ముఖ్యమైన కేటాయింపులు మాత్రం ఏమీ లేవు. మహిళలు, పిల్లలను లక్ష్యంగా చేసుకునే మహిళా మంత్రిత్వ శాఖ బడ్జెట్ 2022-23లో రూ. 25,172 కోట్లుంటే 2023-24లో రూ. 25,448 కోట్లతో నామ మాత్రపు పెరుగుదలతో ఉన్నది. పిల్లలు, గర్భిణులు, పాలిచ్చే తల్లుల కోసం ప్రభుత్వ ప్రధాన పౌష్టికాహార కార్యక్రమం సక్షం అంగన్‌వాడీ, పోషణ్ అభియాన్ 2.0 పథకాలలో కూడా చెప్పుకోదగ్గ పెరుగుదల లేదు. మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వశాఖ సంక్షేమ హెడ్‌ల కింద, సామాజిక భద్రత, రక్షణ, సంక్షేమం కోసం నిధులు 2022-23 బడ్జెట్ అంచనాలో రూ. 3,437 కోట్ల నుండి సవరించిన అంచనాలో రూ. 2,729 తగ్గాయి. ఈ సంవత్సరం రూ. 1,429 కోట్లకు స్థిరంగా క్షీణించాయి. 2021-22లో సవరించిన అంచనాల నుండి కేవలం 2 శాతం మాత్రమే పెరిగింది. అయితే, ఆ తర్వాత నుంచి తగ్గుతూ వస్తోంది 2022-23లో, జెండర్ బడ్జెట్ కేంద్ర బడ్జెట్‌లో 5.2 శాతంగా ఉంది. 2023-24లోకి వస్తే మొత్తం యూనియన్ బడ్జెట్‌లో కేవలం 5 శాతం మాత్రమే కేటాయించి అభివృద్ధి జపం చేస్తూ మహిళలకు టోకరా వేశారు.

దేశంలో బుల్డోజర్ రాజ్యం నడుస్తోంది. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ముస్లింలు, దళితులు, బహుజనులు, పేదల బతుకులు అతలాకుతలంగా ఉన్నాయి. నరేంద్ర మోడీ ప్రధాని అయిన తర్వాత భారత రాజ్యాంగానికి ప్రమాదం రోజు రోజుకు పెరుగుతూ ఉంది. రాజ్యాంగం మార్చి లౌకిక, ప్రజాస్వామిక పాలన అంతం చేయాలని నాయకులు మాట్లాడుతున్నారు. 2024 ఎలక్షన్స్‌లో కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే పట్టపగ్గాలు ఉండవు. ఇప్పటికే భావ ప్రకటనా స్వేచ్ఛ, లౌకిక దృక్పథం, ప్రజాస్వామ్యం తీవ్ర సంక్షోభంలో పడిపోతున్నాయి. వీటిని కాపాడటంలో మహిళలుగా మనం నిర్వహించవలసిన పాత్ర ఎంతో ఉన్నది. మనం సంఘటితంగా ఫాసిజానికి వ్యతిరేకంగా పోరాడాల్సిన అవసరం ఉన్నది. ప్రజావ్యతిరేక, సామ్రాజ్యవాద అనుకూల విధానాలకు వ్యతిరేకంగా కార్మికులు, రైతులు, యువత, విద్యార్థులు చేసే అన్ని ప్రజాస్వామిక పోరాటాలకు సంఘీభావం తెలుపుదాం. పితృస్వామ్యానికి వ్యతిరేకంగా మన పోరాటాలను ఉధృతం చేద్దాం, వివిధ ప్రజాస్వామిక పోరాటాలలో మహిళల మధ్య ఐక్యత కోసం కృషి చేద్దాం. కేంద్ర ప్రభుత్వ ఫాసిస్ట్ పాలనకు వ్యతిరేకంగా ప్రజాస్వామ్య హక్కులను రక్షించడానికి, విస్తృతం చేయడానికి పోరాటాలను బలోపేతం చేద్దాం. స్త్రీలందరూ పితృస్వామ్య మనువాద భావాజాలానికి, పాలనకు వ్యతిరేకంగా పోరాడాలి.

వర్గం, కులం, మతం, జాతి, జెండర్ సమస్యల్ని, పరస్పర సంబంధాలను అర్థం చేసుకుంటూ మహిళలు ఐక్యంగా పోరాడాలి. మనువాద పునరుద్ధరణ కుట్రలను ప్రతిఘటించడానికి, స్త్రీ-పురుష సమానాత్వాన్ని సాధించడానికి, మహిళాభివృద్ధిని దెబ్బతీసే బీజేపీ బ్రాహ్మణీయ పితృస్వామిక పాలనకు వ్యతిరేకంగా పోరాడాలి. రాజ్యాంగబద్ధ హక్కులను కాపాడుకోవడానికి సంఘటిత పోరాటాలు నిర్మించాలని పీఓడబ్ల్యూ విజ్ఞప్తి చేస్తోంది. మార్చి 8 పోరాటస్ఫూర్తిని ప్రతిబింబించేలా, ఆదివాసీ, దళిత. మైనారిటీ పోరాటాలను ఎలుగెత్తి చాటేలా, ఉద్యమ స్ఫూర్తిని ఎత్తిపట్టేలా అంతర్జాతీయ శ్రామిక మహిళా పోరాట దినాన్ని సమున్నతంగా నిర్వహించాలని ప్రగతిశీల మహిళా సంఘం (పీఓడబ్ల్యూ) జాతీయ కార్యవర్గం పిలుపునిస్తోంది.

ప్రగతిశీల మహిళా సంఘం (పీఓడబ్ల్యూ) - జాతీయ కార్యవర్గం

ప్రచురణకర్త : వి. సంధ్య, పీవోడబ్ల్యూ జాతీయ కన్వీనర్, సిపి భవన్, విద్యానగర్ రైల్వే స్టేషన్ రోడ్, విద్యానగర్, హైదరాబాద్ : 500 044. ❖

ఫాస్ట్ ఫాషన్ ప్రాణాంతకం

ల.లి.త.



సౌందర్యాభిలాష మనకు జన్మతో వచ్చే లక్షణం. అందంగా విభిన్నంగా ఉండే బట్టలు వేసుకుని అందరికీ ప్రదర్శించటం అంటే ఎవరికైనా లోలోపలినుంచి ఆనందం పుడుతుంది... ఈ అనుభూతికి రూపమిచ్చేది బట్టల తయారీ పరిశ్రమలు.

పారిశ్రామిక విప్లవంతో మనిషికి తిండి తరువాత రెండో ముఖ్య అవసరం అయిన బట్టలను ధారాళంగా ఉత్పత్తి చేయటానికి బట్టల మిల్లులు వచ్చాయి. ఇవి రాకముందు పాత కాలంలో బట్టలు అంటే నేత బట్టలే. ఊరంతా నేతగాడి చేతి నైపుణ్యం మీద ఆధారపడేది. కట్టిన బట్ట, విడిచిన బట్ట... ఇలా రెండు గుడ్డలతో జీవితాలు వెళ్లమార్చేసే సగటు జీవితాలే చాలామందివి. సంవత్సరానికి మహా అయితే నాలుగైదు చీరలు, పంచెలు కొనుక్కునేవారు. పిల్లలకు సౌకర్యంగా ఉండే నేత బట్టలు ఒకే తానులోనుంచి తీసి కుట్టుకునేవారు. అప్పటి మైక్రో ఎకానమీలో ఊరందరికీ బట్టలు నేసిచ్చే నేతన్న కళకూ జీవితానికీ ఒక సార్ధకత, గౌరవం ఉండే రోజులవి.

బ్రిటిష్ వాళ్లు రాకముందు మన చేనేత పరిశ్రమకు, ముఖ్యంగా బెంగాల్లో తయారయే చేనేతలకు ప్రపంచ ఖ్యాతి వుండేది. ప్రాచీన రోమ్‌తో వ్యాపారం చేశాం మనం. నైపుణ్యం అయితే చెప్పనే అక్కర్లేదు. ఢాకా మస్లిన్లు, బెనారసీ డిజైన్లు బాగా ఎగుమతి అయేవి. బ్రిటిష్ వాళ్ల పరిపాలనలో మన చేనేత పరిశ్రమను దారుణంగా దెబ్బ కొట్టింది బ్రిటన్. చౌకగా మిల్లు వస్త్రాలు బ్రిటన్ నుంచి మనకు దిగుమతి అయేలా చేసి, మన వస్త్రాల మీద ఎక్కువ పన్నులు, మన ఎగుమతుల మీద ఆంక్షలు పెట్టింది. మన పత్తి తీసుకుపోయి, మిషన్ బట్టలు తయారు చేసి వాటిని మనకే అమ్మింది. భారతదేశపు చేనేత పరిశ్రమ కునారిల్లిపోయేలా చేసింది.

బ్రిటిష్ వారి కాలంలోనే మొదలై ఆ తరువాత మనదేశంలో కూడా బట్టల మిల్లులు జోరందుకున్నాయి. గుజరాత్‌లోని అహమ్మదాబాద్ మాంచెస్టర్ ఆఫ్ ఇండియా అని పేరు తెచ్చుకుంది. అరవింద్ మిల్స్, విమల్, రేమాండ్ లాంటి బ్రాండ్ నేమ్స్ మన బట్టలకు బాగా పేరు తెచ్చాయి. చౌకగా దొరికే శ్రామికులు,

ప్రభుత్వ ప్రోత్సాహం, నల్లరేగడి నేలల్లో పండే నాణ్యమైన పత్తి... ఇవన్నీ మన బట్టలకు ఎగుమతి నాణ్యతను అందించాయి. మరోపక్క మన చేనేత పరిశ్రమ పడుతూ లేస్తూ నిలదొక్కుకుంటోంది. చేనేతలు తయారు కావటానికి నేతన్నకు బోలెడంత చెమట కారుతుంది. సమయం పట్టేస్తుంది. అందువల్ల వీటి ధర సహజంగానే ఎక్కువ. యంత్రాలు భారీఎత్తున బట్టలు వుత్పత్తి చేస్తూ పెరుగుతున్న జనాభా అవసరాలు ఫాస్ట్‌గా తీరుస్తున్న కాలంలో నెమ్మదిగా ఉత్పత్తి చేసే చేతి పరిశ్రమలు కాబట్టి చేనేతలకు ప్రభుత్వ ప్రోత్సాహం పెద్దగా లేదు. పైగా జాతి గర్వించే డిజైన్లు, నేతలో అందం, హుందాతనం, కట్టుకుంటే సౌకర్యం ఉండే ఈ చేనేతల మీద కూడా మోదీ ప్రభుత్వం 5 శాతం జీఎస్టీ వేసింది. అయితే చేనేతను బతికిస్తున్నది ఎగువ మధ్యతరగతి, సంపన్న వర్గాలే. ఆ ధరను అందుకోగలిగి ఆ బట్టల సౌకర్యాన్ని అనుభవించ గలిగేది వాళ్లే. సామాన్యులకు చవగ్గా దొరికేవి పాలియెస్టర్ బట్టలే.

ఇదంతా ఒకెత్తు. 21వ శతాబ్దం దుస్తుల తయారీలో ఒక కొత్త ట్రెండ్ తీసుకొచ్చింది. ఫాస్ట్ ఫాషన్ అని పిలిచే బట్టల వ్యాపారం మనిషికి రకరకాల బట్టలు ధరించాలనే కోర్కెకు పగ్గాలు తెంచేసింది. ఈ ఫాస్ట్ ఫాషన్ సూత్రం ఒకటే. కొత్త డిజైన్లతో అతి చవగ్గా విపరీతంగా బట్టలు తయారు చేసి ప్రజలమీద వదలటం. ఖరీదైన బ్రాండెడ్ బట్టలను అనుకరించే ఈ డిజైన్లు అవి వేసుకున్నవాళ్లకు అసలైన బ్రాండెడ్ బట్టలు వేసుకున్న సంతృప్తిని కలిగించవచ్చు. నాణ్యతా మన్నికా లేని చవక బట్టలు మూడు నాలుగు సార్లు వాడి పారేయటం ఫాస్ట్ ఫాషన్. ఎందుకంటే ఇంతలోనే కొత్త డిజైన్లు మార్కెట్లోకి వచ్చేస్తాయి. పాత డిజైన్ ఇక వద్దు. ఇదీ ఆలోచన. కారు చౌకగా బట్టలు దొరకటంతో పాతవి పారేసి, కొత్తది కొనుక్కుని వేసుకుని మురిసిపోయి ఇన్ స్టాగ్రామ్‌లో ఫోటో పెట్టేస్తే, అక్కడికి జీవితంలో ఆ క్షణానికి సార్థకత వచ్చేసినట్టే. ఇలాంటి క్షణాలు ఎక్కువైపోతున్న కొద్దీ మనం భూమికి ఎంత భారాన్ని పెంచుతున్నామో ఎవరూ ఆలోచించటం లేదు.

ఫాస్ట్ ఫాషన్ రంగంలో పర్యావరణాన్ని ఫాస్ట్‌గా ధ్వంసం చేస్తూ పోతున్న సంస్థలు జారా, హెచ్ అండ్ ఎమ్, ఫరెవర్ 21 మొదలైనవి. జారా సంవత్సరానికి 24 వెరైటీల దుస్తుల కలెక్షన్లు తెస్తే, హెచ్ అండ్ ఎమ్ యేడాదికి 12 నుంచి 16 రకాల కలెక్షన్లు తెస్తోంది. డిజైన్ తయారీ నుంచి మొదలై బట్ట షోరూంకి చేరుకోవటానికి 30 రోజులు మాత్రమే పడుతుంది జారా కంపెనీకి. బ్రిటన్ కంపెనీ బోహూ దీనిని మించి రెండువారాల్లో కొత్త డిజైన్ తయారు చేసి మార్కెట్లో పెడుతోంది. ఈ కంపెనీలకు ప్రపంచం అంతటా షోరూంలు ఉన్నాయి. వీటిని ప్రోమోట్ చేయటం కోసం ఇన్‌స్టాగ్రామ్‌లో సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్లు ఈ దుస్తులు వేసుకుని చూపిస్తూ బాగానే సంపాదిస్తూ ఉంటారు. ఇన్‌స్టాలో ఈవిధంగా చేసుకునే ప్రామోషన్ వల్ల ఈ కంపెనీలకు ఎడ్వర్‌టైజ్‌మెంట్ ఖర్చు కూడా తక్కువే. టీనేజ్ నుండి 30 ఏళ్ల వరకూ ఉన్న జనాభాను లక్ష్యంగా చేసుకున్న కంపెనీలు ఇవి. అందమైన అమ్మాయిలు ఈ దుస్తుల్లో కనబడుతూ ఉంటే అలాంటివే కావాలని ఆన్‌లైన్ ఆర్డర్లు పెడుతూ ఉంటారు ఆ వయసు పిల్లలు. అదే వయసు పిల్లలు మరికొంతమంది ఈ కంపెనీల్లో బట్టల తయారీలో పనిచేస్తూ ఆరోగ్యాలు చెడి రోగాల పాలవుతూ ఉంటారు. ఎంతోమందికి అల్ట్రా ఫాషనబుల్‌గా ఉంటూ రోజుకో డ్రెస్ వేసుకుంటున్నామనే సంతృప్తి కలిగించడం కోసం, అతికొద్దిమంది వ్యాపారులు కుబేరులు కావటం కోసం, లక్షలకొద్దీ శ్రామికులు సరైన దినసరి వేతనాలూ, సురక్షిత వాతావరణం లేనిచోట పనిచేస్తూ దోపిడీకి గురయ్యే చోటు ఫాస్ట్ ఫాషన్ ఫాక్టరీ.

2000 సంవత్సరంతో పోలిస్తే 2014 నాటికి ప్రపంచం అంతటా బట్టలు కొనటం 60 శాతం పెరిగిందట. 85 శాతం బట్టలన్నీ చెత్తకుప్పల్లోకి చేరుకుంటున్నాయి. ఇక ఫాషన్ డిజైన్లు ఎంత తొందరగా కొత్తవి వస్తున్నాయంటే యూరప్‌లో 2000 సంవత్సరానికి రెండు కొత్త డిజైన్ కలెక్షన్లు వస్తే, 2011 నాటికి 5 కొత్త కలెక్షన్లు తెస్తున్నారు. వీటి రవాణాకు మళ్లీ ప్లాస్టికే. వీటిని ప్లాస్టిక్ హేంగర్లలో వేలాడదీసి షాపుల్లో పెడతారు. ఫాషన్ పరిశ్రమనుంచి వచ్చే ప్లాస్టిక్ స్ట్రాలు అని ఈ హేంగర్లని పిలుస్తారు పర్యావరణవేత్తలు. ఇవన్నీ చివరకు చెత్తపోగుల పాలు. ఇవన్నీ ఎక్కువగా అక్రిలిక్, నైలాన్, పాలియెస్టర్ బట్టలే. వీటిని తయారు చేసే క్రమంలో ఇవి నూలు వస్త్రాలకంటే రెండు మూడు రెట్లు ఎక్కువ కార్బన్‌ను విడుదల చేస్తాయి. వీటిని కట్టుకోవటంలో సౌకర్యం లేదు. ఉతికితే వాటిలో ఉండే మైక్రో ఫైబర్లు నీటిలో కలిసి కాలుష్యాన్ని పెంచుతాయి. వీటిని ఉతకటం వల్ల ప్రపంచవ్యాప్తంగా సంవత్సరానికి 5,00,000 టన్నుల మైక్రోఫైబర్ సముద్రంలోకి చేరిపోతోంది. ఈ మైక్రో ఫైబర్ 50 బిలియన్ల ప్లాస్టిక్ సీసాల వ్యర్థానికి సమానం. సముద్రంలో కలిసిపోతున్న మైక్రోప్లాస్టిక్కుల్లో 35 శాతం పాలియెస్టర్ బట్టలు ఉతకటం వల్లనేనని 2017లోనే వచ్చిన ఒక రిపోర్ట్ చెప్తోంది.

మనం విడుదల చేస్తున్న కార్బన్ ముద్రలో 10 శాతం వాటా ఫాషన్ పరిశ్రమదే. ప్రపంచం అంతటా తిరిగేస్తున్న విమానాలు, నౌకలు మొత్తం కలిసి విడుదల చేస్తున్న కార్బన్ కంటే ఇది ఎక్కువ శాతం. ఇంధనం ఖర్చు ఈ పరిశ్రమకు ఎక్కువ. ఇంకా వ్యవసాయం తరువాత ఎక్కువ నీరు వాడేదీ ఫాషన్ పరిశ్రమే. ఒక జీన్స్ పాంట్ తయారీకి 7000 లీటర్ల నీరు, ఒక టీ షర్టు తయారీకి 2700 లీటర్ల నీరు అవసరం అవుతుంది. సగటున ఒక మనిషి 5, 6 సంవత్సరాలు తాగే నీటిని ఒక జీన్ పాంట్ తాగి, తయారవుతోంది. ఒక్క పాలియేస్టరే కాదు మిల్లుల్లో బట్టల ఉత్పత్తికి డిమాండ్ పెరిగిపోతున్న కొద్దీ పత్తి పంటల డిమాండ్ పెరుగుతుంది. పత్తి పంటకు తెగుళ్లు రావటం ఎక్కువ. పురుగు మందుల వాడకం ఎక్కువ. పత్తి పండే నేలలు తొందరగా సారాన్ని కోల్పోతాయి. పత్తి పంటకు నీరు కూడా బాగా అవసరం. ఉజ్బెకిస్తాన్‌లోని 'ఆరల్ సీ' ప్రపంచంలోని నాలుగు పెద్ద సరస్సుల్లో ఒకటి. ఒక యాభై యేళ్లుగా అక్కడ అడ్డూ ఆపూ లేకుండా పత్తిని పండిస్తూ పోయారు. ఆరల్ సీ అంతరించిపోయి ఇప్పుడు అక్కడ మడుగులు మిగిలాయి.



బంగ్లాదేశ్‌లో బట్టల పరిశ్రమలతో మెరిసిపోతున్న ఢాకాలో భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయి.

బట్టలకు రంగులు వేయటం నేలకూ నీటికీ మనుషులకూ హానికారకమైన పని. కెమికల్ రంగుల వ్యర్థాలు దగ్గర్లో ఏది ఉంటే ఆ నదిలో, సరస్సులో, సముద్రంలో కలిపేస్తారు. ప్రపంచంలోని నీటి కాలుష్యానికి ముఖ్య కారణం ఈ బట్టలకు రంగులద్దే పరిశ్రమ. నీటిలో ఈ రంగులు కలవటం వల్ల 72 రకాల ప్రమాదకరమైన రసాయనాలు విడుదల అవుతాయి. వీటిలో సగం వరకూ నీటినుంచి విడదీయలేనివి. ఇలా పారిశ్రామిక నీటి కాలుష్యంలో ఫాషన్ పరిశ్రమ వాటా 20 శాతం.

ఇంకా మనకు కనబడని భయంకరమైన శ్రమ దోపిడీ ఉంటుంది బట్టల పరిశ్రమల్లో. 14 నుంచి 16 గంటలు రోజుకు పనిచేయిస్తూ సెలవులు కూడా ఇవ్వని పరిస్థితి ఉంటుంది. చైనా, బంగ్లాదేశ్, ఇండియా లాంటి దేశాల్లో రోజుకు 18 గంటల పని కూడా ఉంటుంది సీజన్ బట్టి, బట్టల డిమాండ్‌ను బట్టి. ఎక్కువ వేడిలో గాలాడని గదుల్లో రసాయనాల మధ్య చేసే పని ఆ శ్రామికుల శారీరక, మానసిక ఆరోగ్యాన్ని దెబ్బతీసి ప్రాణాంతకం అవుతుంది. జీతాలు అంతంతమాత్రం.

నీటి అవసరం లేకుండా తక్కువ విద్యుచ్ఛక్తితో బట్టలకు రంగులద్దే విధానం, పత్తికి ప్రత్యామ్నాయంగా జనపనార, వెదురు, యూకలిప్టస్ నుండి తీసిన పదార్థాలతో బట్టలు నేయటం వంటి విధానాలు కనిపెట్టారు. కానీ అవి కొంచెం ఖరీదైన ప్రత్యామ్నాయాలు కావడంతో కార్పొరేట్లు వీటిని వాడటానికి ముందుకు రావటం లేదు.

మనం అతిగా కొనుక్కుని వాడి పారేస్తున్న బట్టలే మనకు ప్రాణాంతకం అవుతున్నాయి. కాలుష్యం అంతా గాలిలో, నీటిలో, మన్నులో కలిసిపోయి కేన్సర్, నరాల వ్యాధులు ఇంకా అనేక రోగాలను పెంచుతున్నాయి. అడ్డూ అదుపూ లేని వుత్పాదన ఏదైనా సరే మనిషి ఆరోగ్యం మీద దెబ్బతీసేదే.

ఇప్పుడున్న బట్టల పరిశ్రమ కాలుష్యాన్ని తగ్గించటానికి ప్రత్యామ్నాయాలు ఏవి వెదికినా అవి రాబోయే రోజుల్లో కొత్త సమస్యలు ఏవి సృష్టిస్తాయో తెలియదు. ప్రభుత్వాలు కూడా ఫాస్ట్ ఫాషన్ ఉత్పత్తిదారులకు అనుకూలంగా ఉన్నాయి. అందువల్ల రకరకాల బట్టలు ధరించాలనే కోర్కె తీరటం కోసం వ్యక్తిగత స్థాయిలో బట్టలను అద్దెకు తీసుకోవడం, ఒకరివొకరు మార్చుకోవడం, సెకండ్ హ్యాండ్ మార్కెట్లో కొనుక్కోవటం... ఇవే పౌరులుగా మనం చేయగలిగిన పనులు.

వినియోగదారులుగా బట్టల ఉత్పాదన తగ్గించే మార్గం గురించి మనందరం, ముఖ్యంగా మధ్యతరగతివారు ఆలోచించాలి. డబ్బున్న దేశాల్లో జనం వాళ్లు కొంటున్న బట్టల్లో సగం వరకూ అసలే వాడరు, వేసుకోరు. ఎందరో పేదల కష్టాన్ని దోచేదీ పర్యావరణాన్ని ప్రమాదంలోకి నెడుతున్నదీ అయిన ఫాషన్ పరిశ్రమ నుంచి అసలు వాడని బట్టలను కొనటం కంటే నేరం ఇంకేమిటి? ఫాస్ట్ ఫాషన్ పరిశ్రమ నుంచి కారుచౌకగా దొరికే బట్ట ఎంతోమంది శ్రమను దోస్తుంది. ఎన్నో రసాయనిక వ్యర్థాలను వాతావరణంలోకి చాలా ఫాస్ట్‌గా వదులుతుంది. అందరి ఆరోగ్యాలనూ దెబ్బ తీసి యజమానుల ధనాగారాలు నింపుతుంది.

అన్నిటికంటే ఉత్తమమైన మార్గం మనం ఒక బట్ట కొనేముందర కాస్త ఆగి, ఆలోచించి మరీ బాగ్‌లోనుంచి డబ్బు తియ్యడం. నిజమే వార్డ్‌రోబ్‌లో ఎన్ని బట్టలున్నా ఏదైనా ఫంక్షన్ వస్తే ఏది కట్టుకోవాలో తోచదు. అన్నీ కట్టేసినవే కదా కొత్తది కావాలనిపిస్తుంది. డబ్బు చేతిలో కాస్త ఎక్కువ కనిపించినా మనసు అలాగే పనిచేస్తుంది. పైగా ఆన్‌లైన్ వ్యాపారసంస్థలు బట్టలు కూడా వాయిదా పద్ధతుల మీద ఇస్తున్నాయి. ఇన్ని వ్యామోహాల మధ్య మనసు అదుపులో వుండాలంటే ఒకటే ఆలోచన పని చెయ్యాలి. బట్టల ఫాషన్ పరిశ్రమను ఎంత తక్కువగా పోషించినా అది ఎక్కువే, భూమికి భారమే. ❖

అక్కాచెల్లెళ్లు

షాబానో బిల్‌గ్రామి   అనువాదం: రవికృష్ణ



అదంతా చాలా హఠాత్తుగా జరిగిపోయింది అనుకుంది లైలా. అది మార్చి చివరు, అప్‌స్టేట్ న్యూయార్క్‌లోని వాళ్ల చిన్న పట్టణంలో దట్టంగా కమ్ముకున్న మేఘాలతో వర్షసూచనలు కనిపిస్తున్నాయి. లైలా నిలబడిన కిటికీ బయట ఉన్న ప్రపంచం అప్పటికే ఆకుపచ్చగా మారి, కళకళలాడుతూ జీవాన్ని వెదజల్లాల్సింది పోయి, చాలా నిర్జీవంగా, నిస్సత్తువుగా కనిపిస్తోంది. ఆమె కిటికీ అద్దం మీద వేళ్లతో సవరిస్తుంటే, అద్దం వెచ్చగా తగిలింది. స్వెట్టర్‌ను పైకి లాక్కుంటూ ఆమె తన డెస్క్ పైనున్న బులెటిన్ బోర్డు దగ్గరకు నడిచి, గత ఏడాది కాలంగా దానికి పిన్ చేసిన ఫోటోలను, కార్డులను పరిశీలించింది. వాటిలో ఆమె గత వేసవిలో తన కుటుంబంతో కలిసి కూకా సరస్సుకు వెళ్లినపుడు తీసుకున్న సెల్ఫీ, 'జాగ్రఫీ బీ'లో ఆమె గెల్చుకున్న రిబ్బన్, తన సెవెన్త్ గ్రేడ్ స్కెచ్ బుక్‌లో ఉన్న ఏవో కొన్ని పిచ్చి రాతలు, బ్లూ ఇంకుతో ఏదో వంటకం ఎలా తయారు చేయాలో ఆమె నానీ రాసిన వివరాలు అన్నీ ఉన్నాయి.

పైన ఎడమ పక్కన, తన గత జన్మదినం రోజు ఫోటోను చూస్తూ నిలుచుంది లైలా. దానిలో ఆమె తన బర్త్ డే కేక్ ఎదురుగా, స్నేహితులు, పదమూడు కొవ్వొత్తుల మధ్య వెలిగిపోతూ నిలుచుంది. మోనిక, లూసీ, టామీ, రైనా, చాంతల్ -అందరూ ఫోటోలో ఉన్నారు. వాళ్లతో పాటు మాహీ, ఒకప్పటి తన అత్యంత ప్రియ స్నేహితురాలు కూడా వుంది.

...

లైలా, మాహీలు మొదట వాళ్లకు నాలుగేళ్ల వయసప్పుడు కలుసుకున్నారు. వాళ్లిద్దరూ వింటర్స్ రోడ్ చివరన ఉన్న మాంటిస్సోరి స్కూలుకు వెళ్లేవాళ్లు. తక్కువ ఎత్తులో ఉన్న ఆ భవనం ప్రవేశద్వారం మీద సూర్యుడి బొమ్మ ఉండేది, దాని కిరణాలు మాహీ ఉంగరాలు తిరిగిన జుత్తులా ఉండేవి. మొదటిసారి కలుసుకోగానే వాళ్లు విడదీయలేనంత దగ్గరైపోయారు. వాళ్లిద్దరూ కలిసి హెూమ్ వర్క్ చేసేవాళ్లు, తడితడిగా ఉన్న మోకాళ్లలోపు శాండ్‌బాక్స్‌లో కలిసి ఆడుకునేవాళ్లు, వాళ్లు ఇసుకతో కేకులు చేస్తే అవి ఎండకు విరిగిపోయేవి. నల్లని జుట్టు, కళ్లు, ఎండకు కమిలిన క్యారమెల్ రంగు చర్మంతో, జుత్తు గాలికి ఎగురుతుండగా ప్లేగ్రౌండులో ఆడుకుంటుంటే టీచర్లు వాళ్లిద్దరినీ ఒకరినొకరుగా పొరబడేవాళ్లు. లైలా మాహీ, మాహీ లైలా. పికప్ సమయంలో వాళ్ల తల్లులిద్దరూ ఒక బెంచీ మీద కూర్చుని వాళ్లను చూసేవాళ్లు. ఆ ఆడపిల్లలిద్దరూ మెరిసిపోయే స్వెటర్లు, పొడుచుకు వచ్చిన చెవుల్లాంటి టోపీలు ధరించి, గడ్డిలో ఉన్న సెయిల్ బోటులో కూర్చుని ఆడుకుంటూ నవ్వేవాళ్లు. ఏవో కబుర్లు, అద్భుతమైన కథలు, సూపర్ హీరోలు... ఆ పిల్లలిద్దరూ ఎప్పుడూ ఏదో ఒకటి చెప్పుటూ కబుర్లలో మునిగి తేలేవాళ్లు. లైలా, మాహీలను ఒంటరిగా ఊహించుకోలేం. వాళ్లెప్పుడూ ఒక జంట.

"జెహరా, మనం ఈ తెల్లవాళ్లంతా ఒకేలా ఉంటారని ఎలా అనుకుంటామో, వీళ్లు మనమంతా ఒకటే అని అనుకుంటారు కాబోలు,' ఆదితి తనకు స్కూలు అకౌంటెంట్ ఇచ్చిన ఉత్తరాన్ని లైలా తల్లికి చూపింది. "చూడు, ఇది నీ పిల్ల ఉత్తరం, దాన్ని అతను నాకిచ్చాడు!. ఎంత తమాషా కదూ?"

లైలా తల్లి నవ్వుతూ తల వూపింది. "నిజం చెప్పావు. ఒకోసారి మిసెస్ రాండల్ లైలా ఎవరో, మాహీ ఎవరో తెలీక గందరగోళంలో పడుతుంది. పిల్లలూ, జాగ్రత్త!" లైలా, మాహీలు నవ్వుతూ, గడ్డి మీద నుంచి ఆమె కాళ్ల దగ్గర జారుతూ వచ్చి పడ్డారు.

అన్ని ఆటల్లోకెల్లా వాళ్లకు 'షిప్-షిప్-సెయిల్' ఆటంటే ఇష్టం. చెట్ల కింద ఉన్న పడవలోకి ఎక్కి వాళ్లిద్దరూ, తాము ప్రపంచంలోని వివిధ ప్రాంతాలకు ప్రయాణిస్తున్నట్లు ఊహించుకునేవాళ్లు. కొన్నిసార్లు భారతదేశం, కొన్నిసార్లు పాకిస్తాన్, కొన్నిసార్లు గ్రేట్ వాల్‌ను చూడడానికి చైనా, లేదా జంగిల్ సఫారీ కోసం దక్షిణాఫ్రికా -వాళ్ల ఊహలకు అంతులేదు. చాలాసార్లు వాళ్లు ఊహించుకునే దేశాలకు సరిహద్దులు ఉండవు, ఆ దేశాల

పాలకులు శాంతికాముకులు, లైలా మాహీలను పాత స్నేహితుల్లా సాదరంగా తమ దేశాలకు ఆహ్వానించేవాళ్లు. తమ ఊహా ప్రపంచంలోని దేశాలలోనే వాళ్లు చాలా ఆనందాన్ని అనుభవించే వాళ్లు, తమలో తాము ఏదో కల్పిత భాషలో మాట్లాడుకునేవాళ్లు, తాము చూసిన వింతలు విశేషాలను తల్చుకుని బోలెడు ఆశ్చర్యపోయేవాళ్లు. వాళ్ల లోకంలో టోపీలు ఏడడుగుల పొడవుండేవి, చెట్లు కాండీల్లా పెరిగేవి, ఇళ్లన్నీ వెండి రంగులో మెరిసిపోయేవి.

లైలా మాహీలు స్నేహితులకన్నా ఎక్కువ, వాళ్లిద్దరూ అక్కాచెల్లెళ్లాంటివాళ్లు. ఒకోసారి చుట్టుపక్కల వాళ్లు వాళ్లిద్దరూ కవలలేమో అని పొరబడేవాళ్లు. న్యూయార్క్ సిటీకి, జనసమ్మర్ధానికి దూరంగా, మారుమూల ఉన్న వాళ్ల పట్టణంలో, కేవలం ఓ గుప్పెడు దక్షిణాసియా కుటుంబాలున్నాయి. స్థానిక ఆసుపత్రిలో లైలా తండ్రి ఫిజీషియన్ కాగా, మాహీ తల్లిదండ్రులు మార్కెట్ వీధిలో ఒక హోటల్ నడిపేవాళ్లు. దీపావళి రోజున శర్మ దంపతులు న్యూజెర్సీకి వెళ్లి, మిఠాయిలు తెచ్చి లైలా, ఆమె కుటుంబంతో పంచుకునేవాళ్లు. ఆడపిల్లలిద్దరూ బంగారు, వెండి రంగులో మెరిసిపోయే సల్వార్ కమీజులు, లెహంగాలు వేసుకుని, చేతుల నిండా గాజులు ధరించి, అరచేతులను హెన్నాతో అలంకరించుకుని, లైలా ఇంటి వెనకాల ఉన్న ఊయలలో కూర్చుని ఆకాశాన్ని తాకేలా ఊగేవాళ్లు.

ఆ పిల్లల ఎనిమిదో తరగతి గ్రాడ్యుయేషన్ డే సందర్భంగా జెహరా, "ఏళ్లు ఎలా గడిచిపోతున్నాయో నాకైతే గుర్తే వుండడం లేదు" అంది ఆదితితో. స్టేజీ మీద లైలా మాహీలిద్దరూ తమకున్న అత్యంత అందమైన దుస్తులు వేసుకుని వున్నారు. వాళ్ల జుట్టును మాల్‌లోని పార్లర్‌లో చాలా అందంగా తీర్చిదిద్దారు. జరుగుతున్న గ్రాడ్యుయేషన్ డే తాలూకు మెరుపు వాళ్ల కళ్లల్లో, నవ్వుల్లో ప్రతిఫలిస్తోంది. కొంతసేపటికి వాళ్ల తల్లులు మిగతా వాళ్లతో కలిసి మాట్లాడుతుండగా, వాళ్లిద్దరూ తమ స్నేహితులతో కలిసి ఐస్‌క్రీమ్ కోసం వెళ్లారు.

"లైలా, ఇక్కడికి రా," దగ్గరగా ఉన్న డెజర్ట్ టేబుల్ నుంచి రైనా పిలిచాడు. "నువ్వు నా ప్రశ్నకు సమాధానం చెబుతావా? మీరు ఇండియా నుంచి వచ్చారని రీటా అంటోంది. నువ్వు ఆ విషయం నాకు చెప్పినట్లు నాకు గుర్తు లేదు, కదా లైలా?"

"నేను పాకిస్తాన్ నుంచి వచ్చాను," చెప్పింది లైలా. "అయినా నువ్వెందుకు అడుగుతున్నావు?"

"ఏం లేదు, స్పెల్లింగ్ బీస్ ఎప్పుడూ భారతదేశం పిల్లలే ఎందుకు గెల్చుకుంటారా అని మేం అనుకుంటున్నాము," చెప్పింది రీటా. "భారతీయులు మిగతా వాళ్లకన్నా స్మార్ట్ అనుకుంటా."

"దాని గురించి నేను ఖచ్చితంగా చెప్పలేను," మాహీ నొసలు ముడేసింది. "స్పెల్లింగుల విషయంలో ఇక్కడున్న వాళ్లలో నేను అందరికన్నా ఆఖరు. నాకు నా పేరు స్పెల్లింగ్ చెప్పడం కూడా చాలా కష్టం."

అందరూ నవ్వినా, లైలాకు మాత్రం అక్కడ జాతీయత గురించి ప్రస్తావన రావడం చాలా వింతగా అనిపించింది. లైలా, మాహీలు మిగతా స్నేహితుల్లాగే అమెరికన్లు. వాళ్లిద్దరూ స్థానిక ఆసుపత్రిలో జన్మించారు, దానికి నిరూపణగా వాళ్ల బర్త్ సర్టిఫికేట్లు కూడా ఉన్నాయి. కేవలం ఏడాదికి ఒక రోజు మాత్రమే, కల్చరల్ డే రోజున, ఆ ప్రస్తావన వచ్చేది, ఆ రోజు వాళ్ల అమ్మలిద్దరూ తమ తమ దేశాలకు టేబుళ్లు ఏర్పాటు చేసి, స్కూలులోని వాళ్ల కోసం చిరుతిళ్లు తయారు చేసేవాళ్లు. వాస్తవం ఏమిటంటే, వాళ్ల రోజువారీ జీవితంలో ఎన్నో విషయాలు ఒకే మాదిరి ఉండేవి. ఒకరోజు వాళ్ల తల్లిదండ్రులు వాళ్లను కూర్చోబెట్టి, ఉపఖండం మ్యాపును చూపించినపుడు, మాహీ వాళ్ల నాన్న తన కుటుంబం పాకిస్తాన్‌లోని సాహీవాల్ నుంచి భారతదేశంలోని లూధియానాకు ఎలా వలస పోయిందీ చూపించాడు.

"నీకు తెలుసా?" లైలా తండ్రి జావైద్ చాలా ఉత్సాహంగా, "మా కుటుంబం ఇక్కడే నివసించింది, భారతదేశ రాజధాని ఢిల్లీలో. దేశ విభజన జరిగాక పాకిస్తాన్‌లోని కరాచీలో స్థిరపడింది," అన్నాడు.

అయితే, మహీ, లైలా ఎన్నడూ వీటి గురించి పట్టించు కోలేదు. వాళ్లు అమెరికన్లు. దానికి తోడు ప్రాణస్నేహితులు. వాళ్ల స్నేహం వాళ్లు ఏం తింటున్నారన్న దాని మీద, వాళ్ల తాతముత్తాతలు ఎక్కడ నివసించారన్న దాని మీద ఆధారపడలేదు. లేదా వాళ్లు అలా అనుకున్నారు. తమ అన్నేళ్ల స్నేహం తర్వాత ఏదో ఒక రోజు అంతా మారిపోవచ్చని లైలా నమ్మలేదు, కానీ అది జరిగింది. అదంతా తాను మర్చిపోతే బాగుండు అని ఆమె అనుకుంది కానీ, కానీ అది ప్రతిరోజూ ఆమె కళ్ల ముందు సినిమా రీలులా తిరిగేది. అదొక పీడకల, ఎంత ప్రయత్నించినా మరచిపోలేని పీడకల.

...

ఆ సంఘటనల క్రమం ఎప్పుడూ ఒకే రకంగా ఉండేది: అది అక్టోబర్ నెల, ఆమె తల్లిదండ్రుల పెళ్లిరోజు. ఆ రోజు సాయంత్రం మాహీ వాళ్లమ్మ పెద్ద పార్టీ ఏర్పాటు చేసింది. ఉదయం అల్పాహారాలు అయ్యాక, లైలా మాహీ ఇంటికి వెళ్లింది. అక్కడ స్నేహితురాళ్లిద్దరూ కలిసి కార్డులు, అతిథుల కోసం చిన్న చిన్న బహుమతులు తయారు చేసి, వాటిని బంగారు రంగు కాగితం, వెండి రంగు రిబ్బనులో చుట్టారు. ఐదు గంటలకు మాహీ వాళ్లమ్మ పిల్లలిద్దరినీ పిలిచింది, "మనం ఆరు గంటలకు భోజనానికి బయలుదేరాలి పిల్లలూ. దానికి సిద్ధంగా ఉండండి. మనం ఆలస్యంగా వెళ్లకూడదు."

తాను హడావుడిగా దుస్తులు ఎలా వేసుకుంది, త్వరత్వరగా జిప్పులు, బటన్లు ఎలా పెట్టుకుంది, బూట్లు ఎలా తొడుక్కుంది. తలను తొందరగా ఎలా దువ్వుకుంది, మొదటిసారి లిప్‌స్టిక్ ఎలా వేసుకుంది అన్నీ లైలా గుర్తు తెచ్చుకుంది. ఆ రోజు కొత్త డ్రస్సుల్లో ఆడపిల్లలిద్దరూ రెస్టారెంటులోకి అడుగు పెట్టినప్పుడు తామిద్దరం ఎంతో పెద్దవాళ్లై పోయినట్లు అనిపించింది! వాళ్లు పార్టీ రూంలోకి వెళ్లి అతిథులతో కలిసి, జరగబోయే కార్యక్రమం కోసం ఉత్సాహంగా ఎదురు చూడసాగారు. కొద్ది సేపటి తర్వాత అందరూ నిశ్శబ్దంగా ఉండాలన్న అభ్యర్థన, ఆ తర్వాత లైట్లు మెల్లమెల్లగా మసక బారడం, ఒకటి రెండు మూడు...

"సర్ ప్రైజ్" లైలా తల్లిదండ్రులు నడుచుకుంటూ రాగా అందరూ గట్టిగా అరిచి, నవ్వారు.

"ఆదితి, నువ్వు ఇదంతా ఎప్పుడు ఏర్పాటు చేసావు?" వేడుకలకు హాజరైన డజన్ల కొద్దీ శ్రేయోభిలాషుల మధ్య స్నేహితురాలి కోసం చూస్తూ అడిగింది జెహరా. "అమెరికాలో స్నేహితులే కుటుంబం అన్న మాటలు అక్షరసత్యం." ఆమె నవ్వుతూ మాహీ వాళ్లమ్మను కావిలించుకోగా, పిల్లలిద్దరి తండ్రులూ ఒకరి భుజాలు ఒకరు చరుచుకున్నారు.

పెద్దవాళ్లు కనుక దాన్ని పాడుచేయకుంటే, ఆ సాయంత్రం ఉల్లాసంగానే గడిచిపోయేది.

అదంతా వాళ్లు వెనుక టేబులు మసక వెలుతురులో కూర్చున్న ఎవరో నిర్లక్ష్యంగా చేసిన ఒక వ్యాఖ్యతో మొదలైంది. ఈ రోజు వరకు అది ఎవరు అన్నారో లైలాకు గుర్తు లేదు. ఆ రోజు సాయంత్రం జరిగిన సంఘటనను గుర్తు చేసుకుంటే, ఒకసారి తన తండ్రి అన్నాడని, ఇంకోసారి మాహీ తండ్రి అన్నాడని అనిపించేది. అది టేబుల్ దగ్గర కూర్చున్న ఎవరైనా చేసి ఉండొచ్చు కూడా. చివరికి దాన్ని ఎవరు మొదలు పెట్టారు అన్నది పక్కకు పోయింది కానీ, కుర్చీలను వెనక్కి నెట్టేసి, జనమంతా నిలబడ్డారు. ఒకరిని ఉద్దేశించి ఒకరు బాకుల్లాంటి మాటలు అనుకున్నారు. "జావైద్, తరుణ్, ప్లీజ్ –దయచేసి రాజకీయాలు చర్చించకండి," వాళ్ల అమ్మలు వేడుకున్నారు. "దాని వల్ల ఒరిగేదేమీ లేదు. మన రెండు దేశాల మధ్య పాత గాయాలు మానేంత సమయం మనమిక్కడ ఉన్నాం కదా?" టేబుల్ కింది నుంచి మాహీ చేయి తన చేతిని గట్టిగా పట్టుకోవడం లైలాకు తెలిసింది. వాళ్ల పెద్దవాళ్ల మాటలు –సాధారణమైన మాటలు –దశాబ్దాల వాళ్ల స్నేహాన్ని తుంచేసాయి.

...

"అమ్మా," లైలా ఆ తర్వాత కన్నీళ్లతో అడిగింది, "మన నాన్న, వాళ్ల నాన్న పోట్లాడితే నేను, మాహీ ఎందుకు స్నేహం మానుకోవాలి?" ఆమె తల్లి కేవలం తల వూపి, లైలాను గట్టిగా హత్తుకుంది అంతే. ఏదో ఒక రోజు తామంతా మళ్లీ కలిసిపోతామని కూతుర్ని సముదాయించింది. కానీ కాలం గడిచే కొద్దీ అది అసాధ్యంగా కనిపించడం ప్రారంభించింది. ఆ రెండు కుటుంబాలు కలవడం ఆగిపోయింది, టెలిఫోన్ సంభాషణలు నిలిచిపోయాయి, ఆడపిల్లలిద్దరూ మాల్స్‌కు లేదా పార్కుకు వెళ్లడం ఆగిపోయింది.

లైలా బులెటిన్ బోర్డు నుంచి బర్త్ డే ఫొటోను బైటికి తీసింది, కాలం మళ్లీ వెనక్కి పరిగెడితే బాగుండునని అనిపించింది తనకు. మాహీతో మాట్లాడి అప్పటికే ఆరు నెలలు అవుతోంది. మాహీ ఏమీ ఏదో దూరాన ఉన్న నగరానికో, వేరే రాష్ట్రానికో పోలేదు. నిజానికి మాహీ వాళ్ల ఇంటికి మూడు బ్లాకుల దూరంలోనే, తను చిన్నప్పటి నుంచి పెరిగిన ఇంట్లోనే ఉంటోంది. ఆ ఇంట్లోని ప్రతి అంగుళం లైలాకు తెలుసు. మాహీ డెస్క్ పైనున్న కిటికీలోంచి వాళ్లిద్దరూ రోడ్డుకు అవతల ఉంటున్న అబ్బాయిని రహస్యంగా గమనించేవాళ్లు. మాహీకి ఇప్పటికీ తన ఇంటిలాగే అహ్మద్ ఇల్లు గుర్తు కూడా ఉంటుందని లైలాకు ఖచ్చితంగా తెలుసు. ఎంతైనా, వాళ్లు అక్కాచెల్లెళ్లలాంటి వాళ్లు.

తనతో పాటు పెరిగిన మాహీని ఎవరూ విడదీయడం సాధ్యం కాదని లైలా భావించింది. 'మాహీ కూడా తనలాగే భావిస్తోందా?' లైలా ఆలోచించింది. ఇప్పుడు వాళ్లిద్దరూ హైస్కూలుకు పోతుండడం వల్ల, ఇద్దరూ కలిసి వెళ్లే క్లాసులు లేవు, అందువల్ల ఒకరినొకరు కేవలం స్కూలు వరండాలోనో, లేదా స్కూలు బస్సులోనే మాత్రం చూసుకునేవాళ్లు. లైలా తన ఆప్త మిత్రురాలిని కోల్పోయింది, తమ మధ్య సంబంధాలు మామూలుగా, ఎలాంటి క్లిష్టమైన పరిస్థితులు లేకుండా ఉంటాయా? తామిద్దరూ మంచి దుస్తులు ధరించి, కుకీలు తయారు చేసి, లేదా పార్కులోని ఎత్తైన చెట్టు చివరకు ఎక్కడం మళ్లీ ఎప్పుడు జరుగుతాయి?

ఆమె గతాన్ని మరచిపోలేక పోతోంది.

ఆ రోజు, లైలా స్కూలు బస్సులో మామూలుకన్నా మౌనంగా కూర్చుంది. ఆమె తన స్కూల్ బ్యాగును తన పక్కనున్న సీటు మీద పెట్టింది, మాహీ స్టాప్ వచ్చేంత వరకు ఎవరూ ఆ సీట్లో కూర్చోకూడదు అనేది ఆమె ఆలోచన. ఆమెకు తెలుసు తాను రిస్కు తీసుకుంటోందని. మాహీ తన ఆహ్వానాన్ని తిరస్కరిస్తే అది తనకు చాలా అవమానకరం. కానీ ఎలాగైనా ప్రయత్నించాలని తను గట్టిగా నిర్ణయించుకుంది. లైలా అరచేతులు చెమటలు పడుతుండగా, గుండె వేగంగా కొట్టుకుంటుండగా, బస్సు మెల్లగా మాహీ ఇల్లు ఉన్న గుట్ట మీదకు ఎక్కసాగింది. ఇంటి ముందు లావెండర్ రంగు జాకెట్, బ్లూ జీన్స్ ధరించి, జుట్టును వెనక్కి లాగి కట్టి, తన స్కూలు బ్యాగును భుజాన వేసుకున్న మాహీని చూసింది లైలా. తమ చిన్నప్పటి నుంచి మాహీ అలా నిలబడి ఉండడాన్ని లైలా వందల సార్లు చూసింది. మాహీ మళ్లీ తనతో స్నేహం కొనసాగించడానికి ఏం చేయాలా అని లైలా ఆలోచనలు వేగంగా పరిగెత్తాయి.

మాహీ బస్సు ఎక్కి, వెనక్కి వెళ్లడం ప్రారంభించింది. 'ఇదే సరైన సమయం' అని లైలా తనను పలకరించేలోపు, మాహీ ఆమెను దాటిపోయి, వెనకాల ఉన్న స్నేహితురాళ్లను పలకరించింది. లైలా నిరాశతో కళ్లను, పిడికిళ్లను గట్టిగా మూసుకుంది, తాను మరికొంచెం ధైర్యంగా, ముందుగానే పలకరించి ఉంటే బాగుణ్ను. హఠాత్తుగా ఎవరితో చేయి ఆమె భుజం మీద పడింది.

"ఇక్కడ ఎవరైనా ఉన్నారా?" అది మాహీ గొంతు.

"అవును" లైలా బలహీనంగా నవ్వింది. "నేను నీ కోసమే సీటు తీసి పెట్టాను."

సీటు మీద కూర్చుంటూ మాహీ నవ్వింది. గాలికి ఎగురుతున్న ఆమె కురులు చెట్ల సందులోంచి తొంగి చూస్తున్న సూరీడి వెలుతురుతో మెరిసిపోతున్నాయి. "లైలా, నీతో మాట్లాడకపోతే ఎంత బాధపడ్డానో తెలుసా?" మాహీ పక్కకు తిరిగింది లైలాను హత్తుకునేందుకు.

"నేను కూడా మాహీ. ఏమైనా, మనం అక్కాచెల్లెళ్లం." ❖

అన్యాయ మరణాలు

మొలకలపల్లి కోటేశ్వరరావు

'మన సమాజంలో మహిళలకి సంబంధించి చాలా ఘోరాలూ, అక్రమాలూ, అన్యాయాలూ జరిగి పోతున్నాయి అక్కా! నూటికి 99 కొంపల్లో పురుషాధిక్యత ఎలానూ వుంటుంది. పురుషుల పెత్తనం, దౌర్జన్యాలూ, దబాయింపులూ, అదిలింపులూ, సాధింపులూ, వేధింపులూ చాలా కుటుంబాల్లో సర్వ సాధారణం! సరే, ఇంటి నించి బయటకి వచ్చినా, బయట సమాజంలో కూడా స్త్రీకి కనీస గౌరవం, మర్యాద, మన్నన, ఆదరణ దొరకడం లేదక్కా! దానికి తోడు అన్యాయ మరణాలు కూడా స్త్రీలకే జరుగుతున్నాయి. చూస్తూ చూస్తూ చాలామంది మహిళలు నిండు ప్రాణాలు చిన్ని చిన్ని కారణాలతో పోగొట్టుకుంటున్నారు. స్వయంకృతంతో కొందరూ, ప్రమాదాల్లో కొందరూ అన్యాయంగా పోతున్నారు!'



"ఇప్పుడు ఏం జరిగింది?"

'చూడు, మొన్న గుంటూరులో ఒక పార్టీ వాళ్లు, స్వచ్ఛంద సంస్థ పేరుతో చీరలు పంపిణీ అని చెప్పారు. ఇక చీరల కోసం ఆడవాళ్లు వేలం వెర్రిగా వెళ్లారు. అక్కడ జరిగిన తొక్కిసలాటలో ముగ్గురు అన్యాయంగా చనిపోయారు. మూడు నిండు ప్రాణాలు బలయ్యాయి! ఎంతో మంది గాయపడ్డారు. ఇది కొంత స్వయంకృతమే!'

"ఇందులో స్వయంకృతం ఏముంది? చీరలు ఇస్తామని చెప్పినవాళ్లు సరిగా మెయింటినెన్స్ చేసే పని లేదా? సక్రమంగా నిర్వహించాల్సిన బాధ్యత లేదా? వాళ్ల మీటింగులూ, ఈటింగులూ, చీటింగులతో ఆరేడు గంటల కాలం జరిపారు. అప్పటి వరకూ పడిగాపులు పడిన వాళ్లలో ఓపిక నశించి నెట్టుకుని వుండొచ్చు! ఆ తొక్కిసలాటకి సంస్థదే కదా తప్పు? ఇందులో స్వయం కృతం ఏముంది?"

'వాళ్లు చీరలు ఇస్తామన్నా వెళ్లడం తప్పు! ఇప్పుడు ఎవరు నష్టపోయారు? ఎవరు బలయ్యారు? ఎవరి ప్రాణాలు పోయాయి? ఆ చీర ఎంత అవుతుంది? మూడొందలో, నాలుగొందలో! ఆ మాత్రపు చీరకి అంత దూరం వెళ్లాలా? రోజంతా పడిగాపులు పడాలా? తోపులాడాలా? నిండు ప్రాణం పోగొట్టుకోవాలా?'

"సరే , ఏంచేస్తారు? పేదరికం, గతిమాలిన తనం, దిక్కు లేని బతుకులు! ఆశ! ఉచితంగా చీర వస్తుందని వెళ్లారు!"

'స్త్రీల దుస్థితికీ, దయనీయ పరిస్థితికీ బాధ కలుగుతోంది అక్కా! ఒక్క గుంటూరు ఘటనే కాదు, ఇలా చీరల పంపిణీ సందర్భంగా, దేశవ్యాప్తంగా జరుగుతున్న తొక్కిసలాటల్లో చాలామంది ప్రాణాలు పోతున్నాయి. ఒకసారి ఒక ఘటన జరిగిన తరువాత మిగతా సంస్థలు జాగ్రత్త పడాల్సిన పని లేదా? ప్రజల ప్రాణం అంటే ఎంత చులకన! జనవరిలో గుంటూరులో జరిగితే ఫిబ్రవరి 4న తమిళనాడులో కూడా ఇలాంటి ఘటనే జరిగింది. తిరుపత్తూరు జిల్లా వానియంబాడి ఊరు. అయ్యప్పన్ అనే పారిశ్రామికవేత్త తైపూస ఉత్సవాల సందర్భంగా చీరల దానం అని ప్రకటించాడు. ఉత్సవం ఆదివారం. శనివారం టోకెన్ల పంపిణీ. సంస్థ తలుపులు ఇంకా తెరవలేదు ఉదయం. అప్పటికే టోకెన్ల కోసం రెండువేల మంది వచ్చారు. వేళకి నిర్వాహకులు తలుపులు తెరిచారు. ఇక జనం నెట్టుకోవడం, తోసుకోవడం! ఆ తోపులాటలో నలుగురి ప్రాణాలు పోయాయి. 12మంది గాయపడ్డారు. ఇదే కాదు, ఇలాంటి ఘటనలు అనేకం! పదేళ్ల క్రితం 2013లో లక్నోలో ఇలాంటి తొక్కిసలాటలోనే 21 మంది మరణించారు!'

"వామ్మో ! 21మందా? ఎంత ఘోరం!"

'ఈ దుర్మార్గపు సమాజంలో అలా ఎన్నో ఘోరాలు జరుగుతూనే వున్నాయి. 2013లో ఇంకొద్ది నెలల్లో ఎన్నికలు రానున్నాయి. ఈ లోపు బిజేపీ నాయకుడు లాల్జీ టాండన్ పుట్టిన రోజు వచ్చింది. ఇదే అదును, ఓటరు చేపలకి ఎర వేయాలి, వాళ్లని బుట్టలో వేసుకోవాలనుకున్నాడు సదరు లాల్జీ నేత! ఉచిత చీరల పంపిణీ ప్రకటించాడు. ప్రచారం హోరెత్తించాడు! లక్నో, మహా నగరం కదా! పది వేల మందికి పైగా స్త్రీలు వచ్చారు. చంద్రశేఖర అజాద్ పార్క్‌లో విందు, అనంతరం చీరల పంపిణీ! పసిబిడ్డలతో తల్లులూ, నెలలు నిండిన గర్భిణుల సహా వచ్చారు. విందు ముగిసింది. ఒకటవ గేటు దగ్గర చీరలు ఇస్తున్నారు అని

మైక్‌లో ప్రకటించారు. ఇక తొక్కిసలాట! పసి బిడ్డలతో కలిపి 21 మంది ఆ తొక్కిసలాటలో మరణించారు. యూపీలో ఇదొక్కటే కాదు, ఇలాంటి ఘటనలు ఇంకా జరిగాయి. మధ్య ప్రదేశ్, మహారాష్ట్ర, రాజస్తాన్ రాష్ట్రాలలో కూడా ఇలాంటి ఘటనలు చాలా సార్లు జరిగాయి.'

"అవును. అప్పుడప్పుడు ఈ వార్తలు వస్తూనే వున్నాయి, చూస్తూనే వున్నాం"

'ఈ చీరల దానాల మరణాలే కాకుండా గుళ్లూ గోపురాలూ, కుంభ మేళాలూ, పుష్కరాలూలాంటి మూఢ ప్రదేశాలలో జరిగే తొక్కిసలాటల మరణాలకి అంతే లేదు. వందల మంది మరణించిన సందర్భాలు వున్నాయి. ఆ మరణాలలో ఎక్కువ ఆడవాళ్లే!'

"నిజమే! అలాంటి ప్రదేశాలలో ఆడవాళ్లే ఎక్కువగా మరణిస్తుంటారు."

'అందరికీ కాదు కానీ, ఎక్కువమంది ఆడవాళ్లకి చీరల వ్యామోహం వుంటుందేమో! మగవాళ్ళకి బట్టలు ఇస్తామంటే ఇంత వేలంవెర్రిగా వెళ్తారా? వెళ్లకపోవచ్చు! మెజార్టీ స్త్రీలకి వున్న ఈ చీరల పిచ్చిని తెలంగాణ ప్రభుత్వం పసికట్టింది! బతుకమ్మ చీరలట! ఆడవాళ్లని ఓట్ల వలలో వేసుకోవటానికి ఉచితంగా చీర ఇచ్చే పథకం ప్రవేశపెట్టింది! ముష్టి వేయడం! మగవాళ్లకి సారాయిలు మరిపి, వాళ్ల నించి వేలకివేలు కొల్లకొట్టి ఆ సొమ్ముతో ఆడవాళ్లకి చీరలా? వాతలు పెట్టి తైలం రాయడం కాదూ? సారాయిలతో సంసారాల్ని సర్వ నాశనం చేస్తూ, పచ్చని కాపురాల్లో నిప్పులు పోస్తూ చీరల దానమా? సారాయి వ్యసనం వలన ప్రత్యక్ష కారణాలతోనూ, పరోక్ష కారణాలతోనూ ఎంతోమంది యువకులు మరణిస్తున్నారు. స్త్రీల తాళిబొట్లు తెంచి, వాళ్ల సొమ్ముతో వాళ్లకే చీరలు! ఎంత దుర్మార్గం! స్త్రీలు ఆ చీరలు తీసుకోవడం కాదు, తిరస్కరించాలి. ముందు మీ సారాయి దుకాణాలు బంద్ చేయండ్రా, మా మగవాళ్లు సారాయికి తగలేస్తున్న సొమ్ముతో పోలిస్తే మీరు ఇచ్చే చీరలు ఏ పాటి అని నిలతీయాలి. ప్రశ్నించాలి. తిరగపడాలి!'

"అలా చేస్తే బాగుంటుంది కానీ మన స్త్రీలకి అంత చైతన్యం వుంటే ఇన్ని సమస్యలు ఎందుకు వస్తాయి? ఇన్ని బాధలు ఎందుకు పడతారు? ఇన్ని కష్టాలు ఎందుకు ఎదుర్కొంటారు?"

'ఈ బాధలూ, కష్టాలూ ఎంతకాలం భరిస్తారు? తిరగపడే రోజు దగ్గరలోనే వుంది. సరే, మనం స్త్రీల మరణాల విషయానికి వద్దాం. వ్యవసాయ రంగంలోనూ ఈ అన్యాయ మరణాలు అసంఖ్యాకంగా జరుగుతున్నాయి అక్కా!"

"అక్కడ ఎందుకు జరుగుతున్నాయి?'

'ఇవ్వాళ వ్యవసాయ రంగంలో పనిచేసే జనాభాలో 70 నించీ 80 శాతం స్త్రీలు వున్నారు. 20 నించి 30 శాతం మాత్రమే మగవాళ్లు. ఇది నా అంచనా. నిజానికి ఈ సంఖ్యకి మించి వ్యవసాయంలో స్త్రీలు వున్నారు. యాంత్రీకరణ ఫలితంగా వచ్చిన మార్పు ఇది. ట్రాక్టర్లు నడపడం, యంత్రాలు నిర్వహించడం మాత్రమే మగవాళ్లు చేస్తున్నారు. వ్యవసాయంలో ప్రధానమైన నాట్లు, కలుపులు, కోతలు, గ్రేడ్లు లాంటి పనులు చేసేది సింహ భాగం మహిళా కార్మికులే! పంటల్లో వైవిధ్యం కూడా పెరిగింది. వైవిధ్య ఫలితంగా ఊళ్లో పని వుండదు, పొరుగూరులో కూలీల కొరత వుండొచ్చు! దానితో ఇతర గ్రామాలకీ, ప్రాంతాలకీ కూలీల రవాణా, వలస పెరిగింది. ఆటోలూ, ట్రాక్టర్లలో మహిళా కూలీలు 10, 20 మైళ్లు కూడా పనుల కోసం పోతున్నారు. గంపలో కోళ్ళని కుక్కినట్లు ఆటోల్లో కుక్కుకుని, కిక్కిరిసి పోతున్నారు. ట్రాక్టర్లు, ఆటోల్లో పనులకి పోతుంటే అవి తిరగపడీ, మరో వాహనం ఢీకొని జరిగే ప్రమాదాల్లోనూ మరణిస్తున్నారు. ఫిబ్రవరి 4న శ్రీకాకుళం జిల్లా ఆముదాలవలస మండలం మండాది వద్ద ఉపాధి పనులకి నడిచి పోతున్న కూలీల్ని పాలకొండ వైపు వెళ్తున్న లారీ ఢీ కొట్టింది. ఆ ప్రమాదంలో నలుగురు మహిళా శ్రామికులు మృతి చెందారు. 5న బాపట్ల జిల్లా అద్దంకి మండలంలో ఆటో తిరగపడి ఇద్దరు మహిళా కూలీలు మృతి. 6న పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెం మండలం మాధవరం వద్ద కలుపు తీసి వస్తున్న కూలీల ట్రాక్టర్ పల్టీ కొట్టి భారతి, సుజాత అనే ఇద్దరు మహిళా కూలీల మృతి. ఇవి ఉదాహరణకి చెపుతున్నా! ఇలా ప్రతి రోజూ మన రాష్ట్రంలో 26 జిల్లాల్లో ఎక్కడో చోట ప్రమాదం జరగడం, మహిళా కూలీలు మరణించడం! ఇవి జిల్లా ఎడిషన్లకు పరిమితం కావడంతో ఇతర ప్రాంతాల వాళ్లకి తెలియడం లేదు.'

"కూటి కోసం కూలికి పోతేనే కుండ కాలీ లేకుంటే కడుపు కాలే బతుకులు! ఇలా కూలి పనులకి వెళ్లే వాళ్లవీ, చీరల దానాల కోసం పోయేవాళ్లవీ పేద కుటుంబాలు! వాళ్లు మరణిస్తే ఆ పేద కుటుంబాలు ఎంత క్షోభిస్తాయో, ఎంత ఛిన్నాభిన్నం అవుతాయో, ఎంత కల్లోలమవుతాయో కదా! ఆ బిడ్డలు, పసిబిడ్డలు కూడా వుండొచ్చు, దిక్కు లేనివారు అయిపోతారు! ఈ అన్యాయ, అక్రమ, అసహజ, వేదనాపూరిత బాధామయ మరణాలు ఇలా కొనసాగాల్సిందేనా? ఇలా ఎంత కాలం? వీటికి పరిష్కారం లేదా?"


'పరిష్కారం ఏముంది అక్కా! చీరల దానాల మరణాలు ఆగిపోవాలంటే, ఆ దానాలు స్వీకరించడానికి వెళ్లకుండా వుండటమే ఇప్పటి పరిష్కారం. అలా వెళ్లాల్సిన అవసరం లేని సమాజం తెచ్చుకోవటం శాశ్వత పరిష్కారం అనుకో. వెళ్తే ప్రాణాలతో తిరిగి రాకపోవచ్చు! ఎందుకంటే మన సమాజంలో పేదరికం అంత ఎక్కువగా వుంది. ఇక కూలీల మరణాల్ని మనం ఆపలేం. దూర ప్రాంతంలో దొరికిన పనికి ఆటోలోనో, ట్రాక్టర్‌లోనో, మరో వాహనంలోనో వెళ్లక తప్పదు. జాగ్రత్తగా పోనిమ్మని డ్రైవర్‌ని హెచ్చరించడం తప్ప ఇంకేం చేయగలం? ఇవే కాదు, ఈ సమాజపు నీచత్వం, దుష్టత్వం, దుర్మార్గపు స్వభావం కారణంగా ఎన్నో రకాలుగా, ఎన్నో రూపాలలో స్త్రీల మరణాలు సంభవిస్తున్నాయి. ఈ మరణాలకి పరిష్కారం ఈ దుష్ట సమాజం మార్పు తప్ప మరో దారి లేదు.' ❖

దేవుని పెండ్లాలు

జూపాక సుభద్ర

ఓ పెద్దవ్వా ! నా గోస ఏమని సెప్పుదునే... నన్ను కన్నోల్లు గీ భూమ్మీదేసి, నాకు జోగమ్మ రాత రాసి, నడిఇంట్ల గాదు ఊరు నడిమిట్ల బొండిగ్గోసి, నన్నాగం జేసి, గియ్యాలీ లోకంల లేకుంటనే బోయిరి. గీల్లు నా అన్నదమ్ములకు, అక్క సెల్లెండ్లకు పెండ్లీలు చేసినట్లు, నాక్కూడా జేత్తే వొడిసి పోవు. అది వేరే లెక్కుండు. గిట్ల పాలు మర్పిన్నో లేదో, గట్ల జోగమ్మజేసిరి. వూల్లే ఎల్లమ్మ గుడికాడ దప్పు సప్పుల్లల్ల, ఎవడో యీదు బోయినోడితోని పుత్తెగట్టిచ్చి, దేవుని పెండ్లమని వూరంత తిని, తాగి... నా పేరు మీద బాగ పండుగు జేస్కునిరి. పుత్తె దారంతోని బడికివోతే 'జోగమ్మ', 'దేవుని పెండ్లమ్' అని బడిల నవ్వుల పాలయి, బడి బందాయె! సదువు సాకిరేవుకు బాయె!

వూరి పటేలుగాడు జేసిన కతయిది. ఆనికి కలల యెల్లమ్మ కనవడి ఫలానోని బిడ్డను బోగమ్మంజేయుంండ్రి, వూరికి అర్కతి బర్కతి వుంటది. పంట, ఫలము, సేను, సెల్క మంచిగుంటదని సెప్పిందాట. అదేందోనే పెద్దవ్వా! మన గూడెమ్‌లనే ఆడాల్లుంటరా జోగమ్మను జెయ్యనీకి, పటేలు యిండ్లల్ల, వూరిండ్లల్ల ఆడోల్లుండరానె?! మనమే ఆడోల్లమా? గా ఎల్లమ్మ గూడా మన గూడెపాడోల్లనే కోర్తదెందుకే. పటేల్ల ఆడోల్లను గూడ కోరవచ్చు గదనే! యిది పున్య కార్యమంటరుగా, పున్యమేదో అల్లు గూడ మూట గట్టుకోవచ్చుగదనే! వూరి పటేలుగాడు, నోరులేని నా కన్న తండ్రిని, తల్లిని మాయ చేసి మత్పరిచ్చి 'అరే రాజిగా! నీ బిడ్డను జోగమ్మ చెయ్యాలని ఎల్లమ్మతల్లి నా కలల కనవడి సెప్పిందిరా! దేవర కన్ను నీ కుటింబం మీదున్నదంటే నీ కట్టాలు తీరినయి పోరా! ఎంత నోసుకోని పుట్టినవురా నువ్వు, నీ బిడ్డా!' అని సెట్లెక్కిచ్చిండు. నీ బిడ్డెను జోగిన్ని జేత్తే, ఎల్లమ్మ గుల్లె పైసలన్ని మీకే. గుల్లె దొరికే కొత్తలు, కొబ్బరి కాయలు, కుడుకలు, బెల్లము, బట్టలు గిట్ల అన్ని మీయేరా! నువ్వు' గీ మొద్దు కట్టమ్ చేసినా బతుకు ఎటమట మేనాయె, జోగిన్ని జేత్తె మీ యింటిల్లాదులు కాలుమీద కాలేసుకోని బత్కొచ్చురా రాజిగా!' అని బోర్లేసి, నన్నీ కంటగతికి దెచ్చింండ్రు అందరు గలిసి, గిప్పుడు కులమ్‌ల కలువకపోతి, బలగమ్‌ల కలువకపోతి. జోగమ్మను కూలి నాలికి గూడ యెవ్వరు పిలువరైరి! నీకేంది పిల్లా! రాజా బతుకు. ఎండల కూలికి బొయే పని లేదు. నాలుగిండ్లు దిరిగితె దర్జాగ పూటెల్లిపోతదంటరు. కాని పెద్దవ్వా! బిచ్చందిరుగుడు యెంత నాదాను పనే, పనిపాటలు జేస్క బతికేటోల్లం గిట్ల బిచ్చమెత్తి బతికితే అవుమానమే గదే! అడివికి కట్టెలు మోసిన బతుకాయె. వూరు గాడుదులు యెదకొచ్చిన గొడ్లోల్నే సూత్తరు. కనవడితె కన్నుగొడ్తరు. వాల్ల కండ్లు కాకులు బొడవ. కుక్కలెంటబడ్డట్టే పడ్తరు. యింటి సుట్టు నాసవెట్టినట్టు తిరుగుతరు. ఎవనివిరా నా యింటి సుట్టు దిరుగుతరు బాడ్కావుల్లారని తరిమితే 'జోగమ్మవై పతివ్రత మాట లేందే? జోగమ్మంటే అందరి సొత్తు, వూరుమ్మడి



సొత్తుగదా! వచ్చినోన్ని దూరంగొట్టుడు జోగమ్మ నీతిగాదని' ఉల్టా నాకే నీతులు జెప్తరు. అడిగినోడు లేడు, కడిగినోడు లేడు. రోట్లె తలవెట్టి రోకటి పోటులకు యెదురొడ్డుడు వశం అయితలేదు. అందరికి అలుసైపోతి గిది దేవుని కార్యమని యెవ్వడు నాకు మాట సాయంరారు. గాదేవుడు సావ. గీ మాదిగాడామెకు జోగిని తంతువెట్టి, గిట్ల ఆగం పచ్చిని జేసుడు దర్మమానె పెద్దవ్వా? నన్ను యిట్టపడ్డోన్ని, నేనిట్టపడ్డోన్ని సూద్దామంటే యెవ్వడు కనవడదు. అందరు బాడ్కావులు మదం సూపులే సుత్తరు.

వూల్లె నారాయణ పటేలు, ఆనందమ్ నాకు పైస, కొత్త సాయం జేసింండ్రు. మాట గలిపింండ్రు. నేను ఆనందాన్ని మనసుబడ్డ. నారాయణ పటేలుకు యెదురు సెప్పే బలంలేని దాన్నయిన. పటేలు కొకబిడ్డ, ఆనందానికొక బిడ్డె పుట్టింది. గీ సంగతి నాకే యెరుక. కులమ్ పెద్దకు సెప్తే, పెద్ద ముసలవ్వలకు సెప్తే... 'బైటకు యెక్కడ సెప్పొద్దు బిడ్డా పానాల్దీత్తరు. కడుపుల బెట్టుకో గీ ముచ్చట. ఎట్లనన్నా బైటికొచ్చినా జోగమ్మ దగ్గిరికి పదిమంది బోతరు వత్తరు. యే పిల్ల ఎవనికి పుట్టిందో యెవలకు యెరుక అని లోకం తీసేస్తది గానీ, కనే తల్లికెరుకని యే దొంగ బాడ్కావులు జెప్పరు.'అన్నరు. పెద్దవ్వా! నువ్వు సెప్పేది సూడు. గా పటేల్లు సోక్కంపూసలేంగాదు,

ఆ నారాయణ పటేలోని సిన్నాయినకు పిల్లల్లేకుంటే శానేండ్లు దావుకాండ్లు దిరిగినా, కనవడ్డ రాయికల్లా కడిగి బొట్టు బెట్టి గుల్లు, గోపురాలు దిరిగినా, పిల్లలు గాలే. మీ సినతాత కొడుకు అల్లింటికి జీతం బోయినంకనే యిద్దర్ని కన్నరని సెప్పితివి గాదే పెద్దవ్వా?! గయన్ని తెల్లయే, సొక్కంగాకున్నా సక్కటియే! కన్న పిల్లలకు తండ్రి ఎవలో సెప్పుకోలేని బతుకెవ్వలికి రావద్దే. నా పోరగాండ్లకు తండ్రెవలంటే ఏంజెప్పుదునే? పోరగాండ్లు అడుగలేక గుడ్లనీల్లు గుడ్ల గుక్కుకుంటరు. నా పిల్లలకు తండ్రి ఫలానోడు, ఫలానోడని వూల్లో యారేషమేసి సెప్పాలనిపిత్తదే! అట్ల సెప్పినా, ఎవ్వలు సెవిన వెట్టరు. పిచ్చిదైందని లేని రాల్లేత్తరు. అందుకే నోట్లె నాలిక వెట్టుకొని బత్కుతన్న.

నా సదువే సట్టు బండలాయె. నా పిల్లలనన్నా సదివిత్తనని బల్లెకు తీస్కపోతే తండ్రి పేరడుగవట్టిరి. తండ్రి లేడు, తల్లి పేరే రాసుకోండ్రంటే... తండ్రి లేంది పిల్లలెట్ల బుట్టిండ్రు, తండ్రి పేరే కావాలని అడుగ వట్టిరి. యేం జేతు? సెప్పితె, వూరు బగ్గుమంటది. తండ్రి సచ్చిపోయిండు తల్లినే వున్న నాపేరు తీసుకోండ్రంటే 'తండ్రి సచ్చిపోయినా పేరుంటది గదా?' అని సచ్చిపొయిన సత్పికటు తీస్కరమ్మని వకీలు సాబు మాటలంటరు బల్లె పంతుల్లు. గిసోంటియి తప్పిచ్చనీకి, మా జోగిని సంగపోల్లు లొల్లివెడితె, తండ్రి పేరక్కరలేదు, తల్లి పేరున్నా సాలని, సర్కారోల్లు ఏందో ఆదరిచ్చిండ్రాట. గదే సంగతి జెప్తే, ఆ ఆదరు కాపి తేపో, తెచ్చెదాక బల్లెకు తీసుకోమంటరు. తోటి పోరగాండ్లు షెరికై బల్లె కూసుంటే, నా పోరగాండ్లు నారాజై నాతోని బల్మీటికి యింటికి తోల్కచ్చిన. మండలానికి రొండు మూడు రోజులు దిరిగి, జోగిని సంగపోల్ల ఆదరు కాపిదెచ్చి, పోరగాండ్లను బల్లె షెరీకు చేసినంక పానం నిమ్మితమైంది. లేకుంటే నా ఆడివిల్లల మీద యెవని కన్నువడ్తదో, యెవని కన్ను సెదుర్తదో యెవలకెర్క? జోగిని బిడ్డెలు జోగినే సెయ్యాలని జుత్తరు కొడుకులు! అందికే నేనేమన్న గానీ, నా ఆడివిల్లలు నా వోలిగ జోగిని బత్కు అరికీసద్దు. అల్లు సదువుకొని కొలువులు సెయ్యాలనే పెద్దవ్వా!

ఓ దిక్కు జోగినీని సెయ్యొద్దని, సేత్తే జైలనీ, తప్పని ఓ శాన పాబందులు సట్టాలు జేసిండ్రట. గాని యేం ఫాయిద! జోగిని జేసుడాగుతందా! బోనాల పేరుమీద, కొలువుల పేరుమీద, దేవర పేరు మీద జరుగుతనే వుండే, మా అసోంటోల్లు బలిగావట్టె. యెనుకాదారం లేదు, ముందటాదారం లేదు.

నా పొలగాండ్లు 'అమ్మా నువ్వు బిచ్చమడుక్కనేదానికి ఎందుకు వోతన్నవు, మన సుట్టుపక్కలోల్లు, సుట్టాలోల్లు, నాయినలేకున్నా బిచ్చానికి వోతలేరు, మనల్ని బిచ్చపోల్లని, జోగినోల్లని యెందుకంటండ్రమ్మా' అనే అల్లకు యేమని సమజ్జేద్దు? అల్ల పుట్కకు కారకులు బతికే ఉన్నా, సచ్చిపోయిండని సెప్పవల్సి వచ్చె! తండ్రి వున్న పిలగాండ్ల కంటె, తండ్రి లేని పిలగాండ్లతోనే ఎక్కువ సోపతి యిల్లకు. జెర పెద్దగైతె అల్లకు అన్ని అర్తమైతయి. గప్పుడు సాఫ్ సీద జోగమ్మ బతుకు యెట్లుంటది వూల్లె వాడల, మొగడు లేని ఆడోల్ల కంటే ఎంత కనా కష్టంగుంటదో యెర్కయితది. గీ వున్న వూల్లె కొంచెం సద్వినంక, మంచిగ హాస్టల్లేత్తె, అల్లే వూరు మొకాన రానియ్యకుంట జూత్త. శీతువ కండ్లకు దూరంగుంచుత పెద్దవ్వా!

గానాడు తెలంగాణ జెంగు నడిసేటప్పుడు తెలంగాణను తెచ్చుకుంటే జోగమ్మ అనే మాటే యినవడది, గీ జోగమ్మ రీతిని పాతరేద్దామనిరి. నిజమేనని నమ్మి మా జోగమ్మ సంగమ్‌తోని బొయి, రోడ్లమీద లొల్లి జేసినము. లారీలెక్కి వూల్లు దిరిగి, తెలంగాణత్తే జోగిని బత్కు వోతదట, జోగమ్మలే వుండరట అని లొల్లివెట్టి పోలీసులతోని దెబ్బల్దిన్నము, పాదయాత్రలు జేసినము. ఏమాయె మల్లా, యెప్పటి సిప్పలు యెనుగుల్నే వుండె. తెలంగాణొచ్చినా జోగమ్మలు పోలే. బోనాలు, జాతర్ల పేరుతో యింకెక్కువైండ్రు. మాట్లాడవోతే 'జోగమ్మలా ఆల్లెక్కడున్నరు, లేనే లేరంటరు సర్కారోల్లు. బోనాల పండుగల నిండా, జాతర్లనిండా –సిగాలూగేది, బోనమెత్తి ముందట ఆటపాటమ్మలెవరు? 'బవిస్య వాని' జెప్పేది ఎవలు? బల్కంపేట యెల్లమ్మ పండుక్కు గుడినిండ వుండేది –లష్కర్ బోనాలు, గోల్కొండ బోనాలు, చార్మినార్ బోనాలన్నీ మా నెత్తుల మీదికెల్లే నడిసేది అవద్దమా! బలిగంప ఎత్తుకొని, నోట్లె దొబ్బ వెట్టుకొని, వూరు సల్లంగుండాలని పొలిమేరలకు వురికిచ్చుడు, సిడిలెక్కిచ్చి తిప్పుడు అవద్దమా?

యిగ గప్పుడెప్పుడో తెలంగాణ రాక మునుపు మొగడు సచ్చి పొయినాడోల్లకు పించిండ్లంటే –మా జోగమ్మలందరం దర్కాసు వట్టుకుని పోతే, బర్త సచ్చిపోయిన కాయిదం దెమ్మనిరి. గా కాయిదం కోసం అడిగితె, పేరుకు పెండ్లయినా, మాకు మొగడే లేడాయే! మీరు దేవుని పెండ్లాలాయే! దేవుడు నచ్చిపోయిండని కాయిదమెట్లిద్దుము? యియ్యనీకి రాదని బైసు జేసిరి. లేని మొగుడు నచ్చిపోయిండనే కాయితం లేక పించినికి సెడితిమి. తెలంగానొచ్చినంక గీ కిరికిరీలు బోతయనుకుంటే, ఇంకెక్కువాయే! తెలంగానొచ్చినంక బర్తలేని ఒంటరాడోల్లకు పించినిత్తమన్నరు గానీ, మల్లా పాత కతే ముందట వడ్డది! బర్త యిడాకులిచ్చినట్టు, సచ్చిపోయినట్టు, పెండ్లిగానట్టు కాయిదాలు తెమ్మనిరి.


అవుగాని పెద్దవ్వా! మా జోగమ్మల మీద నిత్తెం జరిగే రేపుల మీన పోలీసోల్లు కేసు రాయరు, ఎవన్ని జేల్ల బెట్టరు. 'మీ జోగమ్మల ఆశారమే అదిగదా కేసేమని రాస్కుంటం? గయ్యన్ని మామూలు ఆడోల్లకు, మీగ్గాదు' అని సీ కొడ్తరు. పెండ్లిగాని ఆడోల్ల, యిడాకులైన, మొగడు సచ్చి పోయిన ఆడోల్ల లెక్కకిందికి రామంటరు. మాది అంతకన్న ఆగం బతుకు గాదె!

గీమన సర్కారోల్లకు యేలకు యేలమంది జోగమ్మలున్న సంగతీ –అల్ల పెండ్లీలు, అల్ల బత్కులు, అల్లకు తోడు నీడ లేకుంట చేసిన గీ బలిమీటి అవుమానపు ఒంటరి కట్టడులు తెల్వయానే? గీల్లు అందరాడోల్లసొంటి ఒంటరోల్లు గాదని, ఒంటరాడోల్ల కంటే అర్మంద బత్కుల ఒంటరోల్లనీ, గీ జోగమ్మలకు మొగడు సచ్చిపోయిన, ఇడుపు కాయిదాలు అక్కెరే లేదని ఆదరెందుకియ్యరే. గీ సాలీసాలని రెండు వేల పించిని కోసం మమ్ముల అరిగోస బుచ్చుకునుడెందుకే? మాకు సూరిటి లేకుంట లోనులిత్తే, యేదో వొక బతుకుదెరువు జేసుకొని యెవనయ్యకు లొంగ కుంట, యెవ్వలకాశ పడకుంట మా పోరగాల్లను సదివిచ్చుకుంటమే పెద్దవ్వా! గా దన్ను యిమ్మతి తోని మా తరంతోనే గీ జోగమ్మ కట్టడి పుట్టకుంట, పెరుగకుంటా పోయేదానికి మేము మా పోరగాండ్లందరు జోగమ్మల్లేని జెగం కోసం జెంగు జేత్తమే పెద్దవ్వా! ❖

ఉత్తరప్రదేశ్ బహిష్టు విధానాన్ని గాలికొదిలేశారు

ఫోకస్

జిజ్ఞాస మిత్ర అనువాదం: రమాసుందరి



ఉత్తరప్రదేశ్, చిత్రకూట్ జిల్లాలో నివసించే బలహీన వర్గాల కుటుంబాలకు చెందిన ఆడపిల్లలు, కోవిడ్-19 మొదలైన తరువాత ఉచిత సానిటరీ నాప్‌కిన్స్ ను పొందే అవకాశం కోల్పోయారు. కిశోరి సురక్ష యోజన పథకం విచ్ఛిన్నం అవటంతో -వాళ్లు బహిష్టులో పాటించాల్సిన వ్యక్తిగత పరిశుభ్రత ప్రమాదంలో పడింది.

"నేనీ పనులను బడికి పోయే ముందు చేయాలి. నేను కాక ఎవరు చేస్తారు?" తల్లి పాలు తాగటానికి దూడను వదులుతూ 15 ఏళ్ల కిరణ్ అడిగింది. అప్పుడు పొద్దున 5 అయింది. ఒకే గది ఉన్న ఆమె ఇంట్లో అనారోగ్యంగా ఉన్న ఆమె తల్లి, ఆమె తమ్ముడు రవి ఇంకా నిద్రపోతున్నారు. ఇల్లు శుభ్రం చేసుకునే ముందు ఆమె దూడను మళ్లీ కట్టేయాలి. అప్పుడు ఆమె తాత ఆవు పాలు పిండుతాడు.

కిరణ్ రోజులాగే పెందరాడే నిద్ర లేచింది. కానీ ఈ రోజు పని చేయటానికి కానీ, బడికి వెళ్లటానికి కానీ సిద్ధంగా లేదు. అలసట ఎక్కువగా ఉండే రోజుల్లో ఒకటైన బహిష్టు మొదటి రోజు అది. మరీ ముఖ్యంగా కోవిడ్ ప్రారంభం అయినప్పటి నుండి ఆమె కడుపు కండరాల తిమ్మిర్లు ఇంకా అధ్వానం అయ్యాయి. అయినా ఆమె తన పనులను తప్పనిసరిగా వుదయం 6:30కు ముగించేసేయాలి. "ఉదయపు ప్రార్థన 7కు మొదలవుతుంది., బడికి వెళ్లటానికి 20-25 నిమిషాలు నడవాలి", ఆమె చెప్పింది.

కిరణ్ దేవి 11వ తరగతి చదువుతున్న ప్రభుత్వ బడి ఉత్తరప్రదేశ్ చిత్రకూట్ జిల్లా కర్వి తాలూకాలో ఉన్న ఆమె ఇంటి నుండి రెండు కిలోమీటర్ల దూరంలో ఉంది. తన తమ్ముడు రవి, 40 సంవత్సరాల తల్లి పూనం దేవి, 67 సంవత్సరాల తాత ఖుశీరామ్‌తో కలిసి ఆమె అక్కడ జీవిస్తోంది. ఇంటినానుకొని ఉన్న 800 చదరపు అడుగుల పొలాన్ని వాళ్ల తాత చూసుకొంటాడు. ఆ స్థలంలో వాళ్లు గోధుమ, శనగ, ఒక్కోసారి ఆయా కాలాల్లో పండే కూరగాయలను పండిస్తారు. పూనంకు మణికట్టులో, మోకాళ్లలో విపరీతమైన నొప్పి ఉంది. ఆ నొప్పి ఆమె ఇంటిపని చేయటానికి పరిమితులు విధిస్తుంది. అందువలన కిరణ్ ఎక్కువ బాధ్యతలతో తలమునకలు అవుతోంది.

కిరణ్ రోజువారీ పని ఇప్పుడు నొప్పి కలిగించే కసరత్తుగా మారింది. "ఈ చిన్న చిన్న పనులు చేయటానికి నాకు అభ్యంతరం లేదు. కానీ బహిష్టు కండరాల తిమ్మిర్లు వచ్చినపుడు మాత్రం సమస్య అవుతుంది."



సూర్యుడు ఉదయించక చాలాసేపు ముందే లేచి 15 ఏళ్ల కిరణ్ దేవి పాకలో ఉన్న దూడల మీద దృష్టి పెడుతుంది.

ఉచిత సానిటరీ నాప్‌కిన్స్ పొందటానికి అర్హత ఉన్న ఉత్తరప్రదేశ్‌లోని ఒక కోటి ఆడపిల్లల్లో కిరణ్ ఒకటి. కోవిడ్ -19 కాలంలో కిశోరి సురక్ష యోజనా పథకం ఆగిపోయాక ఈ కోటిమంది ఆడపిల్లలు ఇబ్బంది పడ్డారు. కేంద్ర ప్రభుత్వ బహిష్టు సమయపు వ్యక్తిగత పరిశుభ్రత పథకం కింద దేశవ్యాప్తంగా -6 నుండి 12 తరగతులు చదువుతున్న అమ్మాయిలకు ఉచిత నాప్‌కిన్స్ ఇచ్చే ఉత్తరప్రదేశ్ పథకం కిశోరి సురక్ష యోజనా (KSY). 2015లో అప్పటి రాష్ట్ర ముఖ్యమంత్రి అఖిలేశ్ యాదవ్ ప్రారంభించిన రాష్ట్ర పథకంలో భాగంగా -ప్రతి ఆడపిల్లా నెలకు 10 సానిటరీ నాప్‌కిన్స్ ఉన్న పాకెట్టు అందుకోవాల్సి ఉంది.

ఈ పథకం కింద ఉత్తరప్రదేశ్‌లో ఎంతమంది ఆడపిల్లలు నిజంగా సానిటరీ నాప్‌కిన్స్ అందుకొంటున్నారని తెలుసుకోవటం దాదాపు అసాధ్యం. అసలు సంఖ్యలో పదోవంతు తీసుకున్నా, ఒక పది లక్షల మంది పేద కుటుంబాల అమ్మాయిలు కోవిడ్ వచ్చిన తరువాత సంవత్సరన్నరగా ఉచిత సానిటరీ నాప్‌కిన్స్‌ను పొందలేకపోయారు.

అంతేకాదు. విజయవంతంగా ఈ పథకాన్ని పునః ప్రారంభించామనే వాదనలు కూడా సందేహాత్మకమే. కొన్ని పట్టణ ప్రాంతాల్లో పునరుద్ధరించినా, కిరణ్‌కు ఇప్పటికీ ఉచిత సానిటరీ నాప్‌కిన్స్ దొరకటం లేదు. లాభార్జన ధ్యేయంగా ఉన్న సంస్థల నాప్‌కిన్స్‌ను కొనే స్థోమత లేదు. అలా కొనలేని వేలాదిమందిలో కిరణ్ ఒకటి మాత్రమే.

కిరణ్ ఇంటినీ, పశువుల పాకనూ, ప్రధాన రహదారికి దారి తీసే ఇంటి బయటి మొత్తం స్థలాన్నీ చిమ్మటం పూర్తి చేసింది. అల్మరా మీద పెట్టిన పాత గడియారాన్ని చూడటానికి ఆమె ఇంట్లోకి పరిగెత్తింది. "ఓహ్, 6:10 అయిపోయింది" వులిక్కిపడి అంది. "అమ్మా, నువ్వు నాకు జడలు వేయాలి, నేను ఇప్పుడే వస్తా," అరిచి ఇంటి బయట ప్లాస్టిక్ టాంకు ఉన్న దగ్గరకు వెళ్లింది. అక్కడ, దాదాపు రోడ్డువారగా, బహిరంగ స్థలంలో స్నానం చేయటానికి ఆమె వెళ్లింది.

బాత్‌రూం గురించి అడిగితే ఆమె ముసిముసి నవ్వులు నవ్వింది. "ఏ బాత్ రూమ్? మాకు మరుగుదొడ్డిలో కావల్సినన్ని నీళ్లే లేవు. మాకు బాత్రూమ్ ఎక్కడ నుండి వస్తుంది? మరుగుదొడ్డినే నేను తడిచిన బట్టలు మార్చుకోవటానికి వాడుకుంటాను," చెప్పిందామె. కోవిడ్-19 వలన వచ్చిన మొదటి లాక్ డౌన్ నుండి ఆమెకు స్కూల్ నుండి వచ్చే నాప్‌కిన్స్ అందటం ఆగిపోయాక, కాటన్ బట్టను వాడుతున్నానని చెప్పటానికి ఆమె సందేహించింది. కోవిడ్ కాలం అయిపోయిన రెండు సంవత్సరాల తరువాత, ఉత్తరప్రదేశ్‌లోని చాలా ప్రభుత్వ పాఠశాలలు నాప్‌కిన్ పంపిణీ పథకాన్ని పునః ప్రారంభించలేక పోయాయి.

ఏది ఏమయినప్పటికీ ఇంటినీ, పశువుల పాకనూ ప్రతి ఉదయం 6:30 కంతా శుభ్రం కిరణ్ శుభ్రం చేయాలి. వుదయం 7 కంతా బడికి వెళ్లాలి.

"క్లాసు జరుగుతున్నపుడు రక్తస్రావం మొదలవగానే, మా క్లాసుమేట్లలో ఒకరు ఇటీవల ఒక నాప్‌కిన్ కోసం టీచర్‌ను అడిగితే, ఇంకా సరుకు రాలేదని చెప్పారు. అప్పుడు ఆమెకు మా ఇంకో స్నేహితురాలు తన రుమాలు వాడుకోమని ఇచ్చింది" చెప్పింది కిరణ్. "ఇంతకుముందు మాకు నాప్‌కిన్స్ కావాల్సి వచ్చినపుడు టీచర్లను అడిగేవాళ్లం. తరువాత లాక్‌డౌన్ వచ్చింది. బడులు మూత పడ్డాయి. ఇదంతా అయ్యి, బడులు మళ్లీ తెరిచాక, నాప్‌కిన్స్ లేవు. పాఠశాలలో ఇక సరఫరా లేదని చెప్పారు," కొనసాగింపుగా చెప్పింది.

కిరణ్ బహిష్టు సమయం బాధాకరంగా మారటం మొదలైయ్యింది. కోవిడ్ మొదలైన తరువాత రెండు సంవత్సరాలలో, బహిష్టు మొదటి రోజు ఆమెకు తీవ్రమైన కండరాల తిమ్మిరులు వస్తున్నాయి. ఆమె కుటుంబంలో ఎవరికీ కోవిడ్ పాజిటివ్ రానప్పటికీ, చిత్రకూట్ జిల్లా అంతా తీవ్రంగా ప్రభావితం అయ్యింది. ఆమె ఇరుగుపొరుగు వాళ్లు చాలామందికి అది సోకింది. 3 కిలోమీటర్ల దూరంలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రిలో కొద్దిమందిని చేర్చారు కూడా.

కోవిడ్-19 ప్రత్యక్ష ప్రభావం తీవ్రమైన, నొప్పితో కూడుకున్న బహిష్టు రక్తస్రావాన్ని కూడా కలగచేయగా... "వత్తిడి, ఆందోళన, పోషకాహార లేమి, నిద్రలో మార్పులు, భౌతిక కసరత్తులు లాంటివి ప్రత్యుత్పత్తి ఆరోగ్యాన్ని, బహిష్టు కాలచక్రాన్ని పరోక్షంగా ప్రభావితం

చేస్తాయ"ని UNICEF కీలక పత్రం ప్రకటించింది. అక్టోబర్ 2020లో విడుదలైన ఈ పత్రానికి "మానసిక ఆరోగ్యం మీదా, వ్యక్తిగత పరిశుభ్రత మీదా కోవిడ్-19 ప్రభావాలను తగ్గించటం" అని పేరు పెట్టారు. ఈ పత్రం "కోవిడ్ మొదలవక ముందు కంటే తరువాత బహిస్టు వైపరీత్యాలు చాలా సాధారణం అయ్యాయి" అని సూచించింది.

కిరణ్ ఇంటి నుండి నాలుగు కిలోమీటర్ల దూరంలో నివసించే ఫూల్ వాటియాకు పాఠశాల నుండి నాప్‌కిన్స్ దొరకటం లేదు. "కోవిడ్ మొదలయ్యాక బడి మూసివేశాక, నేను మళ్లీ బట్టను వాడటం, ముక్కలను ఉతుక్కోవటం, ఇంటి లోపల వాటిని ఎండబెట్టుకోవటం మొదలుపెట్టాను" అని 2020లో PARI తో చెప్పింది. గ్రామీణ చిత్రకూట్‌కు చెందిన ఆమె, ఇంకా వేలాది అమ్మాయిలకు డొనేషన్ల రూపంలో అప్పుడు సహాయం అందింది. అది 3-4 నెలలు మాత్రమే వుండింది. కిరణ్ మళ్లీ గుడ్డను ఉపయోగించటం మొదలు పెట్టి రెండు సంవత్సరాలు అయ్యింది. "పాఠశాలలో ఇంకా నాప్‌కిన్స్ ఇవ్వటం లేదు కాబట్టి నేను గుడ్డను మాత్రమే వాడుతున్నాను. ఆ సదుపాయం మాకు పరిసమాప్తం అయిపోయింది," చెప్పిందామె.


అయితే లక్నో జిల్లాకు చెందిన కకోరి బ్లాక్‌లో సరోసా భరోసాలోని కాంపొజిట్ స్కూల్ టీచర్ శ్వేతా శుక్ల రాష్ట్ర రాజధానిలో పరిస్థితి మెరుగ్గా ఉందని వాదించింది. "మా బడిలో పిల్లలకు క్రమం తప్పకుండా ప్రతి నెలా పాడ్స్ అందుతున్నాయి. మేము ఒక రిజిస్టర్‌ను తప్పక నిర్వహిస్తూ, మాకు సరఫరా చేసిన పాడ్స్‌ను ఉపయోగించుకోవాలి," ఆమె చెప్పింది. వుత్తరప్రదేశ్ గ్రామీణ ప్రాంతంలో పరిస్థితిని విని ఆమేమి ఆశ్చర్యపోలేదు. "ప్రభుత్వ బడుల్లో ఇలాంటి పరిస్థితులు సాధారణమే తెలుసా. దానికి మనమేమీ చేయలేము. మరీ ముఖ్యంగా మనం ప్రైవేట్ బడులకు పోలేనపుడు, మన పిల్లలకు ఇంత కన్నా మంచి వాతావరణం కల్పించలేకపోయినపుడు," అంటూ ఆమె కొనసాగించింది.

పూనం దేవి, ఆమె భర్తా తమ పిల్లలు కిరణ్, రవిలను ప్రైవేట్ బడులకు పంపాలని ఎప్పుడూ కలలు కనేవాళ్లు. "మా పిల్లలు చదువులో మంచిగుంటారు. కేంద్రీయ విద్యాలయ లాంటి బడికి మా పిల్లలను నేను పంపగలగటానికి ఏదైనా మార్గం లేదా?" అని అడుగుతుందామె. "మాకు ఎక్కువ డబ్బు లేకపోయినా, మా పిల్లలు ఎప్పుడూ మంచి బడికి వెళ్లాలని వాళ్ల నాన్న కోరుకున్నాడు. అలా చదువుకుంటే వాళ్లు నగరాలకు వెళ్లగలుగుతారు. పని చేయగలుగుతారు. సౌకర్యవంతంగా జీవించగలుగుతారు," కొనసాగింపుగా అన్నదామె. కానీ దాదాపు 10 సంవత్సరాల క్రితం, కిరణ్‌కు కేవలం 5 సంవత్సరాల వయసున్నప్పుడు, ఎలక్ట్రీషియన్ అయిన ఆమె తండ్రి పని దగ్గరే చనిపోయాడు. పూనం జబ్బున పడటంతో పరిస్థితులు మారటం మొదలయ్యాయి. ఇంటి పొలం నుండి వచ్చే ఆదాయం ఎప్పుడూ సరిపోదు. అలాంటి సమయంలో, బహిష్టు సమయంలో ఆమె వ్యక్తిగత పరిశుభ్రత అవసరాన్ని బడిలో పట్టించుకోవటమే ఒక అదృష్టం.

అయితే కిరణ్ లాంటి వేలాదిమంది అమ్మాయిలు బహిష్టు సమయంలో వ్యక్తిగత పరిశుభ్రత లేని ఆచరణలకు వెనక్కి మరలుతున్నారు. 'భారతదేశంలో పాఠశాల విద్య' సమాచారం ప్రకారం ఉత్తరప్రదేశ్‌లో 6వ తరగతి నుండి 12వ తరగతి వరకూ 10. 86 మిలియన్ల అమ్మాయిలు చదువుతున్నారు. ఇది విద్యా ప్రణాళికా మరియు పరిపాలన జాతీయ సంస్థ 2016-17 మధ్య ఇచ్చిన నివేదిక సమాచారం. ప్రతి నెలా బహిష్టు సమయంలో క్లాసులు కోల్పోతున్న విద్యార్థినులకు సహాయం చేయటానికి సానిటరీ నాప్‌కిన్స్ పంపిణీ పథకాన్ని ప్రవేశపెట్టారు. 2015లో ఈ సంఖ్య రాష్ట్రంలో 28 లక్షలు. ఇప్పుడు ఈ పథకం మటుమాయం అయ్యాక, ఉత్తరప్రదేశ్‌లో మహిళా ఆరోగ్యం, వ్యక్తిగత పరిశుభ్రత స్థితిగతుల గురించి తలుచుకుంటే సందేహం కలుగుతుంది.

చిత్రకూట్ జిల్లా మేజిస్ట్రేట్ శుభ్రంత్ కుమార్ శుక్లాగారికి ఈ పరిస్థితి పట్ల ఒక మామూలు అభిప్రాయం ఉంది. "కోవిడ్ తరువాత కొన్ని సరఫరా సమస్యలు వచ్చాయనుకొంటాను," అన్నాడతను, "లేకపోతే అమ్మాయిలకు నాప్‌కిన్స్ అందేవే. అయితే సత్వర పరిష్కారం కోసం, అవసరం అయిన ప్రతి అమ్మాయి సానిటరీ నాప్‌కిన్స్ తీసుకోవటానికి దగ్గరలో ఉన్న అంగన్ వాడి కేంద్రానికి వెళ్లి తీసుకోవచ్చు. అక్కడ వాళ్లకు ఫోలిక్ యాసిడ్ మాత్రలు కూడా లభ్యమౌతాయి." కిరణ్‌కూ, ఆమె ఇరుగు పొరుగు స్నేహితులకు దీని గురించి ఏమీ తెలియదు. చిత్రకూట్‌లో





అంగన్‌వాడీల దగ్గర సానిటరీ నాప్‌కిన్స్ ఉన్నా, సీతాపూర్‌లోని అంగన్ వాడీ కార్యకర్త చెప్పినదాని ప్రకారం అవి కొత్తగా తల్లులు అయిన వారికి మాత్రమే ఉద్దేశించబడినవి.

2020లో ఎర్రకోట నుండి చేసిన తన స్వాతంత్ర్య దిన ఉపన్యాసంలో మహిళా ఆరోగ్య సంరక్షణ గురించి మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోడి -ప్రభుత్వం "జనౌషధి కేంద్రాల దగ్గర ఒక్క రూపాయికే సానిటరీ నాప్‌కిన్స్ అందచేసే భారీ ధర్మాన్ని నిర్వహించింద"ని చెప్పారు. కొద్ది కాలంలో "6000 జనౌషధి కేంద్రాల దగ్గర ఈ పేద మహిళలకు 5కోట్ల కంటే ఎక్కువ సానిటరీ నాప్‌కిన్స్ సరఫరా జరిగిందని" ఆయన అన్నారు.

ప్రధాన్ మంత్రి భర్తీయ జనౌషాధి పరియోజన కింద ఈ జనౌషధి కేంద్రాలు అందుబాటు ధరలలో జనరిక్ మందులను అందచేస్తాయి. రసాయనాలు మరియు ఎరువుల కేంద్ర మంత్రిత్వ శాఖ చెప్పినదాని ప్రకారం ఆగస్టు 2021 నుండి దేశవ్యాప్తంగా 8,012 జనౌషధి కేంద్రాలు పని చేస్తున్నాయి. అవి 1,616 రకాల మందులనూ, 250 శస్త్ర చికిత్స పరికరాలను అమ్ముతాయి.

కానీ కిరణ్ ఇంటికి 5 కిలోమీటర్ల దరిదాపులో ఎక్కడా జనౌషధి కేంద్రం లేదు. ఆమె సానిటరీ నాప్‌కిన్స్ కొనుక్కోగలిగిన ఒకే ఒక స్థలమైన ఒక మెడికల్ షాపు ఆమె ఇంటికి 2 కిలోమీటర్ల దూరంలో ఉంది. అక్కడ ఆమె కనీసం 45 రూపాయలు ఇచ్చి ఒక పాకెట్టు కొనుకోవాలి. ఆ ధర ఆమెకు అందుబాటులో ఉండదు.

సానిటరీ నాపికిన్స్ అందుకునే శక్తి లేకపోవటమే కాకుండా, బహిష్టు అయిన యువతులకు బడులలో లభించే సౌకర్యాలు ఘోరంగా ఉంటాయి. "నేను బడిలో ఉన్నపుడేమో, అక్కడ ఎలాంటి చెత్తబుట్టలు లేకపోవటం వలన నేను నాప్‌కిన్ మార్చుకోవాలంటే ఇంటికి వచ్చేదాకా వేచి ఉండాలి. ఒక్కోసారి ఒక నాప్‌కిన్ తడిచిపోయి బడిలో ఉన్నపుడు నా యూనిఫార్మ్ మీద మరకలు పడతాయి. స్కూలు అయిపోయేదాకా నేను ఏమీ చేయలేను కూడా," చెప్పిందామె. మరుగుదొడ్లు కూడా శుభ్రంగా ఉండవు. "ఆదివారాల్లోనే వాటిని శుభ్రం చేస్తారు. కాబట్టి మాకు సోమవారాల్లోనే శుభ్రమైన మరుగుదొడ్లు లభిస్తాయి. రోజులు గడిచేకొద్దీ అవి మురికి అయిపోతాయి," ఆమె చెప్పింది.

లక్నో నగరంలోని బస్తీల్లో నివాసముండే యువతుల బహిష్టు సంబంధిత సవాళ్ల గురించి వచ్చిన ఒక పత్రికా వ్యాసం -ఈ సవాళ్లు అనేక స్థాయిల్లో ఉంటాయని వివరించింది. వ్యక్తిగతంగా, సామాజికంగా, వ్యవస్థాపరంగా ఉంటాయని అన్నది. "వ్యక్తిగత స్థాయిలో తీసుకొంటే అమ్మాయిలకు అవగాహన ఉండదు. సామాజిక పరిధిలో తీసుకొంటే యువతులు బహిష్టును ఆవరించి ఉన్న అపోహలతో ఉంటారు. దానికి గురించి చర్చించే అవకాశాలు ఉండవు. బహిష్టు సమయంలో వాళ్ల కదలికలకు, ఇతర పనులకు పరిమితులు ఉంటాయి. వ్యవస్థాపరంగా తీసుకొంటే, వుదాహరణకు బడిలో -మరుగుదొడ్లు అశుభ్రంగా ఉండటం, తలుపులు విరిగిపోయి ఉండటంతో -అమ్మాయిల బహిష్టును ఆదుకునే వనరులు చాలా తక్కువ ఉంటాయి," అని ఆ వ్యాసం చెబుతున్నది.

ఉత్తర ప్రదేశ్ బడుల్లో అసలు సమస్య పారిశుధ్య సిబ్బందే, తక్కువశ్రేణి నిర్వహణ కాదని లక్షింపూర్ జిల్లా రాజాపూర్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రీతూ అవస్థి అంటారు. "ఇక్కడ అమ్మాయిలకు సానిటరీ నాప్‌కిన్స్ ఇస్తారు. మరుగుదొడ్లలో నాప్‌కిన్స్‌ను కాల్చే యంత్రాలు ఉన్నాయి. కానీ పారిశుధ్య సిబ్బంది వలన పరిస్థితులు బాగా లేవు. పాఠశాల పనుల కొరకు నియమించిన ఊడ్చే సిబ్బంది గ్రామ పెద్ద కింద ఉంటారు. కాబట్టి వాళ్లు అతని మాటే వింటారు. బడుల్లో రోజూ శుభ్రం చేయాలి. కానీ వారానికి రెండుసార్లు మాత్రమే అది జరుగుతుంది," అన్నారామె.

కిరణ్ ఇంటిలోకి కొన్ని సూర్యకిరణాలు ప్రవేశించి, అవి ఇంట్లో పెట్టిన మూడు చెక్క మంచాల గుండా ప్రసరించేటప్పటికి -పనులు ముగించుకొని ఆమె తయారయ్యింది. పూనం తన కూతురు జుత్తును దువ్వి రెండు ముద్దొచ్చే జడలు వేసింది. వాటిని మంచి రంగు రిబ్బన్లతో అలంకరించింది. "కిరణ్, జల్దీ ఆ జా. మై యహీ రుకీ హూ. కిరణ్, త్వరగా రా. నేను ఇక్కడ ఎదురు చూస్తున్నాను," రీనా సింగ్ బయట నుండి అరుస్తోంది. ఆమె కిరణ్ సహ విద్యార్థినీ, బడికి తోడుగా వెళ్లే ప్రయాణికురాలు కూడా. కిరణ్ బయటకు పరిగెత్తింది. ఇద్దరమ్మాయిలు స్కూలు వైపు త్వరత్వరగా నడుస్తున్నారు.

(ఈ వ్యాసం ఫిబ్రవరి 27న People's Archive of Rural India (PARI) లో మొదటి ప్రచురితం అయ్యింది) ❖

ప్రత్యేక వ్యాసం


మానవ సంక్షేమం కోసం

నందితా హక్సర్   అనువాదం: సహజ

ప్రపంచంలో ప్రతి 88 మందిలో ఒకరు శరణార్థిగా ఉన్నారు. ప్రపంచవ్యాప్తంగా కనీసం 8 కోట్ల 93 లక్షల మంది బలవంతంగా తమ ఇళ్లనుండి పారిపోవాల్సి వస్తుంది. వారిలో 2 కోట్ల 71 లక్షల మంది నిర్వాసితులు. ఆ సంఖ్యలో సగం మంది 18 సంవత్సరాల లోపు వాళ్లు. దాదాపు 50 లక్షల మంది శరణార్థులుగా ఉండటాన్ని కోరుకుంటున్నారు. అధికారికంగా నిర్వాసితులుగా తమను గుర్తించాలని వీళ్లు అనుకుంటున్నారు.

శరణార్థి అంటే ఎవరు?

తమ జాతి వలన, మతం వలన, దేశీయత వలన, ఏదైనా రాజకీయ సమూహంలో సభ్యత్వం ఉండటం వలనా లేక ఏదైనా రాజకీయ అభిప్రాయం కలిగి ఉండటం లాంటి కారణాల వలన వేధింపులకు గురి అవుతామనే గట్టి భయంతో –తమ మూలాలున్న దేశానికి వెళ్లటానికి ఇష్టపడని లేక వెళ్లలేని వారిని శరణార్థిగా 1951 శరణార్థి సదస్సు నిర్వచించింది. వున్నట్లుండి ఒక రోజు తన దేశం హింసతో, భయంకరమైన ఘర్షణలతో, ఒక్కోసారి యుద్ధాలతో కూడా మునిగి తేలేదాకా –ఒక ఇల్లూ, ఒక కుటుంబం, చాలా సందర్భాల్లో ఒక మంచి ఉద్యోగం, ముందు భవిష్యత్తు ఉన్నవాడిని శరణార్థి అని అంటారు. ఒక జాతి సమూహానికి చెంది ఉండటం వలనో; లేక జైల్లో వేసేటంతటి, బహుశా హింసకు గురి చేసి బంధించేటంతటి ప్రమాదకరమైన రాజకీయ అభిప్రాయంతో నిలబడి ఉండటం వలన –ఆ వ్యక్తి దాడికి లక్ష్యం అవచ్చు. పారిపోవటం తప్ప అతనికి వేరే గత్యంతరం ఉండదు. చాలాసార్లు కట్టు బట్టలతో, ఎలాంటి చట్టపరమైన కాగితాలు లేకుండా పారిపోవాల్సి వస్తుంది. ఏదైనా గుర్తింపు కార్డు కలిగి ఉండటం చాలాసార్లు ప్రమాదకరంగా ఉంటుంది కాబట్టి –అతను ఎలాంటి ప్రయాణపు కాగితాలనూ, గుర్తింపు కార్డును కూడా తన వెంట తీసుకొని పోలేదు.



శరణార్థి –అతడు లేక ఆమె –దగ్గర పాస్‌పోర్ట్ కానీ, వీసా కానీ ఉండవు కాబట్టి అంతర్జాతీయ సరిహద్దులను ఎలాంటి ప్రయాణపు పత్రాలు లేకుండా దాటుతాడు. అందుకే అతని ప్రవేశం చట్టవిరుద్ధమైనది. శరణార్థి చట్టాలు లేకుండా వున్నట్లైతే, వారిని చట్ట వ్యతిరేక వలసవాసులుగా గుర్తిస్తారు. ఒక్కోసారి సరిహద్దులు దాటటానికి వాళ్లు మానవ అక్రమ రవాణాదారుల మీద ఆధారపడతారు. ఒక్కోసారి సముద్రాల గుండా ప్రమాదకరమైన పడవ ప్రయాణాలు చేస్తారు. పర్వతాలలో, ఎడారులలో నడిచి వెళ్లినా కూడా వాళ్లను వెనక్కి తిప్పి పంపడమూ, లేక నిర్బంధించటమూ చేస్తారు.

శరణార్థుల కోసం1951లో ఐక్య రాజ్యసమితి నిర్వహించిన సదస్సు ఒడంబడికే ఇప్పటికీ ప్రపంచవ్యాప్తంగా శరణార్థుల రక్షణ చట్టాలకు భూమికగా వుంది. ఈ ఒడంబడికలో సంతకం చేయని భారతదేశానికి కూడా ఇదే గత్యంతరం. ఎన్ని అవకతవకలు ఉన్నా, శరణార్థులకున్న ఏకైక చట్ట రక్షణ అది. ప్రపంచమంతా ఎప్పుడూ లేని శరణార్థ సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నపుడు –ఆ ఒడంబడిక కార్యాచరణ కూడా ధ్వంసం అయిపోయింది.

శరణార్థ సంక్షోభం

2015లో 13 లక్షలుగా లెక్క తేలిన ప్రజలు –పురుషులు, స్త్రీలు, పిల్లలు ఐరోపా సరిహద్దులకు శరణార్థులై వచ్చినపుడు, శరణార్థ సంక్షోభం ప్రసార మాధ్యమాల దృష్టిని ఆకర్షించింది. రెండో ప్రపంచ యుద్ధం తరువాత అత్యంత సంఖ్యలో శరణార్థులు రావటం అప్పుడే జరిగింది. 2015లో ఐరోపాలో ఆశ్రయం కోరిన వాళ్లు ఎక్కువగా సిరియన్లే కానీ చెప్పుకోదగ్గ సంఖ్యలో ఆఫ్ఘన్లు, నైజీరియన్స్, పాకిస్తానీయులు, ఇరాకీలు, ఎరిట్రియన్స్ కూడా ఉన్నారు. ఐరోపాలో శరణార్థుల ప్రవేశాన్ని నిరుత్సాహ పరచటానికి చట్టాల్లో చేసిన మార్పుల వలన శరణార్థుల రక్షణా చట్టాలు, వాటి కార్యాచరణ యంత్రాంగాలు నాశనం అయ్యాయి. 2016లో శరణార్థులుగా గుర్తింపు పొందినవారికి శాశ్వత నివాస పత్రాలకు బదులు 3 సంవత్సరాల నివాస అనుమతి పత్రాలను ఇవ్వటం మొదలు పెట్టింది స్వీడన్. అదే సంవత్సరం శరణార్థుల

నగలు, నగదు లాంటి విలువ గలిగిన వస్తువులను అధికారికంగా జప్తు చేయటానికి పోలీసులకు అనుమతినిచ్చే చట్టాన్ని డెన్మార్క్ జారీ చేసింది.

2015లో శరణార్థుల సంక్షోభం ప్రారంభం అవటానికి చాలాకాలం ముందే, అంతర్జాతీయ మానవతావాద, శరణార్థ చట్టపు అన్ని నిబంధనలను స్పష్టంగా అతిక్రమించే నిర్మాణాలను, చట్టాలను అనేక దేశాలు ముందుకు తెచ్చాయి. వుదాహరణకు 2001లో ఆస్ట్రేలియా ప్రవేశపెట్టిన 'శరణార్థులకు వేరే దేశాల్లో ఆశ్రయ కల్పించే కార్యక్రమం' -పడవల ద్వారా ఆస్ట్రేలియా జలాల్లోకి ప్రవేశించే వలసదారులను లక్ష్యంగా చేసుకొన్నది. ఆశ్రయం కోరేవారిని పాపువా న్యూ గినివాకి చెందిన మనుస్ దీవి, ఇంకా దక్షిణ పసిఫిక్ దీవి దేశమైన నౌరు నిర్బంధ శిబిరాలకు తరలించారు. ఈ తరలింపు శరణార్థుల వాదనలను పరిశీలించటానికని చెప్పారు కానీ, చాలా సంవత్సరాలు ఆ పని జరగలేదు. 'పసిఫిక్ పరిష్కారం' అని పిలిచే విధివిధానాన్ని 2008లో నాశనం చేశారు. 2012లో దాన్ని పునరుద్ధరించి, 2013లో ఇంకా పరిమితులు విధించారు. పడవల ద్వారా వచ్చే ప్రజలు, వాళ్లు శరణార్థులుగా గుర్తించబడినా కూడా -వారి పునరావాసాన్ని తిరస్కరిస్తామని అప్పుడే ప్రభుత్వం ప్రకటించింది.

ఇతర దేశాల్లో నిర్బంధానికి గురి అయిన వారి పట్ల అవలంభించిన క్రూర, అమానవీయ పద్ధతుల గురించి ఇరానియన్, కుర్దిష్ జర్నలిస్టు బెహ్రౌజ్ బూచని బయటపెట్టాడు. అతను కూడా మనుస్ దీవిలో నిర్బంధంలో ఉన్నాడు. తన స్మార్ట్ ఫోన్ వాట్స్ అప్ మెసేజుల ద్వారా నిర్బంధ శిబిరాల్లో పరిస్థితుల గురించి నివేదికలను బయటికి పంపాడు. విషయాలు బయటికి వచ్చినా కూడా ఆస్ట్రేలియా అతనికి శరణార్థ హోదాను ఇవ్వలేదు. ఆరు సంవత్సరాల సుదీర్ఘ నిర్బంధం తరువాత న్యూజిలాండ్ అతనికి ఆశ్రయం ఇచ్చింది.

నిర్బంధ శిబిరాలు

ఆశ్రయం కోరేవారిని నిర్బంధ శిబిరాల్లో ఉంచే ఇలాంటి విధానాలను యూరప్, ఇజ్రాయిల్ కూడా అవలంబించాయి. మెడిటేర్రేనియన్ సముద్రం గుండా వస్తున్న శరణార్థులను నిరోధించే భారీ ప్రయత్నాలలో భాగంగా చూస్తూ -ఈ 'ఇతర దేశాల్లో ఆశ్రయం కల్పించే కార్యక్రమానికి' యూరోపియన్ యూనియన్ పరోక్షంగా మద్దతునిచ్చింది. డెన్మార్క్ ప్రభుత్వం రువాండాతో ఒప్పందం చేసుకొన్నది. ఆశ్రయం కోరేవారిని పేద ఆఫ్రికన్ దేశాలకు పంపటం ద్వారా మెడిటేర్రనేయన్ సముద్రం గుండా జరుగుతున్న వలసలను నిర్దేశిస్తున్న మానవ అక్రమ రవాణాదారులను నిరుత్సాహ పరుస్తుందనే వాదనతో ఈ చర్యను సమర్థించుకొన్నారు. ఐరోపాకు వెలుపల శరణార్థులను ఉంచటం ఇయూ విధానాల ప్రకారం సాధ్యపడదని యూరప్ యూనియన్ కమిషన్ చెప్పింది. కానీ డెన్మార్క్‌కు కొన్ని ఇయూ విధివిధానాల నుండి మినహాయింపు ఉంది. వాటిలో శరణార్థ ప్రమాణాలు కూడా ఉన్నాయి.

శరణార్థులను గ్రీస్ దేశానికి రానీయకుండా ఉండటానికి టర్కీకి లక్షల డాలర్లను కూటమి చెల్లించింది. లిబియా కోస్ట్ గార్డ్ సంస్థకు నిధులను సమకూర్చటం వలన అది యూరప్‌కు వచ్చే వలసదారుల పడవలను ఉత్తర ఆఫ్రికా వైపు నెట్టివేసింది. శరణార్థులను పరిశీలించటానికి నైగర్‌లో, రవాండాలో ఏర్పాటై వున్న ఐక్యరాజ్య సమితి కేంద్రాలకు నిధుల ఏర్పాటుకు సహాయం చేస్తుంది కూడా. 'అత్యవసర ప్రయాణ కార్య నిర్వాహణ' అనే ఐక్య రాజ్య సమితి కార్యక్రమం కింద -లిబియా నిర్బంధ శిబిరాల నుండి యూరప్ వైపు వెళుతున్న 3000మందికి పైన ప్రజలను నైగర్ దేశానికి బదిలీ చేశారు.

శరణార్థ అధ్యయనంలో నిపుణులైన విద్యావేత్తలు ఈ విధి విధానాలకు మద్దతునిచ్చి, నిలబెడతారు. శరణార్థ అధ్యయనం బోధనా విభాగాల్లో ఒకటిగా మారింది. అంతర్జాతీయ శరణార్థ చట్టం గురించి అందులో బోధిస్తారు. ప్రపంచవ్యాప్తంగా శరణార్థ చట్టం గురించి బోధించే ఒక పాఠ్య పుస్తకం గుయ్ ఎస్. గుడ్విన్-గిల్ రాసిన 'అంతర్జాతీయ చట్టంలో శరణార్థి.' ఈ ప్రొఫెసర్ 'జర్నల్ ఆఫ్ రిఫ్యూజీ స్టడీస్' కు సంపాదకుడు. శరణార్థ ఒడంబడిక ప్రాముఖ్యతను ప్రపంచవ్యాప్తంగా ముందుకు తీసుకొని రావటానికి తన వృత్తి జీవితాన్ని వెచ్చించిన ప్రొఫెసర్ గుడ్విన్-గిల్ 'శరణార్థ సదస్సు తీర్మానం: దాన్ని ఎందుకు పక్కన పడేయకూడదూ?" అనే విషయం మీద ఇటీవల చర్చను మొదలు పెట్టాడు.

భారతదేశపు వైఖరి

శరణార్థ ఒడంబడికను చెత్తబుట్టలో పడవేసి, శరణార్థుల కోసం ఏర్పాటు అయిన ఐక్యరాజ్య సమితి హై కమిషన్‌ను రద్దు చేస్తే మాత్రం భారతదేశం ఎందుకు పట్టించుకుంటుంది? ప్రారంభం నుండే భారతీయ విద్యావేత్తలు, రాజకీయ నాయకులు ఈ శరణార్థ తీర్మానాన్ని విమర్శిస్తూనే ఉన్నారు. ఈ తీర్మానం యూరో కేంద్రంగా ఉన్నదనేది ఈ విమర్శలో ప్రధానమైనది. 'ఐక్యరాజ్య సమితి శరణార్థ హై కమిషన్' తన వెబ్‌సైట్‌లో '1950లో రెండవ ప్రపంచ యుద్ధం తరువాత ఇళ్ల నుండి పారిపోయిన లక్షలాది ఐరోపావాసులకు సహాయ పడటానికి ఐక్యరాజ్య సమితి శరణార్థ హై కమిషన్ కార్యాలయం తయారయ్యింది. మన పనిని పూర్తి చేసుకోవటానికి మూడు సంవత్సరాల సమయం ఉంది. తరువాత దీన్ని వదిలేయవచ్చు' అని ఒప్పుకొన్నది. 1954లో తన క్షేత్ర స్థాయి పనికి ఈ సంస్థ నోబెల్ ప్రైజ్‌ను గెలుచుకొన్నది.

భారతదేశ విభజన, పాలస్తీనా విభజన తరువాత వచ్చిన శరణార్థ సంక్షోభంలో ఈ ఐక్యరాజ్య సమితి శరణార్థ హై కమిషన్ (UNHCR) ఎలాంటి పాత్ర పోషించలేదు. పాలస్తీనా శరణార్థులను పట్టించుకోవటానికి ఐక్యరాజ్య సమితి 1950లో ఇంకో సంస్థను ఏర్పాటు చేసింది. దాని పేరు 'ఐక్యరాజ్య సమితి పాలస్తీనా శరణార్థుల ఉపశమన మరియు కార్యనిర్వహణ సంస్థ' (UNRWA). ఈ సంస్థ పాత్ర చుట్టూ ఉన్న వివాదం గురించి చర్చించటం ఈ వ్యాసం పరిధిలో లేదు. శరణార్థి పదానికి నిర్వచనం వ్యక్తిగతపరంగా

తయారైనది. అందుకే UNHCR కు కానీ, పశ్చిమ దేశాల్లోని దేశీయ సంస్థలకు కానీ –ఆశ్రయం కోరిన ఒక వ్యక్తి శరణార్థా, కాదా అని నిర్ణయించటానికి ఒక భారీ ప్రక్రియ ఉంటుంది. అతను లేక ఆమె వేధింపులను ఎదుర్కున్నారా, తన సొంత దేశానికి వెళ్లటం వారిని ప్రమాదంలో పడేస్తుందా అనే విషయాలను బట్టి నిర్ణయం జరుగుతుంది. కొన్నిసార్లు ఈ ప్రక్రియ అంతటికీ కొన్ని వారాలు పడుతుంది. కొన్నిసార్లు సంవత్సరాలు కూడా పడుతుంది. ఉగ్రవాదం మీద ఇటీవల భద్రతా సమితి చేసిన నిర్ణయాలు శరణార్థుల గురించి ప్రస్తావించాయి. శరణార్థులకు ఆశ్రయం ఇచ్చే ప్రక్రియలో ఉగ్రవాదులకు చోటు కల్పించకుండా దేశాలు జాగ్రత్త పడాలని భద్రతా సమితి మాట్లాడుతోంది. కానీ ఉగ్రవాదం అంటే ఏమిటో చెప్పే అంతర్జాతీయ నిర్వచనం ఏదీ ఇప్పటికీ లేదు.

ద్వంద్వ ప్రమాణాలు

శరణార్థ లాయర్లు ఇంకోలా వాదిస్తారు. ఒక దేశానికి సంబంధించి సరైన సమాచారం ఉన్నపుడు –ఈ ప్రక్రియ అంతా ఒక్కో వ్యక్తికి జరపనవసరం లేదని వారి వాదన. ఇరాక్, సిరియా, ఆఫ్ఘనిస్థాన్ నుండి వచ్చే ప్రతి ఒక్కరికి శరణార్థ హెూదా ఇవ్వాలని వారు అంటారు. గతంలో ఐరోపాలోని శరణార్థులకూ, ఇటీవల ఉక్రెయిన్ లోని శరణార్థులకు ఇలాగే ఇచ్చారు. ఉక్రెయిన్ నుండి వస్తున్న ప్రతి ఒక్కరికీ యాంత్రికంగా శరణార్థ హెూదాను ఇవ్వటం, కొన్ని కేసుల్లో వ్యక్తిగత శరణార్థ హెూదా నిర్ణయ ప్రక్రియ జోలికి పోకుండానే పౌరసత్వాన్ని ఇవ్వటంలాంటి పాశ్చాత్య జాతి వివక్ష ద్వంద్వ ప్రమాణాలు బయటకు వచ్చాయి. అంతులేని సహానుభూతిని ప్రదర్శిస్తూ ఐరోపా ప్రభుత్వాలు తమ సరిహద్దులను తెరిచాయి. అదే సమయంలో టర్కీని దాటి ఆశ్రయం కోరి వస్తున్నవారిని గ్రీక్ సముద్ర తీర సంరక్షణా సంస్థ వెనక్కి నెట్టేయటం చేస్తూనే ఉండింది. స్పెయిన్ పోలీసులు కూడా అదే చేశారు. 'ఉక్రెయిన్ శరణార్థులు యూరప్ వారే, వాళ్లు మనలాగే నీలి కళ్లతో, రాగి జుట్టుతో ఉన్నారు, మనలాంటి కారులనే వాళ్లు నడుపుకొంటూ వచ్చారు' అంటూ నివేదించిన పాశ్చాత్య మీడియా జాతి వివక్ష పక్షపాతం పూర్తిగా బహిర్గతం అయింది.

1951 శరణార్థ ఒడంబడికను గౌరవించనందుకు భారతదేశంతో సహా దక్షిణ ఆసియా దేశాలను పాశ్చాత్య దేశాలు విమర్శించాయి. ఈ ఒప్పందాన్ని 2005లో ఆఫ్ఘనిస్థాన్ ఆమోదించింది. 1951 శరణార్థ ఒడంబడికను గౌరవించక పోవటానికి భారతదేశానికి తగు కారణాలు ఉన్నాయి. యూఎన్‌హెచ్‌సిఆర్ ఆఫీసును ఢిల్లీలోనూ, చెన్నైలోనూ ఏర్పాటు చేసుకోవటానికి అనుమతి ఇచ్చినప్పటికీ ఆ సంస్థను భారతదేశం గుర్తించటం లేదు. 1951 శరణార్థ ఒడంబడికలో భారత్ సంతకం చేయనప్పటికీ, అది పొరుగుదేశాన, ఇంకా ప్రపంచవ్యాప్తంగా ఉన్న శరణార్థులను పెద్ద సంఖ్యలో ఆహ్వానించింది. టిబెట్, శ్రీలంక, మయన్మార్ ల నుండి శరణార్థులు ఉన్నారు. అంతే కాకుండా పశ్చిమాసియా, ఇరాన్, ఇరాక్, సిరియాల నుండి కూడా శరణార్థులు భారతదేశంలో ఉన్నారు. ఆఫ్రికా దేశాల నుండీ, చెప్పుకోదగ్గ సంఖ్యలో బాంగ్లాదేశ్, పాకిస్తాన్‌ల నుండి కూడా శరణార్థులు ఇక్కడ ఉన్నారు. ఈ శరణార్థులను పట్టించుకునే విధానం అందరికీ ఒకేలా ఉండదనేది నిజమే. వీరిలో కొంతమంది మాత్రమే భారత సమాజంలో మమేకం కాగలిగారు. కానీ చాలామంది శరణార్థులు భారతదేశంలో పని చేశారు. కొందరికి భారత పౌరసత్వం కూడా వచ్చింది. భారతీయులు వారికి ఇళ్లు అద్దెకు ఇచ్చారు. శరణార్థులను బాగా చూసుకున్నారు. స్నేహ సంబంధాలు ఏర్పడ్డాయి.

శరణార్థ రక్షణ

భారతదేశంలో శరణార్థుల రక్షణకు ఐక్యరాజ్య సమితి శరణార్థుల హై కమిషన్ (UNHCR) కూడా అనుకూల పాత్ర వహించింది. తమ ఆదేశాల ప్రకారం గుర్తించబడిన శరణార్థులందరికి గతంలో ఆర్థిక సహాయం అందించింది. దానితో బాటు, ఆ సంస్థ ప్రాథమిక విద్యా, వైద్య సౌకర్యాలను కల్పించింది. వృద్ధులకు, స్త్రీలకు, పిల్లలకు ప్రత్యేక సౌకర్యాలు వుండేవి. ముఖ్యంగా, యూఎన్‌హెచ్‌సిఆర్ ఆదేశాల ప్రకారం గుర్తించిన శరణార్థులకు నివాస అనుమతులు, దీర్ఘకాల వీసాలు ఇస్తారు. బాంక్ అకౌంట్లు తెరవటానికి, పని చేసుకోవటానికి, పిల్లలను బడుల్లో చేర్చుకోవటానికి అనుమతినిచ్చారు. మూడో ప్రపంచ దేశాల్లో పునరావాసం పొందటానికి కూడా యూఎన్‌హెచ్‌సిఆర్ సహాయం చేసింది. చాలామంది పాశ్చాత్య దేశాలకు వెళ్లి అక్కడ తమ జీవితాలను పునర్నిర్మించుకొన్నారు.

భారత రాజ్యాంగంలో ఉన్న ఆర్టికల్స్ 14, 21 ఇచ్చిన హక్కులలో భాగంగా కోర్టులు శరణార్థుల హక్కులను గుర్తించాయి. ఈ ఆర్టికల్స్ ప్రకారం భారత పౌరులు అయినా, కాకపోయినా అందరికీ సమాన హక్కులు ఉంటాయి. వ్యక్తి జీవితానికి ప్రమాదం ఉంటే శరణార్థులను అతని స్వదేశానికి పంపకూడదనే ప్రాథమిక హక్కును కూడా కోర్టులు గుర్తించాయి. నిర్బంధంగా స్వదేశానికి పంపకూడదని హక్కు అది. 1951 ఐక్యరాజ్య సమితి శరణార్థుల ఒడంబడికలోని శరణార్థి నిర్వచనంలో ఈ హక్కులు ఇమిడి ఉన్నాయి. భారతదేశం సహనశీలమైనదనీ, అలీన ఉద్యమానికి నాయకత్వం వహించిన దేశమనీ, మూడో ప్రపంచ దేశ ప్రజలకు స్నేహితురాలనీ వినటం వలన శరణార్థులు ఇక్కడకు వస్తారు. కానీ ఇప్పుడు అంతా శరవేగంతో మారిపోతోంది.

వైఖరి మార్పు

యూఎన్‌హెచ్‌సిఆర్ గుర్తించిన శరణార్థులకు కూడా భారత ప్రభుత్వం నివాస అనుమతులు ఇవ్వటం మానేసింది. చాలామంది శరణార్థులకు నివాస అనుమతులు, దీర్ఘకాల వీసాలు లేవు. అందువలన ఆధార్ కార్డులకూ దరఖాస్తు పెట్టుకోలేరు. అంటే బాంక్ అకౌంట్ తెరవలేరు. పై దేశాలలో ఉండే స్నేహితులు అందిస్తున్న ఆర్థిక సహాయాన్ని అందుకుంటున్న చాలామంది ఇప్పుడిక అందుకోలేరు. వాళ్లు పిల్లల్ని బడిలో చేర్చలేరు. పనికి వెళ్లలేరు. బలహీనవర్గాలకు ఉద్దేశించిన పథకాల కింద మహిళా శరణార్థులు

ఆరోగ్య సౌకర్యాలు పొందేవాళ్లు. కానీ ఇప్పుడు ఆధార్ కార్డు లేకుండా వాళ్లు కనీసం అల్ట్రా సౌండ్ స్కానింగ్ కూడా పొందలేరు. మయన్మార్ నుండి వచ్చిన శరణార్థులతో మాట్లాడుతుండగా, వీళ్లలో చాలామంది వికాస్ పురి దరిదాపుల్లో ఉన్న ఫ్యాక్టరీల్లో తక్కువ వేతనాలకు పని చేస్తున్నారని కనిపెట్టాను. మగవారికి 7000 రూపాయలు, మహిళలకు 5000 రూపాయలు నెలసరి వేతనాలు వుంటాయి. ఒక జంట తమ సంపాదననంతా సమకూర్చుకున్నా -5000 రూపాయలకు ఒక రూమ్‌ను అద్దెకు పొందగలరు. దానితో బాటు కరెంటు, నీటి బిల్లులూ, పిల్లల చదువులు, ఆహారం ఉంటాయి. గడగడ వణికించే చలికాలంలో కూడా ఇంధనం మాట ఎత్తకూడదు.

శరణార్థులు పోలీసు వేధింపులను ఎదుర్కొంటారు. యూఎన్‌హెచ్‌సిఆర్ కార్డులను వాళ్ల మొహాల మీద కొట్టి వాళ్లు చట్టం దృష్టిలో చట్టవ్యతిరేక వలసవాదులని చెబుతారు. సరిహద్దుల దగ్గర మయన్మార్ శరణార్థులను తిప్పి కొడుతున్నారు. ఎలాగోలా ప్రవేశించిన వారిని అరెస్టు చేసి నిర్బంధిస్తున్నారు. ఆశ్రయం కోరేవారికి శరణార్థ హెూదా ఇవ్వకుండా రెండు సంవత్సరాల కంటే ఎక్కువ కాలం యూఎన్‌హెచ్‌సిఆర్ ఉంచటం మొదలు పెట్టింది. ఒక వేళ ఆ హెూదా ఇచ్చినా ఆర్థిక సహాయం రూపంలో చాలా తక్కువ మద్దతు ఇవ్వ చూపుతోంది. ఇటీవల దుప్పట్లను పంచింది కానీ ఇంకికొకటి చొప్పునే. ఉదాహరణకు 8మంది కుటుంబ సభ్యులు ఉన్న కుటుంబం ఒకే ఒక దుప్పటిని పొందగలిగింది. అది కూడా చాలా పల్చగా ఉంది. రక్షణ కోరుకుంటూ, నిరసన తెలియ చేయటానికి కార్యాలయం వెలుపల గుమి కూడా, నినాదాలు ఇస్తున్న శరణార్థుల ముఖం మీద యూఎన్‌హెచ్‌సిఆర్ తలుపులు గట్టిగా మూసుకొంటాయి. వాళ్లను కొడతారు. ఒక్కోసారి సెక్యూరిటీ వాళ్లు పోలీసులను పిలుస్తారు.

వలసవాదులు వర్సస్ శరణార్థులు

భారతదేశంలో శరణార్థులు లేరనీ, కేవలం వలసవాదులే ఉన్నారనేది భారత ప్రభుత్వ వైఖరి. మీడియాలో మానసిక వ్యాధిలాంటి భయాన్ని నింపివేశారు. భారతదేశంలోకి విదేశీయులు చొచ్చుకొని వచ్చారనీ, ఈ శరణార్థులు భారత భద్రతకు ప్రమాదకారులని ఈ మీడియా చెబుతుంది. ఉగ్రవాదం మీద భద్రతా మండలి తీర్మానాలను శరణార్థులకు వర్తింపచేసి, ఉగ్రవాదులకు వసతి కలిపించే శరణార్థ ప్రక్రియ లేకుండా రాష్ట్రాలు జాగ్రత్త పడాల్సిన అవసరం ఉందని మాట్లాడతారు.

ఐరోపాలోనూ, అమెరికాలోనూ సాంప్రదాయవాద (మార్పు ఒప్పుకోని) ప్రజాప్రతినిధి పార్టీలు శరణార్థ సంక్షోభాన్ని మార్కెట్టు చేసుకుంటున్నాయి. వలస వ్యతిరేకతను వారి రాజకీయ వేదిక మీద ప్రాముఖ్యం కలిగిన అంశంగా మారుస్తున్నాయి. పాశ్చాత్య దేశాల ఉదారవాద ప్రసార మాధ్యమాలు కూడా శరణార్థులను వలసవాదులుగా, సిరియాలో యుద్ధ, సంక్షోభ ప్రేరకులుగా పిలుస్తూ ఈ అగ్నికి ఆజ్యం పోస్తున్నాయి. శరణార్థులను వలసవాదులుగా పిలిచి గందరగోళ పరచటం వలన సమస్య ఇంకా సంక్లిష్టంగా మారుతుంది. వలసవాది అంటే తన ఇష్టపూర్వకంగా ఇంకో దేశానికి వెళ్లి, అక్కడ మంచి అవకాశాలను పొందాలని అనుకునేవాడు. కొత్త దేశంలో స్థిరపడాలని అనుకునేవాడు. శరణార్థుడంటే ఆశ్రయం కోరేవాడు. చాలాసార్లు అతని జీవితానికి ఎలాంటి ప్రమాదం లేనపుడు స్వదేశానికి తిరిగి వచ్చేవాడు.

జాతీయ పౌరుల నమోదు, 2019 పౌరసత్వ హక్కు చట్టంలో వచ్చిన మార్పుల చుట్టూ అల్లుకున్న వివాదం సందర్భంగా వలసవాదుల చర్చ భారతదేశంలో రంగం మీదకు వచ్చింది. ఈ వివాదాల్లో శరణార్థుల రక్షణ విషయం -చట్ట వ్యతిరేక వలస చర్చల్లో మరుగున పడిపోయింది. శరణార్థులకూ, వలసవాదులకూ మధ్య చట్టపరమైన వ్యత్యాసం స్పష్టంగా వుండదనేది నిజం. అయితే అది శరణార్థులనే విభాగాన్ని రద్దు చేసే వాదన కాకూడదు. దానికి బదులుగా ఈ నిర్వచనాల గురించి పునరాలోచించాల్సిన అవసరం ఉంది. జాతీయ మానవహక్కుల కమిషన్ ఇప్పుడు భారతదేశంలో శరణార్థులను రక్షించే చట్టాన్ని తయారు చేయటంలో మునిగి ఉంది. ఈ విషయం మీద శశి థరూర్ పార్లమెంటులో ప్రైవేట్ బిల్లును ప్రవేశపెట్టాడు. భారతదేశంలో జారీ అయ్యే శరణార్థుల రక్షణా చట్టం మతాలకూ, సమూహాలకు అతీతంగా అందరినీ రక్షించటం అవసరం.

భారతదేశం తన సొంత చట్టాన్ని తయారు చేసుకుంటూ ఉండగా, ఇక్కడి శరణార్థులకు నివాస అనుమతులు ఇవ్వాల్సి ఉంది. పునరావాసం పొందిన వారికి బయటకు వెళ్లే వీసాలు ఇస్తే వాళ్లు వాళ్ల జీవితాలను, వాళ్ల పిల్లల జీవితాలను పునర్నిర్మించుకొంటారు. నివాస అనుమతులు ఇవ్వకపోవటం వలన శరణార్థులు చట్టవిరుద్ధంగా ఆధార్ కార్డులు పొందే దశకు నెట్టబడుతున్నారు. ఇది మన వ్యవస్థను అవినీతిమయం చేస్తుంది. కాబట్టి భారత రాజ్యాంగ ప్రాథమిక హక్కులకు అనుగుణంగా నివాస అనుమతులు ఇవ్వటం, బయటకు వెళ్లే వీసాలు ఇవ్వటం ఒక రక్షణ చర్య. అది మానవతావాద ప్రకటన కూడా.

అయితే శరణార్థుల రక్షణ విషయంలో దాదాపు ఎలాంటి ప్రజా జోక్యం లేదు. అలాంటి జోక్యం మానవ హక్కుల రక్షణకు నిజంగా కొనసాగింపు. యుకెలో ఆశ్రయం కోరిన ఒక ప్రయాణికుల విమానాన్ని రువాండా వెళ్లనీయకుండా ప్రజల పరిజ్ఞానం, వారి జోక్యం ఆపాయి. కోర్టుల్లో ఆలోచనాత్మక సవాళ్లు జరిగాయి. శరణార్థుల రాకను అనైతిక చర్యని చర్చి అన్నపుడు ప్రజా ఆగ్రహం పెల్లుబుకింది.

సాంప్రదాయవాద (మార్పు ఒప్పుకోని) రాజకీయ ఎజండాకు శరణార్థులు గురి అయినపుడు ప్రజాస్వామ్యానికీ, ప్రజాస్వామ్య విలువలకూ ప్రమాదం. మానవ సహెూదరత్వం అనే సిద్ధాంతంలోనే శరణార్థుల రక్షణ వేళ్లూనుకొని వుంది. శరణార్థుల రక్షణ మానవ నాగరికతకు కీలకమైనది. ❖

పంజరంలో పక్షి

మాయా ఏంజెలో   అనువాదం: అనువాదం శివలక్ష్మి

స్వేచ్ఛా పక్షి
గాలి వేగంతో హాయిగా గెంతుతూ ఆకాశంలో విహరిస్తుంది
తేలుతూ నదీ ప్రవాహంలో తేలుతూ దిగువకు చేరుతుంది
శక్తి మేరకు
తన రెక్కల్ని ముంచుతూ మురిపెంగా ఆడుతుంది
నారింజరంగు సూర్య కిరణాలలో
ఆకాశాన్ని సైతం శుభ్రం చేయడానికి ధైర్యం చేస్తుంది


కానీ బంధింప పడిన పక్షి
తన ఇరుకైన పంజరంలో నుంచి
చాలా అరుదుగా చూడగలుగుతుంది
అ పక్షి పాడటానికి తన గొంతు తెరవబోతే
దాని కోపం కట్టలు తెంచుకుంటుంది
దాని రెక్కలు కత్తిరించబడ్డాయి
దాని పాదాలు తాళ్లతో కట్టబడి ఉన్నాయి.

పంజరంలో పక్షి
భయంకరంగా వణికే గొంతుతో పాడుతుంది
కానీ చాలా కాలంగా
సుదూరపు కొండల నుంచి
శృతి తప్పిన రాగం అస్పష్టంగా
పంజరం నుంచి విముక్తి కోసం
పక్షి స్వర రాగం
విషాదంగా వినబడుతూనే ఉంటుంది.

స్వేచ్ఛా పక్షులు ఆహ్లాదకరమైన ఇతర పవనాల గురించి ఆలోచిస్తాయి
చెట్లు వదిలే వాణిజ్య వాయువుల్ని మృదువుగా ఆస్వాదిస్తాయి
కొవ్వు పురుగులు ప్రకాశవంతంగా గీసినట్లున్న పచ్చికలో
వాటికోసం వేచి ఉంటాయి
ఆ పక్షులు ఆకాశానికి తమ పేరు పెట్టుకుంటాయి.

కానీ పంజరంలోని పక్షి తన కలల సమాధిపై నిలబడి ఉంటుంది
ఆ పక్షి నీడ ఒక పీడకలలో భీతిల్లినట్లు కర్ణకఠోరంగా అరుస్తుంది
ఆ పక్షి రెక్కలు కత్తిరించబడ్డాయి, పాదాలు కట్టివేయబడ్డాయి
కాబట్టి పంజరంలో పక్షి పాడటానికి తన గొంతు సవరించు కుంటుంది.

పంజరంలో పక్షి పాడుతుంది
భయ కంపితమైన స్వరంతో
తెలియని విషయాల గురించి
ఇంకా చాలా కాలం పాటు
సుదూర తీరాల కొండల మీద నుంచి
పంజరంలోని పక్షి
తన స్వేచ్ఛను ఎలుగెత్తి చాటే
పక్షి స్వరరాగం విషాదంగా వినబడుతూనే ఉంది!




ఫిబ్రవరి నెలను అమెరికా, కెనడాలలో 'నల్లజాతి చరిత్ర నెల' (Black History month)గా ప్రతి సంవత్సరం నల్ల జాతీయులు తమ స్వేచ్ఛ కోసం పోరాడే నెలగా జరుపుకుంటారు. దీనినే 'ఆఫ్రికన్-అమెరికన్ చరిత్ర నెల' (African-American History Month)గా కూడా పిలుచుకుంటారు. నల్లజాతి స్వేచ్ఛా- స్వాతంత్ర్యాల కోసం పోరాడిన అబ్రహాం లింకన్ 1809, ఫిబ్రవరి 12న, ఫ్రెడరిక్ డగ్లస్ 1818 ఫిబ్రవరి 14న జన్మించారు. వారిద్దరి జన్మదినాలను పురస్కరించుకుని 19వ శతాబ్దం చివరి దశకాల నుంచి వారిని తమ పోరాట ప్రతినిధులుగా కీర్తిస్తూ, ఫిబ్రవరి మాసంలో వారి పోరాటాలను స్మరించుకుని, భవిష్యత్ మార్గాలను నిర్దేశించుకుంటారు. అందువల్ల ఫిబ్రవరి నెలను 'నల్లజాతి చరిత్ర నెలగా నల్లజాతి సంఘాలు ఎంపిక చేసుకున్నాయి. 19వ శతాబ్దం నుంచి నల్లజాతీయులు స్వేచ్ఛ కోసం పరితపిస్తుంటే 21వ శతాబ్దంలో కూడా వారికి ఇంకా స్వేచ్ఛ రాలేదనే విషయాన్ని 1969లో మాయా ఏంజెలో రాసిన 'Caged Bird' కవితలో తెలుపుతుంది. ఇందులో ఆమె మనిషి స్వేచ్ఛకు ఎదురు బొదురుగా నల్ల జాతీయుల బానిసత్వం, వివక్ష, నెరవేరని కలల ఇతివృత్తాలను సంకేతాలుగా నిలిపి స్పష్టంగా అమెరికన్ సమాజాన్ని చూపిస్తుంది. స్వేచ్ఛాపక్షి స్వేచ్ఛతో వచ్చే అన్ని స్వేచ్ఛలను అనుభవిస్తుండగా, 'పంజరంలో పక్షి' కి స్వేచ్ఛ నిరాకరించబడి, తన కలల సమాధిపైనే జీవిస్తుంటుందంటుంది.

ఉపరితల అర్థానికి మించి, శ్వేత జాతీయులు నాణ్యమైన విద్య, మంచి పర్యావరణ సౌకర్యాలు, గొప్ప హోదాలతో వుద్యోగాలు అనేక ఇతర సదుపాయాలు అనుభవిస్తూ ఆనందంగా జీవిస్తుండగా, మానవుడిగా పుట్టిన ప్రతి మనిషికీ దక్కవలసిన ప్రాథమిక హక్కులు కూడా నల్లజాతి అమెరికన్లకు తిరస్కరించబడ్డాయని కవితలో 'స్వేచ్ఛ కలిగిన పక్షి' -'బంధింపబడిన పక్షి' ల చిత్రణ ద్వారా నిరూపిస్తుంది మాయా ఏంజెలో. శ్వేతజాతీయుల పాఠశాలలు - నల్లజాతీయుల పాఠశాలలు, తెల్లవారి ఉద్యోగాలు - నల్లవారి ఉద్యోగాలు, శ్వేతజాతీయుల పొరుగు ప్రాంతాలు - నల్లజాతీయుల పొరుగు ప్రాంతాలు, తెల్లవారి కోసం రెస్టారెంట్లు - నల్లవారి కోసం రెస్టారెంట్లు -ఈ విధంగా ప్రాథమికంగా విభజించబడిన సమాజాన్ని పాఠకుల ముందు పెడుతుంది. శ్వేతజాతీయులు మంచి వస్తువులను కలిగి ఉంటే నల్లజాతీయులు వాడి పారేసిన వస్తువులతో కాలం గడుపుతున్నారంటుంది.

అమెరికా సమాజంలోని నల్లజాతి వివక్షను కట్లు కట్టబడిన పాదాలు (Tied feet), కత్తిరించబడిన రెక్కల (clipped wings) ద్వారా ప్రభావవంతంగా బొమ్మకట్టి చూపిస్తుంది.

ఈ పోలికలు ప్రపంచ దేశాలన్నిట్లోని ఆధిపత్య వర్గాలు-అణచబడుతున్న వర్గాలుకి వర్తిస్తుంది. ❖

చివుళ్లు



- సా మూ 96427 32008



చివుళ్లకేమీ తెలియదని
ఆకుల్లో ఎప్పటిదో ఒక పాత ఊహ
ఆకులకు కొత్త చెవుల్లు లేవనే
చివుళ్ల ఫిర్యాదు కూడా పాతదే
చెట్లన్నీ ఇలాగే గట్టిపడతాయి
ప్రతి ఇల్లూ ఒక చెట్టు

చివుళ్లకు చేతులుంటాయి
నవ్వడానికీ ఏడవడానికీ త్వరపడే చేతులు

కళ్లుంటాయి
ఆకాశాన్నంతా ఒకేసారి ఎత్తి
కనుపాపల మీద వొంపుకోవాలనుకునే
ఆశబోతు గాలిపటం చూపులున్న రెండు రెండు కళ్లు
ఒక్క రెప్పల సైగతో
భూమిని విడుదల చేయించుకునే కళ్లు

లేత గుండెలుంటాయి
కత్తులైనా హత్తుకునే గుండెలు
గభాలున గాయపడే గుండెలు
ఒక్క చిన్న చాక్లెట్ రేపర్‌లో
హృదయాన్ని చుట్టి దాచుకునే గుండెలు


కొన్నాళ్లు తెలీకుండానే చివుళ్లు
ఆకుల వెంట నడుస్తాయి
చివుళ్ళ పాదాలకు గుట్టలేవో
మైదానాలేవో తెలిసొచ్చే దాకా.
నడిచీ నడిచీ చివుళ్ల కాళ్లు గట్టిపడతాయి
అప్పుడిక ఆకులు రాలిపోయినా
చెట్టు పడిపోవు
చివుళ్లు వేళ్లవుతాయి

ఇంకోసారికి
ఆకులు పసిపాపలై చివుళ్లను చేరుకుంటాయి
అమ్మ ముద్ద
నాన్న ముద్ద
చివుళ్ల ఇంట్లో రోజూ సంబరం
చెట్టు ఆనందంలో పాటలు పాడే నది

ఆకుల్ని దోచుకున్న చివుళ్ల కథలే అన్నీ
చెట్టు ఎండిపోయిన బాధ
గుంపు మధ్యలో ఏర్పడ్డ ఖాళీ కలిగించే దిగులు
చివుళ్లకైతే పట్టదు
అడవిక్కూడా? ❖

ద్వేషం - దౌర్జన్యాల కులవివక్షను నిజాయితీగా చిత్రీకరించిన డాక్యుమెంటరీ!

శివలక్ష్మి



(చివరి భాగం)

ఆధునిక డాక్యుమెంటరీల పితామహులు జాన్ గ్రీర్ సన్ "ముడి జీవితం నుండి తీసుకున్న గాథలు, దృశ్యాలు నటించిన కృత్రిమ సన్నివేశాల కన్నా ఎన్నో రెట్లు మెరుగు అని మేము నమ్ముతున్నాం. సహజ సుందరంగా ఎలాంటి బిగింపులు లేకుండా ప్రకటితమయ్యే భావ సంకేతానికి తెర మీద ఓ ప్రత్యేక విలువ ఉంది. టక్కుటమార విద్యలు మిళాయించి స్టూడియో కర్మాగారాల్లో తయారు చేసే యాంత్రిక ఉత్పాదనలు ఇవ్వలేని, వాటికి అతీతమైన ఆత్మీయ అనుభూతినీ, తెలివిడితనాన్ని ఇవ్వగల శక్తి ఒక్క డాక్యుమెంటరీకే ఉంది" అని డాక్యుమెంటరీ దృశ్యీకరణ గురించి అన్నారు. ఇది భారత సమాజ వాస్తవికతతో పెనవేసుకుని ఉంది కాబట్టి, జాన్ గ్రీర్ సన్ చెప్పినట్లే అంబేద్కర్‌తో సహా కుల వివక్షకూ, అన్ని రకాల పీడనలకూ గురవుతున్న మనుషులందరి వాస్తవ జీవిత గాథల సారాంశాన్ని అద్భుతంగా ఆవిష్కరించారు జబ్బార్ పటేల్.

అంబేద్కర్ సర్వోత్కృష్టమైన రచనగా ప్రఖ్యాతి గాంచిన 'కుల నిర్మూలన' (The Annihilation Caste) కమ్యూనిస్ట్ మ్యానిఫెస్టోకి సమానమైన ప్రాధాన్యతను సంతరించుకుంది. వేలాది పేజీల రచనలతో, ప్రసంగాలతో గాక కుల వివక్షను అంతం చెయ్యాలని అంబేద్కర్ తన జీవితమంతా ఎడతెగని యుద్ధం చేశారు. స్వాతంత్రోద్యమం కంటే కూడా అంబేద్కర్ కుల నిర్మూలనే ప్రధానమనుకున్నారు. గాంధీజీ పెద్ద ఎత్తున బ్రిటీష్ వస్త్ర దహనం చేశారని ఒక స్నేహితుడంటే, 'గాంధీజీ దహనం చెయ్యాల్సిన విషయాలింకా చాలా ఉన్నాయి. ఇండియాలో కోట్లమంది అంటరానివారు, పౌరహక్కులు, న్యాయ హక్కులు, రాజకీయ హక్కులు, నైతిక హక్కులు లేకుండా ఉన్నార'ని అంబేద్కర్ అంటారు. మహర్ కులంలో జన్మించిన కారణం వల్ల అపారమైన విద్వత్తుతో దేశానికే గర్వకారణమైన అంబేద్కర్‌కి ఇంకో మనిషి తోడు లేక, తల దాచుకునే చోటు లేక బరోడాలో ఎంత క్షోభననుభవించారో ఆయనే స్వయంగా రాసుకున్నారొకచోట. ఆయన బాల్య సంఘటనలూ, బరోడాలో జరిగిన అవమానం అంబేద్కర్‌ని నిరంతరం బాధతో మెలితిప్పుతూ జీవితాంతం ప్రభావితం చేశాయి. ఈ దేశం పరిస్థితి ఒకప్పుడు, ఆ మాటకొస్తే ఇప్పుడైనా ఎంత నీచంగా ఉందో, ఈ కుల వ్యవస్థ తోటి మనుషుల పట్ల ఎంతెంత హీనంగా, నీచంగా ప్రవర్తించిందో ప్రతి ఒక్కరూ తెలుసుకుని తీరాలి. స్టీవ్, అంబేద్కర్ హోటల్లోపని ముగించుకుని

బయటి కొచ్చేనరికి ఒక తెల్లవాడు, నల్లజాతీయుణ్ణి పట్టుకుని 'నల్లజాతి వెధవా, మా తెల్లజాతి అమ్మాయిని ముట్టుకోవడానికి నీకెంత ధైర్యంరా? నల్లజాతి నక్క, అంటరాని కుక్క, బూడిదలో పొర్లే పందికీ నీకూ తేడా లేదు కదరా' అంటూ నోటికొచ్చినట్లు తిడుతూ, విచక్షణారహితంగా రోడ్డు మీద పడేసి ఎడా పెడా చావబాదుతాడు. ప్రేక్షకులకు ఇటీవల అమెరికా పోలీసులు జార్జ్ ఫ్లాయిడ్‌ని కిరాతకంగా చంపిన దృశ్యం కళ్లెదురుగా నిల్చి -అప్పటికీ, ఇప్పటికీ పరిస్థితి ఏమాత్రం మారకపోగా ఇంకా హీనమై మరింత దిగజారి పోయిందనిపించి నీరసపరుస్తుంది. అగ్రరాజ్యపు చెడుపోకడలే అన్ని దేశాధినేతలకూ నేటికీ ఆదర్శమవుతున్నాయి!



కుటుంబసమేతంగా పిల్లలూ, వృద్ధులూ, అన్ని వయసుల స్త్రీ-పురుషులతో మహోద్రేకంతో తరలి పోతున్న ఈ జన సమూహాలు, ఐసెన్ స్టీన్ 'స్ట్రైక్', 'బ్యాటిల్ షిప్ పొటోంకిన్', 'అక్టోబర్' చిత్రాల్లోని జన ప్రవాహాల్ని గుర్తుకి తెస్తాయి!

అంబేద్కర్ లండన్‌లో ఉన్నప్పుడు కుమారుడు గంగాధర్ మరణవార్తను తెల్పుతూ భార్య రమాబాయి నుంచి ఉత్తరం అందుతుంది. 'ప్రియమైన రామూ, మనబ్బాయి మరణవార్త నాకు దుఃఖం కలిగిస్తుంది. వాడు లేకుండా బతకడాన్ని నేను ఊహించలేక పోతున్నాను. తల్లిగా నీ కడుపుకోతను ఎవరు తీర్చగలరు? మీరు ఇతరుల ఇళ్లలో అంట్లు తోముకుంటూ, పిడకలు కొట్టుకుంటూ, కట్టిపుల్లలు ఏరుకుంటూ దుస్థితి ననుభవిస్తుంటే నామీద నాకే అనహ్యావేస్తుంది. ఈ యుద్ధకాలంలో ఇక్కడ నాకూ ఇబ్బందిగానే ఉంది. నా అవసరాల కోసం ఒక్కోసారి నా పుస్తకాలమ్ము కుంటున్నాను. అన్నీ భరించక తప్పదు' అంటూ చాలా దుఃఖంతో జవాబిస్తారు. లండన్ లాంటి మహానగరంలో ఆయన అర్ధాకలితో, చిన్న బ్రెడ్ ముక్కలతో ఆకలితో పడే ఇబ్బందులన్నీ ప్రేక్షకులకు తెలిసొస్తాయి. అయినా అధ్యయనాన్ని మాత్రం నిర్లక్ష్యం చెయ్యకుండా దృఢదీక్షతో కొనసాగిస్తూనే ఉంటారు.

కొందరు బ్రిటీషర్లు లండన్ రెస్టారెంట్లో అంబేద్కర్ తింటున్న వైపుగా వచ్చి హేళనగా 'ఇండియన్స్ ఎడం చేత్తో తింటూ, అశుద్ధాన్ని కుడి చేత్తో కడుక్కోవడం లాంటి పన్లన్నీ చేస్తారట, నిజమేనా?' అని హేళనగా అడుగుతారు. దానికి అంబేద్కర్ 'ఆంగ్లేయులు వారానికి ఒక్కసారే స్నానం చేస్తారని విన్నాను. అది బహుశా నిజం కాకపోవచ్చు. ఎవరో పుట్టించిన పుకారై ఉంటుంది' అని ఆంగ్లేయులు తలదించుకునే లాగా యుక్తిగా సమాధానమిస్తారు. ఇంకోసారి రాబర్ట్ అనే అతనికి చికెన్ ఐపోయిందని సర్వర్ చెప్తాడు. అతను గిరుక్కున తిరిగి అంబేద్కర్ తింటున్న వైపుగా వచ్చి "ఓ, నా చికెన్ ముక్క నువ్వు తింటున్నావా? అదృష్టవంతుడివే! మా నాన్న అంటూ ఉంటారు. 'ఇండియాలో ఇండియన్సూ, కుక్కలూ కలిసి బయట తింటుంటార"ని అంటూ అక్కడున్న ఆహారాన్ని అంబేద్కర్ షర్ట్ మీదికి అహంకారంతో ఒలకబోస్తాడు. అంబేద్కర్ తీక్షణంగా అతని వంక చూచి, నిటారుగా నిలబడి 'క్షమాపణ అడుగు' అని హూంకరిస్తారు. అతను మౌనంగా ఉంటే, అంబేద్కర్ నిండైన ఆత్మవిశ్వాసంతో 'క్షమాపణ అడుగు' మళ్లీ అని గర్జిస్తారు. అతను గత్యంతరం లేక 'సరే, నన్ను క్షమించు' అని చెప్పి అక్కడినుంచి తప్పుకుంటాడు. భారతదేశాన్ని విదేశీయులు కించపరిస్తుంటే ఏమాత్రం సహించలేని దేశభక్తిని అంబేద్కర్‌లో ఈ సన్నివేశంలో చూస్తారు ప్రేక్షకులు. ఇలాంటి మహనీయుణ్ణి దేశభక్తి లేని దేశద్రోహిగా అసత్య ప్రచారాలు చేస్తూ, ఆయనకి వ్యతిరేకంగా పెద్ద ఉద్యమాన్ని చేస్తారు అగ్రవర్ణ హిందువులు. కానీ అంబేద్కర్‌ని దేశభక్తుడని నిరూపించే ఇలాంటి చాలా సంఘటనలున్నాయీ చిత్రంలో!

'చలో మహాడ్, అస్పృశ్యత నశించాలి' అనే నినాదాల హోరుతో జన సమూహం మహోత్సాహంతో కదిలిపోతుంటుంది.

భారతదేశ చరిత్రలో అంబేద్కర్ ఒక గొప్పమేధావి, అధ్యయనశీలి. లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ లైబ్రరీలో ఒక మనిషి చేతులతో పట్టుకోలేనన్ని గ్రంథాలను కిందా, మీదా పడేసుకుంటూ తనున్న చోటుకి మోసుకు రావడం కనిపిస్తుంది. ప్రపంచంలోని కీలకమైన గ్రంథాలు, అందులో ఏ పేజీలో ఏముందో కూడా చెప్పగలిగిన దిట్ట ఆయన! ఆయన సొంత లైబ్రరీలో -దేశంలోనే ఎవరికీ లేనంత పెద్ద గ్రంథాలయాన్ని నెలకొల్పి, లెక్కలేనన్ని పుస్తకాలను కొని భావితారాలకోసం భద్రపరిచారు. అంబేద్కర్ పాఠక రాక్షసుడే గాక పని రాక్షసుడు కూడా! అంత ప్రత్యేకమైన అంబేద్కర్‌ని అంతే ప్రత్యేకంగా ప్రేక్షకుల ముందు బొమ్మ కట్టించారు జబ్బార్ పటేల్!

సినిమా చూసే ప్రేక్షకులకి తొలి ప్రతిస్పందన కలిగించడం చాలా ముఖ్యం. మొదటి సన్నివేశంలోనే ప్రేక్షకునికి కథావస్తువుకు సంబంధించి సూచీ ప్రాయమైన సంకేతం అందాలి. ఆ పనిని అద్భుతంగా చేశాడు దర్శకుడు జబ్బార్ పటేల్! అంటరానివారి దయనీయమైన స్థితిని ప్రేక్షకుల మదిలో ముద్రించడానికి వారిని మానసికంగా సంసిద్ధం చెయ్యడానికి పెన్సిల్ స్కెచ్‌ల ద్వారా ప్రదర్శించాలనే జబ్బార్ పటేల్ అద్భుతమైన ఆలోచన ఈ చిత్రానికి ఉత్తమోత్తమంగా హైలైట్‌గా నిలిచింది!

ఇక నటీనటుల గురించి చెప్పాలంటే 'మమ్ముట్టీ' అంబేద్కర్ ఉద్వేగాలనూ, సంయమనాన్నీ, అంతఃకరణనూ అభినయించడంలో అతని కతనే సాటిగా పాత్రలో జీవించారు. ఆయన ఈ చిత్రంతో ప్రపంచ మేటి నటుల కోవలో చేరిపోయారు. మమ్ముట్టీ అద్భుతమైన నటనా సామర్థ్యాలు అంబేద్కర్‌ను భౌతికంగా చూడని వారందరికీ తిరిగి జీవితంలోకి తీసుకువచ్చి కళ్లముందు ప్రత్యక్ష్యం చేస్తాయి!

అంబేద్కర్ భార్య రమాబాయిగా నటించిన 'సొనాలీ కుల్ కర్ణి' కూడా అద్భుతంగా నటించారు. అంబేద్కర్ సామాజిక జీవితం కంటే వ్యక్తిగత జీవితాన్ని చాలా తక్కువగా చిత్రించినప్పటికీ, వాళ్లిద్దరిదీ చాలా అన్యోన్య దాంపత్యమనీ, కష్టసుఖాల్ని కలిసి పంచుకుంటారనీ నలుగురు బిడ్డలు చనిపోయిన దుఃఖాన్ని వారిద్దరూ కలిసి భరించిన తీరుని చాలా హృద్యంగా ఆవిష్కరించారు జబ్బార్ పటేల్.

రాజ్యాంగ రచన పని ఎక్కువగా ఉండటం, తీవ్రమైన అనారోగ్య పరిస్థితుల్లో ఉన్న ఆయన్ని సానుభూతితో చూసుకుంటానని డాక్టర్ సవితా కబీర్ అంబేద్కర్‌ని వివాహం చేసుకుంటారు. సవితగా నటించిన 'మృణాల్ కుల్‌కర్ణి' కూడా అంబేద్కర్ ఆరోగ్యమే తన జీవిత ధ్యేయమన్నట్లుగా పాత్రలో ఒదిగిపోయారు!

స్క్రీన్ ప్లే రచయితలు దయా పవార్, అరుణ్ సాధు, సూని తారాపోరేవాలా ఎంతైనా ప్రశంసనీయులు! ఈ చిత్రంలోని అంబేద్కర్ సంభాషణలను ఆయన రాసిన రచనల నుండే తీసుకుని శక్తివంతంగా స్క్రిప్టు రూపొందించారు. అందువల్ల మమ్ముట్టి మాట్లాడేటప్పుడు ఆయన స్వరంలో అద్భుతమైన ప్రామాణికత ధ్వనిస్తుంది. ఈ ప్రసంగాలు ఒక తరం రాజకీయ ఆలోచనాపరుల్ని ఎంతగా ప్రభావితుల్ని చేశాయో అర్థమవుతుంది! అంతేకాదు, వివక్షలు తొలగి పౌరులందరికీ సమానత్వం సాధించే వరకూ అంబేద్కర్ ప్రతిపాదించిన రాజ్యాంగంలోని అంశాల ప్రాబల్యం చెక్కు చెదరదు. అంబేద్కర్ చేసిన కృషి అందరికీ ఎంతో ఆరాధ్యయ నీయమైనది!

'నితిన్ చంద్రకాంత్ దేశాయ్' కళా దర్శకత్వం కూడా బ్రహ్మాండంగా అమిరింది. కాస్ట్యూమ్ డిజైనింగ్ ద్వారా అంబేద్కర్ అభిరుచి ప్రేక్షకులకు చక్కగా తెలిసేలా రూపొందించారు. సంగీతాన్ని అందంగా సందర్భానుసారంగా సమకూర్చారు. విషాద మేఘాలు కమ్మి, మానసికంగా కుంగుబాటులో ఉన్న ప్రతిసారీ అంబేద్కర్ సంగీతంతో స్వాంతన పొందడం చూస్తారు ప్రేక్షకులు!

అస్పృశ్యులైన ప్రజల జీవితాలను మెరుగుపరచాలని అంబేద్కర్ అహర్నిశలూ ఎంతో ప్రయాస పడతారు గానీ అదంత సులభం కాదని ఈ చిత్రం చూపిస్తుంది. మహారాష్ట్రలోని భీమా కోరెగావ్ వద్ద దళితులపై జరిగిన దాడి కుల అణచివేతలతో పాటు, అనేక రకాలైన ఘోర పరిణామాలను నేడు మనం చూస్తున్నాం. ప్రతి సంఘటనా అంతకుముందు దానికంటే దిగ్భ్రాంతికరంగా, దౌర్జన్యపూరితంగా, హింసాత్మకంగా మారుతుంది. ఈ చిత్ర ప్రారంభ దృశ్యం ఈ సత్యాన్ని స్పష్టంగా ప్రదర్శిస్తుంది. అంబేద్కర్ జ్ఞానాన్ని విదేశీయులందరూ ప్రశంసిస్తారు గానీ స్వదేశీయులు మాత్రం అతను తన జీవితంలో ఎంత ఎత్తుకు చేరుకున్నా, అతన్ని నిరంతరం 'అంటరాని మహర్ కులస్థుడ'ని అవమానపరుస్తూ తీవ్రమైన అణచివేతకు గురి చేస్తారు! బరోడా దృశ్యం ప్రేక్షకుల మనసుల్ని కలచి వేస్తుంది. 'భవిష్యత్తులో చరిత్రకారులు గనక నా జీవితాన్ని సమీక్షిస్తే అప్పుడు నేను దేశానికి చేసిన సేవలను ప్రజలు గుర్తిస్తారు' అని ఆవేదన చెందుతూ అన్నారు అంబేద్కర్! అదిప్పుడు నిజమై ఆయన ఆర్ద్రతనూ, ఆరాటాన్నీ ఇప్పుడు దేశప్రజలందరూ అర్థం చేసుకుంటున్నారు!


ఇది ప్రజాస్వామ్య సంక్షేమ రాజ్యమని మర్చిపోయి వ్యక్తిపూజ ప్రబలిపోతున్న ఈ సంక్షోభకాలంలో అంబేద్కర్ మహనీయుని ప్రాసంగికత మరీ మరీ అవసరం! అందుకోసమైనా అందరూ ఈ చిత్రాన్ని తప్పక చూడాలి!

అవార్డులు

1999లో 'డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్' ఉత్తమ చలన చిత్రంగా, మమ్ముట్టి ఉత్తమ నటుడుగా, ఉత్తమ కళా దర్శకత్వానికి నితిన్ చంద్రకాంత్ దేశాయ్ జాతీయ చిత్ర అవార్డులను గెలుచుకున్నారు! 70వ భారత స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇండియన్ డైరెక్టరేట్ ఆఫ్ ఫిల్మ్ ఫెస్టివల్స్, రక్షణ మంత్రిత్వ శాఖ సంయుక్తంగా సమర్పించిన స్వాతంత్ర్య దినోత్సవ చలన చిత్రోత్సవంలో ఈ చిత్రం ఆగస్టు 15, 2016న అంబేద్కర్ స్మృతిలో ప్రదర్శించబడింది. ❖

వెలుగు కోసం ఆరాటం!

బాలాజీ (కోల్‌కతా)



ప్రజల అభిమతం మేరకు ఎంపికైన చిలీ దేశపు మొట్టమొదటి మార్క్సిస్ట్ అధ్యక్షుడు సాల్వడోర్ అల్లెండే. 1970 లో పాపులర్ యూనిటీ అనే ప్రజాస్వామ్య కూటమి తరుపు అధినేత అయ్యాడు. కానీ, అపారమైన సహజ వనరులున్న చిలీలో అమెరికా కార్పొరేట్లకు స్వప్రయోజనాలున్నాయి. అల్లెండే వారికి అడ్డుగా వున్నాడు. ఫలితం ఎప్పట్లా మామూలే. 1973 లో ఎన్నుకోబడిన సోషలిస్ట్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా చిలీలో అమెరికా సిఐఏ మద్దతుతో సైనిక తిరుగుబాటు జరిగింది. ప్రెసిడెంట్ ప్యాలెస్ పై ఫైటర్ జెట్స్‌తో బాంబు దాడి చేశారు. అల్లెండే హత్య (ఆత్మ హత్య) తర్వాత మన యుగపు అతిక్రూర ఫాసిస్ట్ అయిన అగస్టో పినోచెట్ పాలన ఆరంభమైంది. అల్లెండే పట్ల సానుభూతి వున్న వేలాది మంది కమ్యూనిస్టులను, కళాకారులను, రచయితలను హింసించారు. వారిని హత్య చేసి ఆనవాళ్ళు



లేకుండా చేశారు. ఒక దేశాన్ని "తన సొంత ప్రజల బాధ్యతా రాహిత్యం కారణంగా కమ్యూనిస్టు దేశంగా మారడానికి అనుమతించలేమని" అమెరికా విదేశాంగ కార్యదర్శి హెన్రీ కిస్సింజర్ చెప్పుకొచ్చాడు. అటువంటి సామ్రాజ్యవాద దీవెనతో ఆ లాటిన్ అమెరికా దేశాన్ని పినోచెట్ రైటిస్ట్ టెర్రర్ కేంద్రంగా మార్చి, క్రూరమైన హత్యలతో 1990 వరకు ఏళ్ల తరబడి అణచివేత సాగించాడు. కొద్ది యేళ్ల ఉపశమనం, అభివృద్ధి తర్వాత నేడు నయాఉదారవాద దశలోకి చేరింది చిలీ. కానీ ఆ హంతక యుగపు నెత్తుటి జ్ఞాపకాలను మరవనీయకుండా, మరువవద్దంటూ ఆ చరిత్రను తెరకెక్కించాడు ప్రఖ్యాత చిలీ దర్శకుడు ప్యాట్రిసియో గుజ్మాన్.

దర్శకుడు ప్యాట్రిసియో గుజ్మాన్:

గుజ్మాన్ పేరు చెప్పగానే గుర్తొచ్చే సినిమా **ది బాటిల్ ఆఫ్ చిలీ** (1975-79). కళ్లెదుట జరుగుతున్న చరిత్రను, చిలీ వీధుల్లో నిల్చుని చిత్రీకరించాడు గుజ్మాన్. ఈ సినిమా కోసం సినిమా బృందం భారీ మూల్యాన్ని చెల్లించింది. తనను చంపడానికి వచ్చిన వాడిని తనే ఫిల్మింగు చేశాడు ఈ సినిమా ఛాయాగ్రహకుడు లియోనార్డో హెన్రిచ్‌సెన్. అంటే తనను షూట్ చేస్తున్న వాడినే తను షూట్ చేశాడన్నమాట. ఈ సినిమాతో సంబంధం ఉన్న సుప్రసిద్ధ ఫోటోగ్రాఫర్ జార్జ్ ముల్లెర్ సిల్వాను పినోచెట్ ఉరితీశాడు. దర్శకుడు గుజ్మాన్ ప్రవాసానికి వెళిపోయి ప్రాణాలు దక్కించుకున్నాడు. క్రిస్ మార్కర్ ఈ డాక్యుమెంటరీకి చెందిన 35 మి.మీ ఫిల్మును స్మగుల్ చేశాడు. ప్యాట్రిసియో గుజ్మాన్ తన వార్తాచిత్రాల పరంపర తర్వాతి కాలంలో కూడా కొనసాగించాడు. **చిలీ, అబ్సినేట్ మెమరీ** (1997), **ది పినోచెట్ కేస్** (2001), **సాల్వడార్ అల్లెండే** (2004) సినిమాలు పినోచెట్ తదనంతర కాలంలో వచ్చాయి. ఈ పరంపరలో 2010లో వచ్చిన ఆణిముత్యం లాంటి డాక్యుమెంటరీ **'నోస్టాల్జియా ఫర్ ది లైట్'** (వెలుగు కోసం వ్యామోహం).

నోస్టాల్జియా ఫర్ ది లైట్:

ఖగోళ శాస్త్రవేత్తలు ఏం చేస్తారు? విశాల విశ్వంలో ఎక్కడ్నించో ఏనాడో బయల్దేరిన కాంతిని టెలిస్కోపుల్లో నింపుకుని బ్రహ్మాండపు రహస్యాలను ఛేదించడానికి ప్రయత్నిస్తారు. కాంతి కోసం వారి ఆరాటం అపారమైనది. ఆ

కాంతి అన్వేషణ కోసం ఎంతటి నిర్జన ప్రదేశానికైనా ప్రయాణమవుతారు ఖగోళవేత్తలు.





ఉత్తర చిలీలోని అటాకామా ఎడారి సముద్ర మట్టానికి 10,000 అడుగుల కన్నా ఎక్కువ ఎత్తులో వుంది. ఇది నింగీ నేలా కలిసే చోటు. స్వర్గం, నరకం కలిసే చోటు కూడా. మన భూమిపై వున్న ఎత్తైన ఎడారి, అతి పొడిగా ఉండే ప్రదేశాలలో ఒకటి. అంతరిక్షం నుండి చూస్తే మన గ్రహం మీద గోధుమ రంగు మచ్చలా కన్పిస్తుంది. దాని పొడిగా ఉన్న భాగాలలో ఇప్పటివరకూ వర్షపాతం నమోదు కాలేదు. తేమ లేమి వలన ఇక్కడ ప్రతిదీ సంరక్షించబడుతుంది. సుమారు 2,000 సంవత్సరాల క్రితం కొండరాళ్లపై చెక్కబడ్డ కొలంబియన్ పూర్వపు పశుకాపరుల డ్రాయింగులు సైతం చెక్కు చెదరకుండా వున్నాయి. అత్యల్ప వాతావరణం, తక్కువ తేమ ఈ ఎడారిని ఖగోళ శాస్త్రవేత్తల ఆకర్షణ కేంద్రంగా మార్చింది.

అటకామాలోని ఎత్తైన ప్రదేశంలో వున్న రేడియో టెలిస్కోప్ లోపలి భాగాన్ని చూపుతూ మొదలౌతుంది సినిమా. అందమైన చందమామ బొమ్మలతో, ఖగోళ వింతల అపురూప దృశ్యాలతో సినిమా సాగుతుంది. తనకు చిన్ననాటి నుండి ఖగోళ శాస్త్రం ఎంతిష్టమో నేపథ్యంలో చెబుతాడు దర్శకుడు. అటాకామా ఎడారిలో నడుస్తూ, ఇది మనం రాబోయే రోజుల్లో చూడబోయే అంగారక ఉపరితలాన్ని పోలివుందని చెబుతాడు. ఇక్కడ్నించి ఈ ఎడారి ఈ డాక్యుమెంటరీకి కేంద్రంగా మారుతుంది. 'ఈ పొడి నేలలో ఎడారి చేపలు, మొలస్కులు, ఇండియన్ల చిత్రాలు, మమ్మీలుగా మార్చబడిన మానవుల కళేబరాలు' చెడిపోకుండా దాగున్నాయని చెబుతాడు.

'ఖగోళ శాస్త్రవేత్తలు, భూతత్వవేత్తలు ఇరువురూ గతాన్ని శోధించే పనిలోనే వున్నారు. మేము ఆకాశంలోకి చూసి అన్వేషిస్తే, వారు నేలను తవ్వి అన్వేషిస్తున్నారు' అంటూ చాలా తాత్వికంగా చెబుతాడు గ్యాస్పర్ గాలాజ్ అనే ఖగోళవేత్త. లౌతారో నీజ్ అనే పురావస్తు శాస్త్రవేత్త కూడా అటువంటి అభిప్రాయమే చెబుతాడు. 'వర్తమానంలో దొరికే ఆనవాళ్లతో భూమి పుట్టుక చరిత్రను తెలుసుకోడానికి ప్రయత్నిస్తున్నారు ఖగోళవేత్తలు. భూమిలో పాతుకుపోయిన భూమి చరిత్రను వెలికి తీస్తున్నాము మేము' అని చెబుతాడాయన. ఈ ఎడారిలో వున్న ఖనిజ సంపద కోసం స్థానిక ఇండియన్లను బానిసల్లా వాడుకున్నారు పంతొమ్మిదో శతాబ్ది సామ్రాజ్యవాదులు. వారి కడగండ్ల చరిత ఈ నేలలో వుంది. ఇది వందల ఏళ్ల మునుపటి చరిత్ర. కానీ నిన్న మొన్నటి నియంతృత్వపు చరిత్రతో ఈ ఎడారికి సంబంధమేమిటి అన్నది ఇకముందు చూస్తాం.

పినోచెట్ కాలం నాటి చాకాబుకో కాన్సంట్రేషన్ క్యాంప్ నుండి ప్రాణాలతో బయటపడిన లూయిస్ హెన్రాక్వెజ్‌ను ఇంటర్వ్యూ చేస్తాడు దర్శకుడు. 'ఈ క్యాంపులో ఖగోళ పరిశోధన చేసే ఖైదీలు వుండేవారటగా?' అన్న ప్రశ్నకు –'డాక్టర్ అల్వారెజ్ ఖగోళశాస్త్రంలో పరిజ్ఞానం ఉన్నవాడు. అతడు 20 మంది బృందానికి పగటిపూట థియరీ చెప్పి రాత్రి పూట ఖగోళ పరిశోధన చేయమనేవాడు. నేనూ ఆ బృందంలో వాడినే. ఆకాశాన్ని పరిశీలించినపుడు ఎంతో స్వేచ్ఛగా వున్నట్టు అనిపించేది మాకు. నక్షత్రమండలాల నమూనాలు గీయడం కూడా నేర్చుకున్నాము. కానీ ఖైదీలు నక్షత్రరాశుల పటాలతో క్యాంపు నుంచి తప్పించుకోగలరని సైనికులు ఈ పాఠాలను నిషేధించారు' అని చెబుతాడతడు. మిగ్యుల్ లానర్ అనే ఖైదీ అద్భుతమైన 'వాస్తుశిల్పి' అని చెప్పక తప్పదు. తను సందర్శించిన క్యాంపులను తను నడిచిన అడుగుల సంఖ్యల లెక్కలతో కొలిచి క్యాంపుల నమూనాలను వేయగల నిపుణుడు. గుర్తుపెట్టుకుని





జ్ఞాపకాలను మోసుకుపోగల సామర్థ్యం గల అతడి భార్య అనిత అల్జీమర్స్ వ్యాధి కారణంగా గతాన్ని మర్చిపోతూ వుంది. వీరిద్దరూ చిలీకి ఒక రూపకంలా కన్పిస్తున్నారంటాడు దర్శకుడు.

విక్టోరియా, వియోలెటా అనే ఇద్దరు వృద్ధురాళ్లు మనకు ఎదురౌతారు. పినోచెట్ మిలిటరీ జుంటా ఎత్తుకు పోయిన తమ ప్రియజనుల అవశేషాల కోసం ఎడారిలో తవ్వాకాలు చేస్తూ వెదుకుతూ జీవితంలో ఎక్కువ భాగం గడిపారు వీరు. విక్టోరియా ంంంకు తన భర్త పాదం అతను వేసుకున్న షూతో పాటు దొరుకుతుంది. అది ఆమెకు కొంత ఊరట. 'నా తమ్ముడి నోటి ఎముకముక్క దొరికింది. కానీ దాంతో ఎందుకు సర్దుకుంటాను? వారు నా సోదరున్ని సంపూర్ణంగా ఎత్తుకు పోయారు. వాడి శరీరం నాకు సంపూర్ణంగా దొరకాలి. నేను చనిపోడానికి ముందురోజు దొరికినా పర్వాలేదు' అని చెబుతుంది వియోలెటా. 'ఆ టెలిస్కోపులు నేలను శోధించగలిగితే ఎంత బావుణ్ను. ఈ ఎడారి అంతా గాలించి మావారి జాడ చెప్పేస్తేనో! మా అన్వేషణ సులువయ్యేది కదా?' అని వాపోతుంది. ఈ స్త్రీలను సినిమా ఆఖర్లో అబ్సర్వేటరీకి తీసుకువెళ్లి టెలిస్కోప్ చూపిస్తాడు దర్శకుడు.

వాలెంటినా రోడ్రిగెజ్ పసిపిల్లగా వుండగా ఆమె తల్లిదండ్రులను మిలటరీ వారు ఎత్తుకుపోయారు. ఆమెకు ఏ లోటూ లేకుండా



తాత, నాన్నమ్మలు పెంచారు. బాధను మరిపించడానికి ఆమెకు ఖగోళశాస్త్రంలో ఆసక్తి కల్పించారు. మిస్సింగు తల్లితండ్రుల బిడ్డననే బాధను మహా విశ్వదర్శనంలో మరిచిపోతాను అని ఆమె చెబుతుంది. 'అది, అంతం లేని క్రమంలోని బిందువులే కదా మా అమ్మా, నాన్నా అనుకుని సర్దుకుంటాను' అని చెబుతుంది. జ్ఞాపకల విలువను ధృవీకరిస్తూ డాక్యుమెంటరీని ముగిస్తాడు దర్శకుడు. *"జ్ఞాపకాలు మిగుల్చుకున్నవారు ప్రస్తుత క్షణాలలో కొంతైనా జీవించ గలుగుతారు. అది అసలు లేని వారు ఎక్కడా జీవించలేరు"* అని చెబుతాడు దర్శకుడు.


ప్యాట్రిసియో గుజ్మాన్ డాక్యుమెంటరీ ఖగోళ, భూగోళ పరిశోధనలనూ, సైన్సు, చరిత్ర పరిశోధనలనూ మేళవించి వీటితో చిలీ మహిళలు తమ ప్రియజనుల కళేబరాల కోసం చేస్తున్న అన్వేషణను జతపరిచింది. విశ్వాన్వేషణ, చరిత్ర అవగాహనకు సంబంధించిన తాత్వికమైన చర్చలేవనెత్తుతుంది. ఎడారిని శోధించే మహిళలు కాల్షియంను ఎముకల రూపంలో చూస్తుండగా, ఖగోళ



శాస్త్రవేత్తలు కాల్షియంను నక్షత్రాల అవశేషంగా, బిగ్ బ్యాంగ్ ఆధారంగా చూస్తున్నారు. ఖగోళ శాస్త్రవేత్తలు, పురావస్తువేత్తలు, బాధిత మహిళలు ఒకే ప్రయాణంలో ఉన్నారనీ, అంతా మూలాల కోసం శోధనే అని చెబుతాడు దర్శకుడు. మనిషి, జీవితం, చరిత్ర, విజ్ఞానం వంటి ఎన్నో అంశాలపై మన మదిలో ఎన్నెన్నో ప్రశ్నలు లేపుతుంది. ఈ సినిమా చూస్తున్నపుడు మిస్సింగ్ మనవాళ్ల, మనవరాళ్ల కోసం అమ్మమ్మలు, నాన్నమ్మలు చేసే పోరాటాన్ని చూపే **'అబూఎలాస్'** అనే లఘు చిత్రం గుర్తొస్తుంది.


దృశ్యాలు ట్రాన్సిట్ అవుతున్నపుడు కాస్మిక్ డస్ట్‌తోనే మనమంతా తయారయ్యామని చెప్పే మాదిరిగా చిత్రీకరణ వుంటుంది. చిన్ననాడు తను ఆడుకున్న గోలీకాయల్లో కూడా యూనివర్స్ చొప్పించి చూపే ఫోటోగ్రఫీ ఈ సినిమాకు హైలైట్. అంతే చక్కని సంగీతం కూడా. ఈ సినిమా యూరోపియన్ ఫిలిం అవార్డు, షెఫీల్డ్ డాక్యుమెంటరీ ఫెస్టివల్ అవార్డు, అబూ ధాబీ డాక్యుమెంటరీ అవార్డులతో ఇంకెన్నో అవార్డులు, విమర్శకుల ప్రశంసలు పొందింది. ❖

మహాసభలలో అరుణోదయ కళాకారుల సాంస్కృతిక ప్రదర్శనలు










BCI

MAHILA GONTUKA MATRUKA March 2023 RNI No. TEL TEL/2021/59091, Postal Reg. No. HSE/1023/2021/2023
Date of Publication: 2nd and 3rd of every month, Date of Posting: 4th and 5th of every month



ప్రతినిధుల సభలో స్వాగతోపన్యాసం ఇస్తున్న భాషాసింగ్



నూతన కార్యవర్గం



కా. పద్మ


కా. కవిత


కా. సంధ్య


కా. సుభద్ర


జెండా ఆవిష్కరణ




హాజరైన ప్రతినిధులు


నివాళి

If undelivered Please return to:
Ch. Padma
35-3-69(31/4)
Sanjay Gandhi Colony
Near Sarma College
Ongole 523001, Andhra Pradesh
9676206230

To,
Mr./Mrs.

Dr. K. Amar
Pragathi Nursing home
Chilakaluripeta
Palnadu District

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY CHOPPARA PADMA, PRINTED AT NAVYA PRINTERS, 3-6-194, OPP URDU HALL, HIMAYATHNAGAR, HYDERABAD - 500 029, PUBLISHED AT H.NO. 1-9-295/19/A-1, SRILAXMI NILAYAM, VIDYANAGAR, DIST. HYDERABAD, TELANGANA.
EDITOR : CHOPPARA PADMA

BC

మనసు ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

పుస్తకం సంఖ్య	KLVA106M179
పుస్తకం పేరు	మాతృక
తారీఖు	07 February 2025
ముందు అట్ట	Yes
వెనుక అట్ట	Yes.
మొత్తం పేజీలు	49
పెద్ద సైజు పేజీలు	No
ఖాళీ పేజీలు	No
లేని పేజీలు	NO
తయారు చేసినది	P. Jayamma
పేజీలు విడదీసినది	P. Nagamma
స్కాన్ చేసినది	[illegible]
పరీక్ష చేసినది	HEMA
పేజీలు పరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
పరిస్థితి	Good